Subhadrarjuneeyam



An
Original Drama in six acts
BY
HOTA VENKATA KRISHTNAYYA.

PUBLISHED BY
Parupudi Subba Rao
COCANADA.

Second Edition

Printed at Kamala Printing Works,
Cocanada.
1925.

12 As.] [Packing & Postage extra.

శ్రీ

సుభద్రార్జునీయము.

ఇయ్యది

ప్రతిపద్య రసాస్పదంబును మృదుమధుర పదభూయిష్ఠంబునగు

నారంకముల నాటకము.

హోతా వేంకటకృష్ణకవి ప్రణీతము,

గీ. విబుధవరులార ! పంచమవేదమనఁగఁ
బరగు భారతమందాదిపర్వమునను
వెలయు నీకథఁ జదివిన వినినఁ బాప
కలినఁజెడి గ్రాలు నానందప్రతారకముఁగ

రెండవకూర్పు

కాకినాడ.

పారుపూడి సుబ్బారావుగారిచే

కమలా ముద్రాక్షరశాలయందు

ముద్రింపించి ప్రకటింపబడియె.

దీని వెల రు 0—12—0.

దలంచిన నాటకంబునుఁ జూడ నతికుతూహలాయత్తచిత్తులై సభాసదు
లందఱు నిచ్చోట దయచేసి యుండిరన్నమాటయే మరచితిని. అన్నా!

చ. ఉరుగతి స్వాతికార్తెఁ గురియుం గద వర్షమటంచు శుక్తియుఁ
విరియుచు తమ్ములర్కుఁగని వెల్వడు లోఁబ్రియులంచుఁ గుట్మలో
త్కరి మధుపాళి కోరుకటుఁ బైబడి సత్కరుణాకటాక్ష మే
నరయఁగ నావయి న్నిగుల నల్గఁగదా యిక నేమిసేయుదున్.

నా వలపులపొంతి ప్రసన్నరాలయి నాకు సహకారిణి కాకున్నచో నే నీ
నాటకరాజంబు నెట్లు బ్రదర్శింపఁగలుగుదును?
నా ప్రియురాలింకనైనఁ బ్రసన్నురాలై వచ్చునేమో పిలిచెదను. నటీ! నటీ!

[అంత నటి ప్రవేశించి]

నటి—ఆర్యపుత్రా! నమస్కారము. (అని యభివందనం బాచరించుచున్నది)

సూత్రి—కల్యాణమస్తు. ప్రియురాలా! నీ యనుగ్రహమును సంపాదించుకొనుట
కేఁగదా నేఁ గాశీయాత్రకుఁ బోఁదలంచియుఁ బ్రయాణము మానుకొంటిని.
నే నీయనుగ్రహంబునకుఁ బాత్రుండనే?

గీ. కోమలాంగిరో! నీయుప గూహనంబు
కలుగుటే తీర్థయాత్రల ఫలమటంచుఁ
దలచితినిఁ గాదె యింక నీ వలుగనేల?
నన్ను మన్నింపవే సుప్రసన్నవగుచు.

నటి—(ప్రసన్నముఖియై) ప్రాణేశ్వరా! మీపై యలుంగుటకు నే నెంతటిదానను?
నన్నుఁ బిలిపించిన కార్యమేమొ యానతిచ్చెదరా?

సూత్రి—చిలుకలకొలికీ! నీవు నాయెడలఁ బ్రసన్నురాలవైతివిగాన నే నింక చరి
తార్థుండ నయ్యెదను. నే నిచ్చోట నొక మనోహరమైన నాటకముఁ
బ్రదర్శింప నుద్యమించితిని. మనోహారిణీ! ఈవంకఁ జూడుము.

మ. అరవిందాప్తశశాంకులం గనుటకై యాశాంగనల్ చీకటన్
దెరనింకెప్పుడు నూడఁదీయుదురొకో నేత్రోత్సవం బందనం

చురు చకోరి చకోరకంబు లెటులఁ • దృత్కంఠతన్వేచు నా
వరణేందు నాటకమాడఁ గోరెదరట • సభ్యులేతమిం జూడఁగన్

నటి—నాథా! ఇప్పుడిచ్చోట నేనాటకముఁ బ్రదర్శింప నార్యమిశ్రు లాజ్ఞాపించిరో వినఁగోరెదను.

సూత్ర—ప్రియురాలా!

ఉ. పంచమవేదమై పరగు • భారతమందలి గాథఁ దీసి య
భ్యంచితలీల నాటకము • నార్యులు మెచ్చ రచింపఁగాఁబడెన్
మించిన వేడ్క సభ్యులు న • మీహితులై కనఁగోర దాని ద
ర్శించి సుభద్రనద్వ్యజయ • వృత్తి సుకీర్తి నెసంగరాదొకో.

నటి—మనోహరా! మీరు దర్శింపఁ దలంచిన నాటకము సుభద్రార్జునీయమే నా?

సూత్ర—అవును.

నటి—(చిఱునగవుతో) దానినామమింత చతురముగ వెల్లడించితిరి! నాథా! ఈ నాటక మెవరిచే రచియింపఁబడెనో యానతిచ్చెదరా?

సూత్ర—ప్రియా! ఇద్దాని రచించిన కవిపేరు బహుజనవిశ్రుతంబైన దగుటచే నీవు నెఱింగియున్న దానవే. అయిన నొకింతుక దెల్పెద వినుము.

క. పాత్రిక నాథునికవి
వాత్రమున బుధులు కవిత్వ • వైఖరి మెచ్చన్
హోతా వేంకటకృష్ణయ
చేతోమోదంబునన్ ర • చించెను దీనిన్.

నటి—ప్రాణేశ్వరా! వికచప్రసూనపరాగకలితమ్యూతలంబునుంబోలె నత్యంత లలితకిసలయంబులపగిది చక్కనిదై లిని ద్రాక్షాపాకంబై మృదుమధుర పదభూయిష్ఠంబై యెల్లవారల రసనల నూఁటలూరించు కవితామృత రసంబును వర్షించు నా సత్కవిజలదంబు నెఱుంగనివారు గలరే?

ఆ.వె. తనరు రోహిణీసు • ధాకరవిజయంబు
నంత ద్రౌపదీస్వ • యంవరంబుఁ

దవిలి శశికళాసు • దర్శమునుఁ జేసె

కలితకీర్తి కృష్ణ • కవివరుండు.

సూత్ర—ప్రేయసీ! నీవు బాగుగ గ్రహించితివి. ఇంక నతివిస్తరమేల? ప్రకృత కార్యమునకై కడంగుము.

నటి—నాథా! ఏమి సెలవు?

సూత్ర—కలవాణీ! అవ్యక్తమధురమైన నీ కంఠధ్వనిచే గానానందరసంబు వెల్లి గొల్పుచు ముందుగ నీసభ్యుల వీనులకు విందొనర్పుము.

నటి—ఏఋతువు నాశ్రయించి పాడమనియెదరు?

సూత్ర—నన్ను వేఱుగ నడుగవలయునా? మనము ప్రదర్శింపఁదలంచినది శృంగార రసప్రధానమైన నాటకము కావున తద్రసపోషకంబును సకల భువనమనోల్లా సకరంబు నగు వసంతఋతువునే వర్ణించుచు గానము సల్పుము.

నటి—చిత్తము అలాగే చేసెదను.

జంఝూటిరాగం-ఆదితాళం

అహో! వసంత సమయ సౌఖ్య దివ్యవైభవం
ప్రహారి కాముక ప్రపంచ । చిత్తవిభ్రమం॥అహో॥
విరాజమాన మంజుల సుమ పుంజరంజితం
సరోజపుష్ప వాసనా ప్రశస్తశోభితం॥అహో॥
అనూన దళిత పుష్పవేదికా విలాసితం
వినూత్న కాంతి రమ్య లతాశ్లిష్టభూరుహం ॥అహో॥
మరందపాన చంచరీక గాన మేదురం
నిరంతరం మరాళ కేకినీ రవాస్పదం॥ అహో॥

మరియు,

చ. తరులు చిగిర్చి మంజులల • తల్వీరులం ధరియించెఁ జల్వతె
మ్మెరలునుఁ గమ్మతావుల న • మేళనవల్లనవీచెఁ దుమ్మెదల్

పరభృతకీరశారికలుఁ • బాటలనాటలఁ జొక్కుచుండ నా
సరసుల సైకతంబుల నె•సంగె మరాళ మయూర దంపతుల్

సూత్ర—ప్రియురాలా! సకలజనాహ్లాదకరంబగు నీవసంతాగమంబు తావకీన మనోహార గానకలాపాభివర్ణనచే నెంతయు నలరారుచున్నయది. కాని,

చ. అలరుచుఁ దీర్ఘసేవ విజ•యాప్తికి. గుప్పిమ్మరు గంధవాహుఁడు
జ్వలగతి నాకుపయ్యెదల•చాటునఁడాఁగుడుమూఁతలాఁడు దుర్
వెలివడఁ బూలబంతులన•వేడుకఁ జేకొని గూడుఁగొమ్మలన్
లలితగతి స్నభడ్రినిజ • లక్షణమే యిది మోహనాంగిరో

నటి—ప్రాణేశ్వరా! ఇప్పట్టున నూత్నయౌవనాభిరాములైన వనలక్ష్మికిని వసంతునకుఁ బరిణయము జరుగును గాఁబోలు.

(తెరలో)

ప్రియురాలా! నీయభిప్రాయము సరియైనదే.

(వెలుగు నభినయించుచు) ఏమిది! ఈధ్వని యెక్కడనుంచి వచ్చినది చెప్పుమా!

నాథా! ఆ సమాధాన మొసంగినవారు మీరేనా?

సూత్ర—కాదు. నాటకపాత్రము లప్పుడే రంగస్థలమునకు వచ్చియున్నవి.

ప్రియా! మన మింక ముందు జరుగవలసిన దాచరింతమురమ్ము.

నటి—చిత్తము (అని యిరువురు నిష్క్రమించుచున్నారు)

ఇది ప్రస్తావన.

శ్రీరస్తు.

సుభద్రార్జునీయము.

ప్రథమాంకము.

ప్రథమ రంగము : శ్రీకృష్ణుని యంతఃపురము.

[శ్రీకృష్ణుఁడు రుక్మిణియుఁ బ్రవేశించుచున్నారు]

శ్రీకృ—ప్రియురాలా ! నీయభిప్రాయము సరియైనదే. నేనుఁగూడ కనిపెట్టితిని. ఇన్నాళ్ళవలెఁగాక మనసుభద్ర యిప్పు డొక్కవిధంబుగ నున్నయది.

రుక్మి—ప్రాణేశ్వరా ! చూచితిరికదా.

ఉ. పున్నమచందురుం గెలుచు • మోమునఁ దళ్కు నఁగెన్ గులాబిపూ
వన్నియఁ జెక్కు లెత్తినయె • వాల్తెలిచూపుల మొల్కునవ్వులన్
సన్ననిపల్కులన్ సఖుల • సంగతినొప్పి సుభద్రయౌవనా
భ్యున్నతి నామెకుం బరిణ • యోత్సవ మాచరణీయమే కదా.

మీ రావిషయమై యేమి యాలోచింపుచుంటిరి ?

శ్రీకృ—పెద్దలు పై నుండ మన మాలోచింప నేల ?

రుక్మి—మనోహరా ! యౌవనవతియైయున్న మీ చెల్లెలను గుఱించి బావగారేమి ప్రయత్నములు చేయుచుండిరో ?

శ్రీకృ—దేవీ ! మా యన్నగారేకప్రయత్నంబును చేయకుండిరనియే తలంచెద. అయినను వారికిష్టుండగు వరుఁడు మన సుభద్ర కనుకూలుఁడగునో ప్రతికూలుఁడగునో చెప్పఁజాలను.

రుక్మి—బావగారి శిష్యుండగు వాఁ డెవ్వరై యుండునో ?

శ్రీకృ—గదాయుద్ధమం దాయనకుఁ బ్రియశిష్యుండగు దుర్యోధనుండే కావలయును

రుక్మి—అట్లని మీ రెట్లు నిశ్చయించెదరు !

శ్రీకృ—ఆయన శిష్యవాత్సల్యమునచే సుభద్రను దుర్యోధనున కొసంగు నభిప్రాయము తమకుఁ గలిగియున్నట్లు యదువీరులతో నప్పటప్పటఁ జెప్పుచుండ వింటిని.

రుక్మి—బావగారు మేనరికము మాట మరచిరి కాఁబోలు ?

శ్రీకృ—అర్జునుఁ డనియా నీ యభిప్రాయము ?

రుక్మి—అవును. అర్జునుఁడు మన సుభద్రకుఁ దగినవాఁడు కాఁడని తలంచెదరా ?

శ్రీకృ—మన తలంపులతో నేమి ప్రయోజనము ? మా వదినగారైన రేవతీదేవి యభిప్రాయ మెట్లుండెనో తెలిసికొంటివా ?

రుక్మి—ఆమెను నే నడుగలేదు. కాని మీ వదినగారి యభిప్రాయమును బావగారి యుద్దేశము ననుసరించియే యుండునని తలంచెద. ఇంతకు నేకాంతసహాయనై యంతఃపురంబున నుండు నాకొరుల యభిప్రాయంబు లెట్లు తెలియంగ నయ్యెడు?

శ్రీకృ—(చిఱునవ్వులతో వీక్షించి) ప్రియురాలా ! నిన్నొకించుక సేపు విడనాడి యుంటినని కోపించుచుంటివా ? కొండొక కార్యార్థమై పోయి రాఁ దడవయ్యెను. కినియకుము. నేను నీ క్రోధంబునకుఁ బాత్రుండను గాను. ఏమన,

శా. సత్యశ్రీవిధి గృష్ణుఁ డంచు జనముల్ • చెప్పింతు రెల్లప్పుడున్
నిత్యంబున్ని మహృత్సరోజమున మన్నించుచున్నముంజూడఁడ•
చత్యంతంబును గోపికానతులు స• న్మానించి సంప్రీతిమై
ప్రీత్యుద్దానము నాచరింప నిటు నా•పై కోపమే లేపిరియా.

రుక్మి—(దరహసితముఖియై) ఆర్యపుత్రా ! మీరు నిశ్చయముగ సత్యాశ్రయశ్రీధులే అయిన మీ రిప్పట్టున నాకు సన్నిహితులై యుండిరి అంతియ చాలును. మీ చెల్లెలకు మీ రెట్టివరు నారయుచుంటిరో చెప్పవైతిరి.

శ్రీకృ—పెద్దలు పై నుండ నే నారయ వలయునా ? అయిన మన సుభద్ర యభిప్రాయం తెలియంగకుండ నే నిపు డేమియు నిశ్చయింపజాలను. ఇంతకును గురుఫల్గుణా యనతిక్రమణీయంబు కదా. ఏమి జరుగనై యున్నదో తెలియరాదు

రుక్మి—నాథా ! ఈవిషయములోఁ బూజ్యులైన మీ తల్లిదండ్రుల యభిప్రాయ మెట్లుండెనో ?

శ్రీకృ—వారు మాయన్నగారి యభిప్రాయంబునకుఁ బ్రతికూలురయే యున్నట్లిప్పటికిఁ గాన్పించుచున్నారు. కాని ధర్మాధర్మవిచక్షణుండును సకలకార్యనిర్వాహణ సమర్థుండునై చేతి కందివచ్చిన యగ్రపుత్రుని మాట వృద్ధులైన మా జననీ జనకులు విశ్వసింపకుందురా ?

రుక్మి—అన్నా ! పాపము. చిన్ననాటనుండియుఁ దన మేనత్తకొమరుఁడగు నర్జునిపై మనంబు దవిలి యిప్పుడు నూత్నయౌవనప్రాదుర్భావంబగుటచే వానిపైఁ దమి యుగ్గలింప మన్మథభల్లభజ్యమానమానసయై రేయుంబవలు విరాళిఁ జెందుచున్న మన సుభద్రకీవార్త తెలిసినచో నేమియుపద్రవము తటస్థించునో కదా.

శ్రీకృ—(చిఱునవ్వుతో) పాపము- నీవుకూడ మున్ను శిశుపాలుని చేపట్టఁబట్టుట యిట్టి యుపద్రవముగానే భావించితివి కాఁబోలు.

రుక్మి—(సిగ్గుచేతలవంచి) ముంచేతికంకణంబున కద్దము కావలయునా ? (అని మొగంబునఁ జిఱునగవు మొలకలెత్తఁ గ్రీగంటిచూపులు పారించుచున్నది.

శ్రీకృ—ప్రియురాలా ! నేను కొలువుకూటంబునకేగి యీ విషయమై మాయన్నగారి యొక్కయు మా తల్లిదండ్రులయొక్కయు నభిప్రాయ మేక్రమంబుననుండెనో మరల తెలిసికొని వచ్చెదను. నీ వీలోపున సుభద్రకడకుం జని యా కన్నియ హృదయంబు తెలం గాంచిరమ్ము.

రుక్మి—చిత్తము. (అని యిరువురు వేర్వేర నిష్క్రమించుచున్నారు)

ప్రథమాంకము.

ద్వితీయరంగము : ద్వారకాపట్టణంబున వసుదేవునిసభామందిరము.

[బలరామసాత్యకులతో వసుదేవుడు దేవకీదేవియుఁ బ్రవేశించుచున్నారు]

వసు—కుమారరత్నంబులారా ! మనసుభద్ర యౌవనవతియై యున్నయది.

“ నిరాశ్రయా న శోభంతే పండితా వనితా లతా ”

అని పెద్దలు చెప్పుదురు. కావున మన యిప్పు డాకన్నియకుఁ దగిన యాశ్రయం బొనఁగూర్చుటకై తగిన వరు నారసి పరిణయ మొనర్పవలయును. అనుకూలుఁ డైన వరు నాలోచించి యెఱింగింపుఁడు.

బల—జనకా ! నాబుద్ధి కనుకూలుఁడని దోఁచిన వరు నెఱింగించెద నవధరింపుఁడు.

గీ. దళితకుసుమాంచితలతామ • తల్లియమర
తరువు నలమెడు కరణి గాం • ధారి యగ్ర
సుతుఁ గౌరవరాజ్యాధి • పతిని నాదు
శిష్యుఁ దుర్యోధను సుభద్ర • చెట్టఁబట్టు

సాత్య—అన్నయ్యా ! శిష్యవాత్సల్యముచే మీ రట్లు పలుకుచుంటిరి కాని రాజ్యమదాంధుండగు దుర్యోధనుండు మనసుభద్రకుఁ దగినవరుండె ?

చ. దురితరతుండు సదానుజన • దూషితుఁ డున్మదచిత్తుఁ గ్రూరు డు
శ్చరితుని భీరువున్ గుజన • సంగతి నొప్పు ససత్యభావుఁ గుస్
బరభృతలీలఁ బొందునర • పాలుని దిగ్విజయాప్తిఁ గ్రాలు నా
యుఱు కురురాజ్యమేలెడు ను • యోధను నింతఁ గగొప్పసేతు రే

మఱియు,

చ. ఎఱిఁగి యెఱింగి తెంపుఁ గొని • యేకరణిన్ గురురాజ్య మేలు నా
కటికటియైన నస్వరుని • గంటిరొ ధన్యసుభద్రివానికై

మెఱయుచునుండె నొక్క మణి♦భూషితమంచువిహారగంబు బా
ల్బరపెదె ముద్దుచెల్లెలను ♦ భావమునం దయలేదె సోదరా.

బల—ఓరిడింభకా ! నిరర్గళభుజార్గళవిజృంభణోపార్జిత సాంద్రతర యశశ్చంద్రికామండితదిగ్వలయుండును సర్వసర్వంసహాధూర్వహుండును విశేషించి నాకుఁ బ్రియశిష్యుండును మానధనుండు నగు రారాజును నాయెదుటనే తృణీకరింప సాహసించుచుంటివిరా.

వసు—కుమార ! హలాయుధా ! నీ ముద్దుతమ్మునిపై నేలరోషించెదవు ? శాంత వచనంబులఁ బ్రస్తుతకార్యము నాలోచింపుము.

దేవకి—పుత్రరత్నమా ! సాత్యకీ ! నీయన్నగారికిఁ గోపముఁ గలిగించితివేని జరుగవలసిన దొకటియు జరిగెది వే యొకటియుఁ గాఁగలదు.

సాత్య—(బలరామునితో) అన్నయ్యా ! సర్వము నెఱింగినవారయ్యు మీ రేల నాపై రోషించెదరు ? దుర్యోధనుని బాహుపరాక్రమం బెవ్వ రెఱుంగరు ?

చ. గురునిఁ బరాభవించెనని ♦ కోపమునే ద్రుపదక్షమావిభుం
బరువడి పట్టి తెత్తునని ♦ పంతముతోఁ జని యాజి నాత్మసో
దరులును దాను బాహుబల ♦ దర్పితులై కదియంగ వానిచేఁ
దరుమఁగఁ బడ్డవాఁడె విది♦తంబమె తద్బలశౌర్యసంపదల్

బల—ఓరీమూర్ఖా ! నిఖిలనరపాలమకుటమాణిక్యలసితపాదపంకేరుహుండై యఖండరాజ్యలక్ష్మీరమణుండగు దుర్యోధనునికన్న మనసుభద్రకుఁ దగినవరుఁ డెండుఁ గలుగునురా ?

క. ఈ రేడుజగంబులలో
నా శేవికి సాటిగలరె ♦ యైన వినుము ధా
త్రీరమణుఁ డతఁడె తగుఁగా
కేరీ వేల్పడచి యొకని ♦ నెఱిఁగింపు మికన్.

సాత్య—అన్నయ్యా ! ఏ మట్లుపలికెదరు ?

క. ఈ రేడు జగములంతటి
దూరం బరయంగ నేల • దోర్బలజితదు
ర్వారరిపుఁడు మేనత్తకు
మారుం డర్జునుఁడు తగఁడె • మన చెల్లెలికిన్.

మరియు, సర్వజ్ఞులగు మీవంటివారికిఁ గన్యాదానంబు లెట్టివరుల వివాహమాడ విధ్యుక్తములో తెలియకుండునే ?

చ. కులమును రూపమున్ గుణ మ• కుంఠితతేజము బాహువీర్యమున్
సలలితశీలమున్ నతిత • సత్యవచోరచనాకలాపమున్
విలసితసత్కళాకలిత • విశ్రుతకీర్తి విహారవైఖరిన్
గలిగి చరించు సవ్వరునిఁ • గన్యక కోరు వివాహమాడఁగన్

మన మేనమరందిరైన యర్జునునందిన్నిలక్షణంబులు నొప్పుచుండుటచే నాతండే మన సుభద్రకుఁ దగినవరుఁడు.

బల—ఓరీ యజ్ఞానుఁడా ! ఆ కౌంతేయుల సంగతి నీ వెఱుంగవు కాఁబోలు. చెప్పెద వినుము

సీ॥ తండ్రిపోయినదాది • ధార్తరాష్ట్రులయింట, వెళ్ళఁబుచ్చిరి కొన్ని • నాళ్లు పిదప
నుండఁ గొంపయు లేక • పండ మంచము లేక, యడవుల పాలయి • యలసి యలసి
వగఁ జెంది దీనులై • వెంగము వాచిరి కాదె, కుడువఁ గూటికిఁ గట్టు • గుడ్డలకును
ఏకచక్రపురంబు వీకతోఁ జని యంత, భైక్షుకవృత్తి చే • బ్రతుకలేదె-
గీ॥ పుట్టినదియాది గారాబ • మునను బెనిచి
పొట్టకూటికి దారిలే • నట్టివాని
కిచ్చి " నీ మగనితోడ ము • ష్టెత్తుమమ్మ "
యనుచుఁ జెల్లెల నంపుదె • యల్పబుద్ధీ॥

వసు—కుమారా ! బలరామా ! నీ వేల కౌంతేయుల నిరాదరించెదవు ! వారు నీకు మాత్రము మేనత్తకుమారులు కారా ? విశ్వాతుకంబుగ వారి నెత్తి పొడుచుట ధర్మమే నటోయి ? పురాకృతకర్మం బెరిక్కైన ననుభవింపక దీరునా ? వారి వర్తమానస్థితి దలంపవలయు నేగాని తత్పూర్వస్థితిఁ దలంప నేల ?

దేవకి—నాయనా! హలధరా! వారందఱు నీ తండ్రిగారి సోదరీపుత్రులన్నమాట మఱచితివా యేమి? (అని యిటు నటు జూచి) అదిగో మనకృష్ణుండు నిటులనే వచ్చుచున్నాఁడు.

[అంత శ్రీకృష్ణుండు ప్రవేశించుచున్నాఁడు]

శ్రీకృ—జననీజనకులారా! నమస్కారము. అన్నయ్యా! నమస్కారము.
(అని గురువుల కభివందనం బాచరించి పార్థుని ప్రక్కఁ గూర్చుండుచున్నాఁడు)

వసుదేవకి—కుమారా వర్ధిల్లుము.

శ్రీకృ—(అందఱను గలయఁజూచి చిఱునవ్వుతో) ఇప్పుడిచ్చోట సుభద్రకుఁ బెండ్లిమాటలు జరుగుచుండెను గాఁబోలు.

పార్థు—అవు నన్నయ్యా.

శ్రీకృ—(బలరామునివంకఁ జూచి) అన్నగారు నేఁ డేలనో కుపితులై యున్నట్లు దోఁచుచున్నది.

బల—కృష్ణా! వింటివా (అని పార్థునిఁ జూపి) ఈమూర్ఖుని దుస్సాహసము.

చ. అగణితరాజ్యభోగముల • నందు సుయోధనుఁడే సుభద్రకుం
దగినవరుం డనంగ మరి • తా నతనిం గడు ధిక్కరించి న
వ్వఁగ మొగమోటమింగ నకఁ బార్థుని మేనమఱందియౌటఁ బెం
పగు వరియింపఁ జెల్లెల • కటంచును బ్రేలుచునుండె మూర్ఖుఁడై

(అని తిరస్కారముగా) వీఁడు దుర్యోధనార్జునుల తారతమ్యము లేమెఱుంగు?

పార్థు—అన్నయ్యా! నేనే కాదు. లోకమంతయు నెఱుంగు. ఇంతయేల.

చ. గురుఁడు పరీక్ష సేయునెడఁ • గూల్చి విహంగ శిరంబు లీల నా
కురుపతియో నరుండో తమ • కు న్విశదంబు మెద్రోవదీస్వయం
వరమున మత్స్యయంత్రిమిల • పైఁబడగొట్టి గ్రహించె గన్య నె
వ్వరో దురమున నోడిన దె • వండో యెఱుంగరె వారి యిర్వురన్

బల—కృష్ణా! వింటివా వీని దుష్ప్రలాపంబు లెట్లుండెనో.

శ్రీకృ—అన్నయ్యా! చిఱుతవాని మాటలు పాటిసేయ మీపోటుల కుచితంబె?

బల—తమ్ముడా ! శ్రీకృష్ణా ! ఈవిషయములో నీ యభిప్రాయ మేమి ?

తరల. కడుదరిద్రుఁడు గాఁడె పార్థుఁడు ♦ కంసమర్దన మున్ను తా
కడుపుకక్కుఱితిం జరించెఁడె ♦ కానిచోటుల దీనుఁడై
పుడమి నేలు సుయోధనుండు వి ♦ భూతి గ్రాలుచునుండఁ బెం
పడర నిప్డు సుభద్రఁ గైకొన ♦ నర్హుఁ డెవ్వరొ చెప్పుమా

శ్రీకృ—అన్నయ్యా ! పెద్దలంద ఱీత్రోవను నడచెదరో నేను నాత్రోవ నేబోయెదను. (అని యుపచారించి సాత్యకితో) తమ్ముడా ! పూజ్యులైన యీ మనయన్నగారితో నీ వేల వాక్కలహముఁ గొనితెచ్చెదవు ? ఏది యెట్లు జరుగవలయునో యది యట్లు జరుగక మానదు. అదంతయుఁ బెద్దలు చూచెదరు నీ కాగొడవ యేల ?

సాత్య—(కృష్ణునితో) అన్నయ్యా! మీరు చెప్పవలసినది చెప్పిరి. కాని నావిన్నపం బొకించుక నవధరింపుఁడు

ఉ. చిత్తము పల్లవింపఁగను ♦ చిన్నటనుండియు బంధులెల్ల మే
నత్తకుమారుఁ డౌట నల ♦ యర్జును నెంచఁగ "నాకు నెట్టిసం
పత్తు ఘటిల్లె" నంచును సు ♦ భద్రయు నువ్విళులూరుచుండఁ దా
నుత్తలపాటుఁ జెందదె సు ♦ యోధనుఁడే వరుఁడంచెఱింగినన్

శ్రీకృ—సాత్యకీ ! పూజ్యులైన యన్నగారి కట్టియూహ కలగనప్పుడు మన మేమి చేయనగు ? గురువులయాజ్ఞ యలంఘనీయమని యెఱుంగవే ? అయిన మన జననీజనకుల యభిప్రాయ మెట్లుండెనో తెలిసికొనియెదను- (అని తల్లిదండ్రులతో) జననీజనకులారా ! పూజ్యులైన మా యన్నగారియొక్కయు సాత్యకియొక్కయు భిన్నాభిప్రాయంబులలో మీరు దేని నామోదించెదరు ?

వసు—కుమారా ! నాబుద్ధికిఁ జూడ సాత్యకియభిప్రాయమే కొంతవర కుచితముగా నున్నటులఁ దోచుచున్న యది-

దేవకి—నాయనా ! శ్రీకృష్ణా ! నాకు నటులనే దోచుచున్నదోయి-

బల—(కోపముతో చివాలున లేచి) ఏమేమీ ! మీరందఱు బుడుతవాని నుడువులనే

గడన జేయుచుంటిరిగా ? కుసుమకోమలి యగు నా చిన్నారి ముద్దుచెల్లెలను గటికిదరిద్రున కిచ్చి వివాహము చేసెదరుగా ?

మ. అనుజుల్మీరలు తల్లిదండ్రులు వినం ♦ దస్మత్ప్రతిజ్ఞ న్సుభ
ద్రను దుర్యోధనుఁ డక్క వేఁ యొకనిఁ జెం ♦ దం జేయఁగా శక్యమే
దినమందు న్నిశియందు నీహలముచే ♦ దీపించుచు న్సోదరీ
జనిగాఁ గాచెద నెట్లుఁ జేర నగు మీ ♦ పార్థుండు గీర్థుండికన్.

శ్రీకృ—(లేచి బలరాముని సమీపించి) అన్నయ్యా ! మన యనుంగుచెలియలి క్షేమమును మన మందఱమును గోరువారమే కదా సంభ్రమంబున మీ రేల యిట్టి దుష్కరప్రతిజ్ఞఁ బట్టితిరి ?

బల—(తిరస్కారముతో) కృష్ణా ! నీ మిథ్యావినయోక్తు లిక చాలింపుము. మీరు నిశ్చయముగ సుభద్ర క్షేమమునే గోరువారైనచో మూర్ధాభిషిక్తుండును గుణగరిష్ఠుండును రూపవిజితమన్మథాకారుండు నగు దుర్యోధనమహారాజున కాకన్నియ నొసంగ మీ రేల యిష్టగింపకుందురు. ఛీ ! మీ రందఱుఁ గేవలము పాండవపక్షాభిమానులే. మీతో నిచ్చట నుండుటకుఁగూడ నాకసహ్యమగుచున్నది. ఇదే నేఁ బోవుచుంటిని.

(అని నిష్క్రమించుచున్నాఁడు)

శ్రీకృ—(దేవకీవసుదేవులతో) జననీజనకులారా ! అన్నగారు దురాగ్రహావేశంబున సభఁ దొలంగిపోయిరి. వారి ననునయింప మీరే సమర్థులరు. కావున శీఘ్రంబుగ మీ రుభయులుఁ జని వారిని శాంతచిత్తులఁజేసి ప్రసన్నులగునటులఁ జేయవేడెదను.

వసు—కుమారా! అటులనే చేయఁ బ్రయత్నించెదను. (అని దేవకీదేవితో) ప్రేయసీ ! నీవుకూడ నావెంట రమ్ము. (అని యిరువురు నిష్క్రమించుచున్నారు)

సాత్య—అన్నయ్యా ! మనయన్నగారు నిర్హేతుకముగ నాపై యలుకవహించి యెంత నిష్ఠురమైన ప్రతినఁ బట్టిరో చూచితిరే. నావలన నేర మేమైన యుండెనే ?

శ్రీకృ—తమ్ముఁడా ! పూజ్యులైన యన్నగారితో నీ వేల వాదమునకుఁ జొరబడితివి? అది నేరముకాదా ? పెద్దల ధిక్కరించి వారితో వితండవాదమాడుట పిన్న

లకు శ్రేయస్కరమటోయి.

సాత్య—ధర్మసూక్ష్మము నెఱింగిన పెద్దలే న్యాయ విషయంబుల నిరాదరించి కేవల మన్యాయంబుగ నాగ్రహించిన నేమి చేయుదును. ఇంతకును మన మేనత్త కుమారుఁడైన యర్జునునితో దుష్టదుర్యోధనుం డేవిషయంబున సాటియగునో విచారింపుఁడు,

మఱియు

ఉ. నిర్జితశాత్రవుండు కమనీయ గుణాంచిత దివ్యమూర్తి వి
స్ఫూర్జితకీర్తి సాంద్రుఁడు విశుద్ధచరిత్రుఁడునై తనర్చు నా
యర్జునుఁడే మగం డనుచు నాత్మవరించిన సాధ్వి యిప్పు డా
దుర్జనుఁడౌ సుయోధనుని దుర్మదచిత్తు వరించు టెట్లొకో

శ్రీకృ—తమ్ముఁడా! సామ్రాజ్యధురంధరుండగు దుర్యోధనుని దూషింప వచ్చునా! ఆతండు దుర్జనుం డెట్లయ్యె?

సాత్య—అన్నయ్యా! ఏమట్లనియెదరు?

ఉ. మర్మ మెఱుంగనట్టి జన మాన్యచరిత్రులఁ బాండవేయులన్
దుర్మతియౌచు బిల్వడలఁ దోఁచడె భీమునిఁ జంప నెంచడే
యక్కలి లక్కయింట నిశి యందఱఁ గాల్పఁ దలంచె వట్టిదు
ష్కర్ముఁ డతండు దుర్జనుఁడు గాకిక సజ్జనుఁడే సహోదరా.

శ్రీకృ—తమ్ముఁడా! అతం డెట్టివాఁడైనఁ బుట్టుభోగియై యైశ్వర్యంబునఁ దులదూగు చుండఁడే? మన చెల్లెలు వానిఁ జేపట్ట నంగీకరించు నేమో.

సాత్య—అన్నయ్యా! నిశ్చయమైన యనురాగము గలిగించుటకు గుణము ప్రధానము కాని యైశ్వర్యము ప్రధానము కాదు.

శ్రీకృ—తమ్ముఁడా! నీవు చెప్పునది న్యాయ్యమైనను విలువిద్యయందు నీ వర్జునుని శిష్యుండ వగుటచే లోకులు నిన్నే మందురు?

సాత్య—అర్జునపక్షపాతి సాత్యకి యని యందురు కాఁబోలు.

శ్రీకృ—సందేహ మేమి?

సాత్య—పరేంగితజ్ఞానపారీణుల కట్లెన్నటికినిఁ దోఁచదు. తదితరుల కట్లు దోఁచినను లోపము లేదు సమస్తవిషయములలోను సకలభువనసంస్తవనీయుండగు నయ్యర్జును నొక్క సాత్యకి యగ్గించు టబ్బురంబె?

కవిరాజవిరాజితము.

సరసిజనేత్రుని సన్నుతిపాత్రుని శౌర్యధనుం రిపులోకభయం
కరు పటువిక్రము గర్వవిదూరు న ఖండకళానిధినట్లు సహో
దర! నిరసించుటధర్మమె రాజ్యము దంబుననొవ్వను యోధును నె
వ్వరు గణియింతురు? పార్థునిఁగాక సుభద్రవరింపదు వేఱొకనిన్

శ్రీకృ—(చిఱునగవుతో) ఏమి! నీవు నాకప్రతిన పట్టుచుంటివా? వెఱ్ఱితమ్ముఁడా! పెద్దల యుద్యమంబును వారించి నీపూనిక నెట్లుకొనసాఁగఁ జేసికొనియెదవు?

పార్థ—అన్నయ్యా! న్యాయమైనపూనికని భగవంతుఁడు కొనసాఁగఁజేయకుండునా? నే వేఱుగ బ్రయత్నింపనేల? అకార్యకరణమునకు దైవమెప్పుడును దోడ్పడఁడు. కావున నట్టిదానికై యెవ రెంత ప్రయత్నించినను లాభములేదు.

శ్రీకృ—తమ్ముఁడా! నిశ్చయముగ నీ కట్టియభిప్రాయము కలదేని యదేల వ్యర్థంబగు? నీవు వేవేగ జని మన యన్నగారి కోప ముడిగించి యాయనను బ్రసన్నునిఁ జేసి రమ్ము.

పార్థ—చిత్తము. (అని నిష్క్రమించుచున్నాఁడు)

శ్రీకృ—(స్వగతము) ఏమి మా యన్నగారి యహంకారము!

ఉ. అబ్బె సుభద్రకు న్వరుఁడనంతగుణుండు సుయోధనుండటం
చుబ్బుచు సంభ్రమంబున నిజోద్యమమున్ బ్రకటించియద్దిశ
బ్బిబ్బగు నేమొయంచలిఁగి వెల్వడిపోయె నుకొల్వునుండియా
గుబ్బుగమందుమంటడఁగకున్న ప్రశాంతుఁడు గాఁడె యన్నయున్

మా చెల్లెలైన సుభద్ర నిక్కముగ నర్జుననే యాత్మభర్తగా వరించి యుండెనట. మేనత్త మేనమామబిడ్డలగుటచే నాకన్నియ కాతనిపై నట్టి యనురాగము కలుగుట సహజమే. ఎప్పట్టున నైన సహజప్రేముల సార్థకపరచుటయే కదా ముఖ్యము. కావున నే సర్వవిధములచేతను వారల సంఘటనంబు సమకూర్పఁ బ్రయత్నించెదను. రుక్మిణీదేవి ప్రయత్న మేమయ్యెనో తెలిసికొని వచ్చెదను. అని శ్రీకృష్ణుఁడు నిష్క్రమించును.

తృతీయరంగము : లతామంటపము.

[అంత లతామంటపంబున రుక్మిణియు సుభద్రయు ప్రవేశించుచున్నారు]

శ్రీకృష్ణుఁడు—ప్రవేశించి (తనలో) యిదిగో రుక్మిణీ సుభద్రలీ లతామంటపంబునఁగూర్చుండి యేమేమో ముచ్చటించుకొనుచున్నారు. నే వారికంటఁ బడితినేని వారి స్వేచ్ఛాప్రసంగంబునకు భంగము కలుగును. కావున నే నిందుకపడి యీ మంటపంబు మాటునఁ గూర్చుండెదను. (అని యట్లుచేయుచున్నాఁడు)

రుక్మి—ఏమమ్మా వదినా! నేడు నీ వేకతంబ ప్రసన్నముఖివై యీ లతామంటపంబునఁ గూర్చుండి యేమి యాలోచించుచుంటివి?

సుభ—వదినా! ఏమియులేదు. మల్లెపూవుల కమ్మతావుల కాసక్తిఁగొని నే నిట వచ్చితిని. ఈగులాబిపుష్పం బెంత మనోహరంబుగా నున్నదో చూడుము! (అని పుష్పమును సహర్షంబుగఁ జూచుచున్నది)

శ్రీకృ—(తనలో) నాచెల్లెలు దేనిని మర్శించుచున్నది కాఁబోలు ఏమి యీచిత్రము

క. ఈవిధి మర్మించుటకై
దేవకిఁ జూపెడు సుభద్ర ♦ దివ్యసుమమున్
భావజుఁడు నేర్పు చెలులకు
యౌవన మొదవంగ నిట్టి ♦ యనదృశలీలల్.

రుక్మి—(నవ్వుచు) వదినా! ఎంత వగలాడివైతివి. నీ వెంతమర్శించినను—

క. అనదృశమగు నీ చూపుల
వన మెయి సోయగము నీకు ♦ భావంబెల్లన్
బిసరుహాననరో తెలిపెడు
ముసిముసినగవులను నన్ను ♦ మురిపించెదవో.

నీసంగతి నే నెఱుంగుదునులే. (అని గులాబిపుష్పంబుఁ జూచుచు) వదినా! నీకు దీనిరాగంబుఁ జూడ ననురాగంబు కలిగెనా యేమి? (అని మేలంబుగ సుభద్ర చేతిలోని పుష్పంబును లాగఁబోవుచున్నది)

సుభ—ఇట్టిపుష్పంబు లేకకైన హృదయాహ్లాదకరంబులు గాకుండునా?

రుక్మి—వదినా!

ఉ. తోల పదేమి పుష్పమునఁ • దుంటరితుమ్మెదవ్రాలెచూడు మే
లీలను ముంచి తొండము బ • లీమకరందము గ్రోలుచుండెనో
బాలరొ నీ మనంబు మధు • పం బన నవ్వనిపూత్తమంబునన్
వ్రాలెనొ యీగతిన్ సరస • వారిజపత్రవిశాలలోచనా.

శ్రీకృ—(తనలో) ఇప్పుడు సుభద్ర యేమనునో వినవలయును

సుభ—వదినా! నన్నుఁ బరిహాసించుచుంటివా? మనోహరములైన పుష్పంబులపై చంచరీకంబులు వ్రాలు టాశ్చర్యమే. నిర్దయత్వంబున దానిఁ దోలనేల? శోభాయుక్తములైన పుష్పంబు లేరికైన మనోహరంబులే కదా.

రుక్మి—ఆహా! ఈపుష్పమెంత రమణీయము గానున్నది! వదినా! ఈప్రసూనము,

చ. అనుపమరాగసంపదల • నర్థిమెయిం గనువారి నెల్ల న
త్యనుపమరాగసంపదల • నందఁగఁ జేయుచు నిన్నుఁ బోలు యా
వనవతి పెండ్లికూతు రగు • పట్టునఁ గల్గు ముఖానురాగముం
గన నిటువంటిదే యనుచుఁ • గన్యరొ తెల్పుచునుండెచూచితే

మఱియు

క. నూరు దళంబుల మధ్యను
జేరుచు నైశ్వర్యమనెడు • కింజల్కములు చేఁ
బేరిమి గాంచు ప్రసూనము
గోరితి కాఁబోలు నీవు • కుందరదనరో.

సుభ—వదినా! నీ వేల నర్మగర్భంబుగ మాట్లాడెదవు? నే నేమి చేసితిని?

శ్రీకృ—(తనలో) దేవి యభిప్రాయము సుభద్ర తెలిసికొనిరయి కాఁబోలు.

రుక్మి—ముద్దరాలా! నీ వేమి చేసితివో యిప్పు డేమి చేయఁదలంచితివో నీ మనస్సులో నీ వెఱుంగకుంటివా?

శ్రీకృ—(తనలో) ఏమి దేవి నైపుణ్యము!

క. తన మేనత్త కుమారునిఁ
జనువునఁ బెండ్లాడఁగోరు • నకియ మనము రు

క్మిణి దుర్యోధనుని పయిన్
జనఁ జేసెడుఁ దనమృదూక్తి చతురతను బళే.

సుభ—వదినా! నే నేమియు నెఱుంగను. నీ యభిప్రాయ మేమో తెల్పుము.

రుక్మి—నీ వెంత వంగనాచివమ్మా! కురురాజ్యంబునకెల్ల మూర్ధాభిషిక్తుండై రారాజని బిరుదు వహించిన దుర్యోధనుని పెండ్లాడి కురురాజ్య పట్టమహిషివి గాఁ దలంచిన సంగతియు నెఱుంగవు కాఁబోలు.

సుభ—(కోపముతో వెనుకకునడిచి) ఏమిది! దురాత్ముండగు దుర్యోధనునిమాట దల పెట్టితివా? ఒకవేళ నేను పొరబాటుగ వింటిని కాఁబోలు. వదినా! వదినా! నీవు నిశ్చయముగ రుక్మిణీదేవివేనా? ఆ చండాలునిమాటయే నీవు వచించినచో నీ వొక కపటరుక్మిణివై యుండవలయును.

శ్రీకృ—(తనలో) ఇంక సందేహింప నేల. నా చెలియలు దుర్యోధనుని వరింపదనుట నిశ్చయమే. ఇంకను దేవి యేమనునో.

రుక్మి—వదినా! భ్రాంతిఁ జెందకుము నేను నిశ్చయముగ రుక్మిణినే. కఠినోక్తులచే దుర్యోధనమహారాజు నేల తృణీకరించెదవు? వెఱ్ఱిదానా! చక్రరక్షకులవలె నిరంతరము నీ క్షేమము గోరుచుండు నీ జననీజనకులును నీ యనుంగు సోదరులును నిన్ను చిన్ననాటనుండియు నతిగారాబముగా పెంచి పెనిచి చివరకు రాజాధిరాజు వరించిన నొల్లక నిన్నొక సామాన్యునకుఁ గట్టబెట్టెద రనుకొంటివా?

• శ్రీకృ—(తనలో) బళే! సుభద్ర హృదయంబు తెలియు దేవి బహునిపుణముగ బరీక్షించుచున్నది. ఇందుకు సుభద్ర యేమనునో.

సుభ—(కన్నుల నీరు నించి) వదినా! నిర్దయులై నా తల్లిదండ్రులును నా తోడంబుట్టువులును నన్ను నిశ్చయముగ స్వర్ణకంచుకితక్రూరసర్పంబగు నాసర్పధ్వజ పాలికునకే బలి యివ్వ దలంచిరా?

శ్రీకృ—(తనలో) ఇంక నే నిచ్చో నుండవలసిన పని లేదు. రుక్మిణి నడిగి తెలిసికొనవలసిన విషయంబును నే నే యూహించితిని. కావున యనంతరకర్తవ్య మాలోచింప నే నిపు డంతిపురంబున కేగి రుక్మిణి రాకకై నిరీక్షించుచుండెదను. (అని నిష్క్రమించుచున్నాఁడు.)

రుక్మి—అమ్మాయీ ! అట్లనకుము నే నెన్నడైన నసత్య మాడితినా ? నిన్నా దుర్యోధన మహారాజుగారి కిచ్చి వివాహము చేయుటకే నీ పెద్దన్నగారు నిశ్చయించినారు.

సుభ—హా ! అర్జునా ! (అని మూర్ఛాపరవశురాలై భూమిపై వ్రాలుచున్నది)

రుక్మి—(సంభ్రమించుచు) అయ్యో యేమిది ! ఈ కన్నియ మూర్ఛిల్లి నట్లున్నదే ఏమి చేయుదును ? (అని చెంగుగూర్చుండి విసరుచున్నది)

సుభ—(మూర్ఛ తెలసి మెల్లగ లేచి తనలో) హా సోదరా ! బలరామా !

ఉ. హా వసుదేవ! దేవకీ! హ, లాయుధ! రేవతీ! కృష్ణ! సాత్యకీ!
ఈక్షితిలోఁ బుట్టువని • యెంచక గాంచవపంజరంబులో
కేవలసౌఖ్యముం గొనెడు • కీరము నొక్క కిరాతు బారికిన్
బోఁపడువంగఁ జూచు గతి • బుత్తురె నన్ గురురాజు పాలికిన్.

హా హతవిధీ ! నే చివర కిట్టి నిర్భాగ్యురాలనైతినా ! (అని రుక్మిణిమూపుపై వ్రాలి తనలో)

చ. మొలకవనుండిన న్వేలుఁగె • మేయఁగఁ జొచ్చినఁ జేనుఁగాచు వా
రిల నొరు లెవ్వరైనఁ గల • రే యిటులన్న లుఁదల్లిదండ్రులే
మొలకగ నన్న హా!కురు • శేషభుజంగము వాతఁద్రోయఁగా
దలఁచిరె యింక నెట్టులో క• దా మరియెవ్వరు దిక్కు లేరొకో
(అని యేడ్చుచున్నది)

రుక్మి—అమ్మాయీ ! ఏల విచారించెదవు ? ఊరడిల్లుము ఊరడిల్లుము.

సుభ—వదినా ! ఏమని యూరడించెదవు ?

ఉ. పుట్టెను మేనమామకుఁ • పుత్రిక గొంతికిఁ గోడలౌను చే
పట్టి కిరీటి నందు మన • పట్టణవాసులనంగ నిబ్బి నే
మిట్టిపడంగ మిన్నిటిగ • మీద నబద్ధగతిన్ హలాయుధుం
డిట్టిట్రోత్రిజ్ఞ బట్టె నిక • నేక్రియ నర్జును చెట్టఁ బట్టెదన్.

రుక్మి—వదినా ! ఏమి చూచి నీ వా యర్జునుని వరించితివి ?

సుభ—వదినా ! అజ్ఞానవతులవలె నీవు నట్లడిగెదవేమి ?

మ. మతిమంతుండని మోహనాంగుడని ♦ సన్మాన్యచరిత్రుండంచు ని
ర్జితశత్రుండని సత్కళాకలితరా ♦ జీవాక్షుఁ డం చర్జునున్
నుతిసేయ న్విని నే వరించితిని బు ♦ ణ్యున్నా మది న్భర్తఁగాఁ
గుతుకం బారఁగ మేనయత్త కొడుకుం ♦ గుంతీసుతుం బార్థునిన్.

రుక్మి—అమ్మాయీ! ఏమి బావుకొనుటకై నీ వా యర్జును చెట్టబట్టెదవు? కౌంతేయులు తండ్రిపోయినది మొద లెట్టి యవస్థల ననుభవించిరో నీ వెఱుంగకుంటివా?

సుభ—ఏమన్నా! నీవు నట్లు మాట్లాడు చుంటివి!

చ. చెదరని ప్రేమనీవు నను ♦ జిన్నటనుండియుఁ బార్థునే గ్రహిం
చెద వని యంచు నిప్పుడిటు ♦ చెల్లున వైరుల పక్షమూని నా
మొద విదళింపఁ బూనితి వి ♦ దేమి మనంబునఁ గృష్ణుఁ గోరు ని
న్నదినరో యీఁదలంప శిశు ♦ పాలున కేమను కొంటివప్పుడున్

రుక్మి—ఏదినా! నన్ను దెప్పుచుంటివా?

సుభ—అన్నా! చివరకు నే నిట్టి దుర్గతిపాలు కావలసివచ్చెనా? హా కృష్ణా!

ఉ. చిన్నటనుండి యుంద్రిసుతు ♦ చెల్మియుఁ గోరి యతండు నన్నుఁ జే
కొన్నఁ గృతార్థనంచు మదిఁ ♦ గోరిక లీరిక లెత్త నుంటి చి
న్నన్నా! ముకుంద! నీవయిన ♦ నార్తను నా మొరలాలకించి నీ
యన్న మనంబుఁ ద్రిప్పి నను ♦ నర్జునుఁడే గ్రహింపఁ జేయవా?

రుక్మి—ఏదినా! నీకు నీ మేనత్త కొమారుని పైగల మోహ మెంతటిదో గనుగొనుటకై యట్లంటినే గాని నాకు నీయందు కోపమనుకొంటివా? నీ పెద్దన్నగారికి దక్కఁ నితరు లెవ్వరికి నిన్ను దుర్యోధనున కిచ్చుతలంపులేదు. ఏల విచారించెదవు? ఊరడిల్లుము.

సుభ—ఓహో ! ఇప్పుడు నీవు నిశ్చయమయిన రుక్మిణివే. నాయనంగు పదినవే. నన్నిట్టి విషమపరీక్ష సేయుపలయు నమతలంపు నీకే కలిగెనా లేక యెవ్వరైనఁ జెప్పి పుత్తెంచిరా ?

రుక్మి—వదినా ! నీ పెద్దన్నగారు శిష్యవత్సలురగుటచే గదాయుద్ధమందుఁ దమకు శిష్యుఁడైన దుర్యోధనునకే నిన్నొసంగుటకు నిశ్చయించుట చెలింగి నీ హృదయంబు తెలియఁగ నిక్కువం బెఱింగిరా నీ చిన్నన్నగారే నన్నిట్లు బుత్తెంచినారు. (అని యిటు నటు జూచి) అదిగో ! నీ చిన్నన్న గారిటులనే వచ్చుచున్నారు.

[అంత శ్రీకృష్ణుండు ప్రవేశించి]

శ్రీకృ—(తనలో) నే నంతిపురంబున దేవిరాకకై నిరీక్షించి తడవగుటచే సుభద్రయు దాను మరల నెచ్చోటకేగిరో యని నే వారల వారయవచ్చితిని. వారింకను నిచ్చోటనే మాట్లాడుచు గూర్చుండియున్నారు. ఇప్పుడు నే వారియెదుట కేగెదను. (అని రుక్మిణీ సుభద్రలను సమీపించి) దేవీ ! ఇంకను సుభద్రతో నీ విచ్చోటనే మాట్లాడుచుంటివా ?

రుక్మి—(నమస్కరించి) ప్రాణేశ్వరా ! మీరే నాకొరకై యిచ్చోటకు వచ్చితిరా ?

సుభ—అన్నయ్యా ! (అని కృష్ణునియెదుట మోకరించి)

గీ. సోదరా! నీదు చెల్లెల ♦ నాదరింప
నీవ శరణంబు నీయన్న ♦ నిర్దయాత్ము
నన్ను (అకటా పచించుటకు నోట రాకున్నది. చెప్పక తీరదు)
దుర్యోధనున కివ్వ ♦ నున్న వాఁడు.
పెద్దపులినోటఁ బడవేయఁ ♦ బెంచినారె?

శ్రీకృ—సోదరీ ! సుభద్ర ! పెద్ద లట్టి దృఢనిశ్చయులై యుండఁ జిన్నవాఁడ నగు నే నేమి చేయుదును. ఇంతయేల, నిన్ను దుర్యోధనునకు దక్క నొండొరున కివ్వనీయమని గూడ మాయన్నగారు దృఢమైన ప్రతిజ్ఞఁ జేసినారు.

సుభ—హా బలరామా ! అట్టి దారుణమైన ప్రతిజ్ఞఁబట్టుటకు నీ యెడల నే నేమి యపచారమొనరించితిని. (అని కృష్ణునితో) అన్నయ్యా ! నీయన్నగారెట్లు ప్రతిజ్ఞఁ జేసిరి ?

శ్రీకృ—చెల్లెలా ! నిండుకొలువున మా యన్నగారు చేసిన ప్రతిజ్ఞ వినుము.

మ. "అనుజా వీరలు తల్లిదండ్రులు వినుం డస్మత్ప్రతిజ్ఞ న్సుభ
ద్రను దుర్యోధనుఁ డక్క నొండొకనిఁ జెందం జేయశక్యంబె నే
దినమందు న్నిశియందు నీ హలము చేఁ దీపించుచు న్సోదరీ
బనిగాఁ గాచెద నెట్లుఁ జేరనగునో పార్థుండు నిర్ధుండికన్"

అని

సుభ—హా హతవిధి! ఇంక నే నేమిచేయుదును అర్జునునిఁ జూడకున్న నీప్రాణముల నెట్లు ధరియింతును. అన్నా ! బలరామా ! నా యభాగ్యదేవత నిన్నిట్లు బురిగొల్పెనా ?

ఉ. దుర్జనుఁ డంచు నెంచక ల దుష్టసుయోధను పాలుచేయు టే
కర్జమటంచు నెంచితివి గా యిక నిన్ననసేల కీర్తి వి
స్ఫూర్జితు నా మనోహరునిఁ జూడఁగ నైనను నోచనైతినా
అర్జున! అర్జునా! యనుచు నంతము నొందఁగఁ జేసె దేవధీ

ఛీ ! దురాత్మునిఁ జేరఁ బడనున్న యీయభాగ్యదేహంబున బ్రాణములు నిలుపజాల నిలుపఁజాల. ఓ జననీజనకులారా ! అనుంగు సోదరులారా ! మీనిర్భాగ్యురాలగు సుభద్రను మరువకుఁడు.

ఉ. గాదిలికూతురంచుఁ గను గందఁగ నీయక పెంచినారు నే
సోదరినౌటచేత నను జాల్మరి పెన్మినఁ జూచినారు నే
నే దయమాలి పోయెద ని దే కడసారము మిమ్ముఁ బిల్వఁగా
లేదు సుభద్ర చెల్లెలిక లేదిల నన్నము లేదు పోయెదన్.

ఓ యర్జునా ! ఏజన్మంబునకైన నీవే నాభర్తవు. నన్నిప్పటికి మరువుము.

[అని పైటకొంగుచే మెడ కురివేయుచున్నది]

శ్రీకృ—ప్రియసోదరీ ! సుభద్రా (అనివారించి) ఏమిపని చేయుచుంటివి నీవిట్లు దురంతంబుగ ప్రాణపరిత్యాగము చేయుటకు సాహసింపవచ్చునా ? ఆత్మహత్య మహాపాతకం బని యెఱుంగవే ?

సుభ—అన్నయ్యా ! నన్నేల వారించెదవు ? జీవచ్ఛవంబనై నే బ్రతికున్న లాభమేమి ? నన్ను విడిచిపెట్టుము. (అని కరంబు విదిలిచికొని మరల నురివేసుకొనుచున్నది)

శ్రీకృ—(మరల వారించి) సుభద్రా !

మ. తగునే యర్జును నేమి చేసితివి మోదం బార నాతెందుకే
దగులక్ గాఁడట నీదు కోర్కె బ్రతికున్నం గాక యీడేరు నే

సుభ—అన్నయ్యా ! ఇంకను నా కట్టి యడియాస కల్పించెదవా ?

(అని కన్నుల నీరు నించి నిట్టూర్పు విడుచుచున్నది)

శ్రీకృ-సొగసౌ నిద్దపు చెక్కుటద్దముల నం సుళ్లాకుల్ పైపారఁగా
వగలం దూలకు మమ్మ నీవరుని జేఁబట్టంగ నే చేసెదన్.

సుభ—(ప్రసన్నముఖియై) ఓహో ! ఏమి నాభాగ్యము ! వదినా ! నే నింక ధన్యురాల నయ్యెద (అని రుక్మిణిని గౌగలించుకొనుచున్నది)

రుక్మి—(ప్రియపూర్వకంబుగ సుభద్రశిరోజంబుల నివురుచు) అనంగ మరదలా ! నీ చిన్నన్నగారి యనుగ్రహంబుచే నీ యభీష్టంబు తప్పక నీడేరును. నీ వింక సందేహింపక సముల్లసితచిత్తురాలవై యథేచ్ఛవిహారింపుము.

సుభ—వదినా ! ఇంక నాకు సందియం బెక్కడిది. (అని చిఱునవ్వు నవ్వుచున్నది)

శ్రీకృ—(జనాంతికముగా) నా చెల్లెల కాయర్జునిపై మోహ మెంత మిక్కుటముగా నున్నది !

మ. సహవాసంబున మానసంబు లోకపోఁజర్చించిన జాతభూ
రుహామం దొండొకకొమ్మక్షీరముల నీ రుం జేర్చఁగా నేకమా

మహినల్లే చెలి చిత్త మేకమయె ప్రేమార్గ గ్రీడి చిత్తంబులో
సహజప్రేమల నుద్ధరింప వలదే ॰ నమ్యక్ప్రయత్నంబులన్.

(ప్రకాశముగా) సోదరీ! సుభద్ర! ఇప్పు డిచ్చోట జరిగిన విషయంబుల నేరికైనఁ జెప్పెదవు సుమీ! నేను నీయభీష్టము నెరవేర్పఁ బూనిన సంగతి వారు లెవ్వరైన నెరింగిరేని మన యన్నగారైన బాలాయుధునకుఁ దెలియు. ఆయన కోపధారి. కావున నీ చెలికత్తియకైనఁ జెప్పక జాగరూకురాలవై యుండుము. నే నిప్పుడే యింద్రప్రస్థపురంబున కేగి పలయు ప్రయత్నంబులను చేసెదను. మీరంతిపురంబున కేగుఁడు.

సుభ—మంచిది. (అని యందఱు నిష్క్రమించుచున్నారు)

గద్య.

ఇది శ్రీమద్వేంకటరమణ కరుణాకటాక్ష వీక్షణాసార సమాసాదిత రస
బంధుర కవిత్వవైఖరీ ప్రవీణాపస్తంబసూత్ర శాండిల్యసగోత్ర పవి
త్ర వాశిష్ఠకుల కలశార్ణవ రాకా కైరవమిత్ర వేంకటరత్న
సుపుత్ర వేంకమాంబా గర్భశుక్తి ముక్తాఫల వివిధ
విద్వజ్జన విధేయ వేంకటకృష్ణనామధేయ ప్ర
ణీతంబయిన సుభద్రార్జునీయంబను
నాటకరాజంబున
ప్రథమాంకము.

శ్రీరస్తు.

సుభద్రార్జునీయము.

ద్వితీయాంకము.

ప్రథమ రంగము : ఇంద్రప్రస్థపురోపాంతము.

[ఆర్తుండై యొక బ్రాహ్మణుఁడు ప్రవేశించుచున్నాఁడు]

బ్రాహ్మ.

శా. ఓ పుణ్యాత్మకులార! చోర్యమున మీ రుత్సాహులై గోవు న్
బాపం బోఁ గొని పోకుఁడీ యదియు సంభారావము ల్జేయుచు న్
జేపొంద న్మదఁ ద్రిప్పి కేఁగఁగారకై చింతించు నయ్యో! కృప న్
దాపై బ్రోవ రహోమధేనువు నిం దప్పిప్ప మందు న్నృపుల్

అకటా! నే నేమి చేయుదును? హోమంబునకుఁ గాలాతీతమగుచున్నది పాపము లేఁగయుఁ బాలుత్రావువేళ యగుటచే వినువారి లాయంబులుఁ దూల నమ్మా! యని యరచుచుఁ గట్టినకట్టు చుట్టుఁ దిరుగుచు నింటియొద్ద మొఱ వెట్టుచుండును. కటకటా! నాహోమధేనువును వేవేగఁ జోరులనుండి విడిపింప సమర్థులగు వారిం దెవ్వరును గానరాకుండిరి. నేనైన నాతస్కరుల వెంటఁ దరిమి వారలఁ బ్రార్థించిరైన గోవును విడిపించుకొందమన్న చిమ్మచీకటులు క్రాలుక్రమ్ముచున్నవి. దైవమా! ఈ యరణ్యంబున నొక నాగాంగనరైన నా మొఱ యాలింపకుండునా? (అని నలుదెసలుఁ గలయఁజూచి) అదిగో యిచ్చోటకెవ్వరో వచ్చుచున్నట్లున్నది. వారి సహాయ మపేక్షించెదను. (అని కొంచెము ముందరకునడచి యులూచిని గాంచి) అయ్యో! వ్యర్థము. వ్యర్థము. ఈమె యొక యబలామణి.

[అంతట నులూచి ప్రవేశించి]

ఉలూ.—బ్రాహ్మణోత్తమా! సంశయింపకుము. నా రాక వ్యర్థము కాదు. సార్థకమే

కాఁగలదు.

బ్రాహ్మ—ఏమి నాభాగ్యము ! లలనామణి ! మదీయ భాగ్యస్వరూపిణివైన నీ వివ్వన దేవతవో దేవకన్యకవో యెఱుంగ వేఁడెదను.

ఉలూ—విప్రోత్తమా ! నే నివ్వనదేవతనుఁగాను దేవకన్యకనుఁగాను.

మ. ప్రణుతై రావత వంశసంభవుఁడు కౌరవ్యాభిధానుండు నా
జనకుం డర్మిలి భూతలంబునను సంచారంబుఁదాఁ జేయుచున్
విని యాక్రందన మేమొకో యని కృపన్వేవేగ నన్నిట్లుఁ బం
చిన నేవచ్చితి నాగకన్యక నులూచి న్భూమిబృందారకా.

బ్రాహ్మ—నాగకన్యావతంసమా ! నీ యాగమనంబు నా కెట్లు సార్థకము కాఁగలదో తెలిపి నన్నుఁ గృతార్థునిఁ జేయుము.

ఉలూ—భూసురాగ్రణీ ! మీ హోమధేనువును దస్కరుల బారినుండి తప్పించి సంరక్షింపఁగల సమర్థుం డీయింద్రప్రస్థపురమునందే యున్నవాఁడు. అతని యనుగ్రహమును సంపాదింపఁ గలిగితివేని నీ కార్యంబు సిద్ధించును.

బ్రాహ్మ—పుణ్యస్వరూపిణీ ! ఆ మహావీరుఁ డెవ్వరో యెఱింగింపుము. నే నిప్పుడే జని వానిం బ్రార్థించెదను.

ఉలూ—సకలభువనైకసుందరుఁడును వీరాధివీరుండు నగు నా ప్రాణధవుం డెవ్వరని యడుగుచుంటిరా ? బ్రాహ్మణోత్తమా ! వినుము.

చ. విదితజగత్త్రయైకపటు విక్రముఁ డార్తజనావనుండు దు
ర్మదరిపుగర్వభంజనుఁడు మాన్యచరిత్రుఁడు మోహనాంగుఁ డ
నదమలకీర్తిశాలి గుణసత్తముఁ డర్జునుఁ డీ తెఱంగరే ?
ముద మొదవంగ నీ మొదవు ముఖ్యముగా విడిపించు నాతఁడే.

బ్రాహ్మ—పూజ్యురాలా ! నే నిప్పుడే వానిపాలి కేగెదను.

(అని నిష్క్రమించుచున్నాఁడు)

ఉలూ—(స్వగతము) ఈ బ్రాహ్మణోత్తముండు నిశ్చయముగ పూజ్యుండై నట్టియు నా మనోధవాపహారుండైనట్టియు నా యర్జునుని పాలి కేగి తన యుదంతం బాతనికి నివేదించును. అర్జునుం డాశ్రితజనవత్సలుండు నార్తత్రాణ పరాయణుండు గావున నా బ్రాహ్మణుని సంరక్షణార్థమై వెంటనే గాండీవం బరయు. నా మాయచే నాతని చేతనే యా దివ్యధనస్సు ధర్మరాజు కేళికాభ్యంతరంబున నుంచఁబడునట్లుఁ జేసితిని కదా. ద్రౌపదీసహితుండై ధర్మరాజుండు నా కేళీమందిరంబులోని కా దివ్యధనస్సునుఁ గొనుటకై యర్జునుం డేగనేని మున్ను నారదుండు చేసిన సమయము చొప్పున నాతం డొకసంవత్సరము తీర్థసేవ చేయవలయును. అట్లాతండు తీర్థయాత్రలకై బయలుదేరినచో నా కాలములోఁ దఱిఁ గనిపెట్టి నా కోరికఁ దీర్చికొనియెదను. నే నిప్పుడు గంగాతీరంబున కేగి యచ్చోట వాని యాగమనంబునకై నిరీక్షించుచుండెదను.

(అని నిష్క్రమించుచున్నది)

ద్వితీయ రంగము.

ఇంద్రప్రస్థపురమందలి ధర్మరాజుగారి సభామంటపము.

[ధౌమ్యపురస్సరుండై ధర్మరాజు ప్రవేశించుచున్నాఁడు.]

ధర్మ—పురోహితవర్యా!

క. జారులు చోరులు దుష్కృతవి
చారులు లేకుండ సకల ♦ సద్ధర్మసదా
చారముల రాజ్యమునఁగల
వారు సుఖంబుగను వెలయు ♦ వారె మహాత్మా

మఱియు

ఉ. స్నానము సంధ్యయుం జపము ♦ సల్పుచు విప్రులు దేవతార్చనల్
పూనియొనర్చుచుండిరె ♦ భూమిఁ దదీయ గృహంబులందు దీ

ష్ఠానియమంబుల న్నిగమ◆ గానములధ్యయనంబు లొప్ప నే
హానియుఁ జెందకుండిరి క◆దా మనరాజ్యమునందు నెల్లెడన్

ధౌమ్య—ధర్మరాజా! సార్థకనామధేయుండవైన నీచేఁ బరిపాలింపంబడు రాజ్యంబున ధర్మంబు నాలుగుపాదముల నడుచుచున్నది? మఱియు రాజ్యతంత్ర మంత్రాలోచన నెరవేర్చుటలో సహకారులై నిర్వక్రవిక్రమోన్నతులై ధర్మాధర్మవివేకులై నీకు విధేయులై దురంధరులైన భీమార్జుననకులసహదేవులు దుర్గంబును సంరక్షింపుచుండ జారచోరరుజాప్రచారంబులును దుర్మదారాతి విహారంబులును మనరాజ్యంబున నెట్లుఁ గానవగు? ఇదియునుఁ గాక,

ఉ. ఒక్కఁడె కాఁడె త్రిలోకముల◆ నోర్వఁగఁజాలెడు నీదుసోదరుల్
మిక్కిలి బాహుదర్పమున◆ మించిటు రాత్ముల నెల్ల వేల్మిడిన్
సుక్కఁగఁ జేసి సజ్జనులఁ◆బ్రోచుచు నుండఁగ జారచోరు లే
డిక్కునఁ గానవత్తురు? గణింపఁగ శక్యమె నీప్రభావముల్.

[అంత నర్జునుఁడు ప్రవేశించి]

అర్జు—(ధర్మజధౌమ్యులకు వేర్వేర పాదాభివందనం బాచరించుచున్నాఁడు)

ధర్మ—సోదరా! దీర్ఘాయుష్మంతుఁడవు గమ్ము

ధౌమ్య—అర్జునా! నిరంతరప్రియావాప్తి వర్ధిల్లుము.

అర్జు—(తనలో సవితర్కముగ) ఏమి చెపుమా పురోహితవర్యుండగు ధౌమ్యుండిట్లాశీర్వదించె? ఇదియును నా ప్రస్తుతోద్యోగమునే సూచింపుచున్నది. అయినఁ దీర్థయాత్రాపరాయణుండనగు నాకు ప్రియావాప్తి యెట్లుఁ గలుగు? ఒకవేళ వానియభిప్రాయము నాకుఁ బ్రియమైన తీర్థసేవ సిద్ధించునని యేమో. అటులనే గావచ్చును. (ప్రకాశముగా) అన్నయ్యా! దేవర విధేయుండగు నీ యర్జునుండు కొండొక కారణంబుచే గతిపయమాసంబులు మీ పాదసేవఁ దొలంగ ననుజ్ఞ వేడుచున్నాఁడు. నే తీర్థయాత్రలకుఁ బోవ సమకట్టితిని.

ధర్మ—(అదిరిపడి) ఏమేమీ! ప్రియసోదరా! ఏమంటివి? తీర్థయాత్రలు సలుపఁ గతిపయమాసంబులు నీవు నన్నెడఁబాయఁ దలంచితివే?

అర్జు—అవు నన్నయ్యా.

ధౌమ్య—అర్జునా ! ఏమి కారణంబున నీ కిట్టి సంకల్పము కలిగినది ?

అర్జు—గురువర్యులారా ! తగినంత కారణము లేనిచో నేను మిమ్మెడఁబాయనోర్తునా? ఈ జనుఁ డపరాధియై యున్నవాఁడు.

ధర్మ—ఏమి ! సకల సద్ధర్మ వర్తనుండై గురుదేవతాభక్తి పరాయణుండై వెలయు నా తమ్ముం డర్జునుండే యపరాధి యయ్యెననుట ధర్మంబునకుఁ గతిదప్పెననుటయే-

అర్జు—అన్నయ్యా ! అట్లుఁగాదు- వినుండు- నిన్నరేయి యొక బ్రాహ్మణుండార్తుండై నాజాగరము నొద్దకు వచ్చి తన హోమధేనువును చోరులు గొనిపోయిరని వాపోవ కోపదందహ్యమానమానసుండనై యొడ లెఱుంగక గాండీవంబు గైకొన ద్రౌపదీసహితులై యున్న దేవర కేళికాభ్యంతరంబులోని కేగి యా దివ్య ధనస్సును గొనిపోయి చోరులను శిక్షించి హోమధేనువును బ్రాహ్మణోత్తమున కొసంగి వచ్చితిని- ఇం దపరాధము లేదా ?

ధౌమ్య—అర్జునా ! గో బ్రాహ్మణ రక్షణవిషయములలో గలిగే ప్రమాదంబు లపచారంబు లగునటోయి ?

ధర్మ—తమ్ముఁడా ! ధర్మజ్ఞులగువా రెవివయమందు నభిప్రాయముచే ప్రధానముఁగా గొంచెదరు కాని క్రియయందు ప్రాముఖ్యము నారోపింపరు- కావున సదుద్దేశముతో నీ వొనర్చిన పని యపచార మెట్లగును ?

అర్జు—గురువర్యులారా ! శిష్యవాత్సల్యముచే ధౌమ్యులును సోదర స్నేహంబుచే ధర్మవ్రతులైన యన్నగారును వ్యర్థముగఁ బ్రేమబద్ధులై ధర్మమున కిట్లంతరాయముఁ గల్గింపఁజూచుట న్యాయమేనా ?

ధౌమ్య—అర్జునా ! నీ వొనర్చిన సత్కార్యంబు పూజ్యుఁడైన ధర్మరాజున కుపచారమే గాని యపచారమిన్నటికినిఁ గా నేరదు.

ధర్మ—తమ్ముఁడా ! ఇప్పుడు ధర్మంబున కంతరాయం బేమికలిగె ?

అర్జు—అన్నయ్యా ! మున్ను బ్రహ్మర్షియైన నారదమునీంద్రుండు చేసిన సమయ ప్రకారమును మఱచితిరి కాఁబోలు. జ్ఞప్తికిరా విన్నవించెద నవధరింపుఁడు.

గీ. అగ్రజా ! ద్రౌపదిని మన ♦ మైదుగురము
పొందఁగోరిన సుందోప ♦ సుందుల గతిఁ

హానిఁ జెందుదు మంచు బ్రహ్మర్షి చేసె
సమయ మొక్కొక్కనికి నేఁడు • జరుగునట్లు

ధర్మ—తమ్ముఁడా ! నే నన్నటుల నుద్దేశమే ప్రధానమైనచో నిప్పు డాసమయమునకు భంగ మేమికలిగె ?

అర్జు—అన్నయ్యా ! ఏల మీ రిట్లు నాయెడల ప్రేమబద్ధులై ధర్మమును వీటఁ బుచ్చెదరు ? సమయవిషయములలో క్రియయే ప్రధానము గాని యుద్దేశమెన్నటికినిఁ బరిగణింప దగినది కాదు.

ధర్మ—(అపవారించి ధౌమ్యునితో) పురోహితవర్యా ! మీ యభిప్రాయ మేమి ?

ధౌమ్య—(రహస్యముగా ధర్మరాజుతో) ధర్మజా ! అర్జునుఁడు ధర్మసూక్ష్మము నెఱింగి వచించినాఁడు.

ధర్మ—(తనలో) అవును. నాకు నటులనే తోఁచుచున్నయది. అయిన నా తమ్ముండింక నేమనునో వినియెదఁగాక.

అర్జు—అన్నయ్యా! ఆ మునితల్లజుం డప్పుడాఁడినమాటలు విన్నవించెద నవధరింపుఁడు

క. "ద్వాదశమాసంబులు స
మ్మోదముతోఁ దీర్థసేవ • మునుగొని సేయం
గాఁదగు సమయముఁదప్పిన
చో దీనిని మఱువకున్న • శుభమగు మీకున్."

అని యిట్లామహానుభావుం డానతిచ్చి యుండఁడే ? కావున యిప్పుడు నే నొనర్చిన తప్పును మాతిక్రమణదోషపరిహారార్థమై యొకసంవత్సరముఁ దీర్థసేవఁ జేయఁ బూనుకొంటిని. గురువర్యు లనుగ్రహించి యనుజ్ఞ నియ్యవేఁడెదను.

ధర్మ—(చింతాక్రాంతుండై తనలో) అన్నా ! నే నిపు డేమిచేయుదును !

గీ. కమలబాంధవుచేత నాకమలవైరి
యనిల సాహాయ్య మొదవ నా • యనలుఁ డెపుడు
గ్రాలుగతి నర్జునుఁడు నాకుఁ • గలిగియుంటఁ
బొల్చుచుంటినిఁ గీర్తివి • స్ఫూర్తితోడ.

అట్టి నా తమ్ముని ధనంజయు నిప్పుడుఁ దీర్ఘయాత్రల కంపి పంద్రెండు వ[...]
సము లే లెట్లు లెడఁబాసి యుండఁగలుగుదును ? ధర్మవిధిచే నెడఁబాయ[...]
తప్పనిసరియచ్చె- నే నేమి సేయుదును ? ఇట్టితఱి నాకుఁ దగు నుపాయంబు
దెల్పి న న్నుద్ధరింప సమర్థులగు వారు శ్రీకృష్ణభగవానులు దక్క నొండొ[...]
రు గారు ఇప్పు డామహానుభావుం డిచ్చోటికు వచ్చు టెట్లు ? (అని యిట
నటు జూచి) అదిగో తలంచినంత నే వచ్చుచుండె-

[అంత శ్రీకృష్ణుండు ప్రవేశించి]

శ్రీకృ—(ధౌమ్య ధర్మజులకు నమస్కరించి యర్జునున కభివందనం బాదరించు
చున్నాఁడు)

ధౌమ్య.—శ్రీకృష్ణా ! అభీష్టసిద్ధిరస్తు.

ధర్మ—(లేచి సగౌరవముగ) ఓహో మహాత్మా ! ఏమి నాయదృష్టము !

చ కమలదళాక్ష! ధన్యుఁడనుఁ ♦ గాని నకోజగణంబు చక్రివా
కములు నభోమణిన్ శశినిఁ ♦ గ్రైరవముల్ దనిదీర నీటిమే
ఘములల మయూరముల్ల నెడు ♦ కాంతు నెలర్పెడు భంగి నేఁటికా
సమయము వేచియుంటి కృప ♦ నల్పినరుం గనవచ్చితచ్యుతా
భక్తవత్సలా !

చ. అలరుచు నుండిరే కుశలు♦లై వసుదేవుఁడు దేవకీసతీ
తిలకము? నా హలాయుధుఁడు ♦ దివ్యసుఖస్థితినున్నవాఁడె? వి
పులగుణను సేను మేఁ సుఖులె♦ రుక్మిణీ, సాత్యకియున్, సుభద్రయున్?
బలుసిరిలీల యాదవులు ♦ వర్ధిలుచుండిరె ద్వారకాపురిన్?

శ్రీకృ—ధర్మాత్మజా ! నీ యనుగ్రహము చేతను మహాత్ముల యాశీః ప్రభావము చేతను
ద్వారకలోని వారందఱు సుఖముగానే వర్ధిల్లుచున్నవారు.

ధర్మ—శ్రీకృష్ణా ! తలంచినంత నే దృగ్గోచరుండవై నా మనం బత్యంతానందమగ్నం
బగునటుల లొనరించితివి- నా భాగ్య మింతని కొనియాడవచ్చును ! ఇంక
నా మనస్సంకటంబు లన్నియు నివారణ యగుటకు సందియంబు లేదు.

అర్జు—బావా ! (అని సహర్షంబుగ) ఏమి మా పుణ్యము !

ఉ. వాయువుఁ బత్రముల్ దినుచు వారినిఁ ద్రావుచు యోగలీల న
త్యాయతభక్తిఁ గొల్చెడు మహాత్ములు తాపసులైనఁ గాంచలే
రే మొడ నట్టి నిన్నుఁ బరమేశుని బ్రాకృతు నట్ల మేము బా
వా యని పిల్వఁ గల్గితిమి భాగ్యము గాదె నతార్తిభంజనా

ధర్మ—శ్రీకృష్ణా ! పరమపురుష !

చ. వనజదళాక్ష ! నీవు యదువంశము నందు జనించి లీల నం
దుని కడ నాలమందలను దోలుచు వేత్రలఁ గూడి యాడుచున్
దనరెద విమ్మహిన్ బ్రకృతిధర్మముఁ గైకొని వానవాడులుం
గనఁగొన లేని శ్రీహరివి గాని తలంపఁగ మానవుండవే?

లీలామానుషవిగ్రహుండవగు నో భగవానుఁడా ! నీ యనుగ్రహంబు వడసిన వారికిఁ బడరాని దెండైనం గలదే ? ఇప్పుడు పూజ్యుండగు ధర్మరాజున కొక ధర్మసందేహము కలిగినది. దానిం దీర్ప నీవే సమర్థుండవు.

శ్రీకృ—(నవ్వుచు) ఏమేమీ ! ధర్మరాజుగారికిఁగూడ ధర్మసందేహము కలిగెనా ? నేను నమ్మజాలను- (అని ధర్మరాజు నవలోకించుచున్నాఁడు)

అర్జు—బావా ! ఆ ధర్మసందేహము నే విన్నవించెద నవధరింపుఁడు-

ఉ. దొంగలు హోమధేనువును దోల్కొనిపోయి రటంచు నార్తితో
సంగతిఁ దెల్పు బ్రాహ్మణుని సమ్ముదమందఁగఁ జేయ గాండివం
బుం గొన ద్రౌపదిం గలసి పూజ్యుఁడు ధర్మజుఁ డున్న కేళికో
త్తుంగగృహంబులో నికిని తొందరబోయి కృతాపరాధినై -

గీ. సంయమీంద్రుఁడు చేసిన సమయభంగి
తీర్థసేవలు జేయ నే తెరఁ దలఁచి
యాజ్ఞ నిమ్మని వేడ నా యనఘు నిపుడు
సందియము కల్గె నదె యన్న సందియంబు.

శ్రీకృ—(ప్రక్కన నవ్వి) ఇదియా బావగారి సందేహము- అవును- లౌకికవిషయంబుల నుపయోగపడు ధర్మంబులు స్వవిషయంబున నుపయోగింప వలసి వచ్చినప్పు డెవరికైన సందియము గలుగకుండునా ? (అని ధర్మరాజుతో) బావా !

చ. అలమట ముద్దుతమ్ముఁడని • యర్జునుఁ బాయఁగ లేక యిప్డు నీ
వెలిఁగిన ధర్మమయ్యు మది • నెంచవొ యాతఁడు వేలు పెట్టినన్
గరవఁగ లేఁడొ వెన్నడినఁ • గ్రైకొని మిన్నిఁగఁగ లేడొ ధర్మము
న్నెఱపుచుఁ దీర్థయాత్రలకు • నీ విపుడంపిన మొక్క మొల్చునో

ధర్మ—ముకుందా ! ఏల నన్నుఁ బరిహసించెదవు ?

గీ. అర్జునుని యేవిధాన బా • యంగ నైన
నరగడియ యొక్క యుగముగ నాత్మఁదలఁతు
నిపుడు పండ్రెండు మాసంబు లెట్లువానిఁ
బాయ నోర్చెదఁ దీర్థ సే • వలకు నంపి.

శ్రీకృష్ణా! నా తమ్ముండు నిశ్చయముగఁ గృతాపరాధుండనియే భావించితి నేని వానిం దప్పకఁ దీర్థయాత్రల కంపెదను-

శ్రీకృ—(తనలో) అర్జునునిఁ దీర్థయాత్రల కనుపుటకు సోదరునియెడఁ గలుగు ప్రేమ రజ్జు వీధర్మరాజు మనసు నెంత వెనుకకు లాగుచున్నదో నా సోదరియైన సుభద్రయెడం గలుగు ప్రేమరజ్జువు తదర్థంబు వానిం బ్రోత్సాహపరుచుట కంత ముందుకు లాగుచున్నయది- (ప్రకాశముగా) బావా !

చ. నిరుపమబాహువిక్రమ • నిర్జితవైరి కృతాపరాధుఁడై
పరమపవిత్రమౌచును శు • భంబు ఘటించెడు తీర్థయాత్రకై
యరుగఁ దలంచువానికిటు • లక్కట! ధర్మమె యంత గాయముగ్
దారకొనఁ జేయఁబూనెదవు • దోషము కాదె తలంచిచూడుమా

ఇదిగాక లోకులు నిన్నేమందురు ? కావున నీ వింక నిట్టి ధర్మసందేహంబుల విడనాడి గారాబుతమ్ముండని యెంచక యర్జునునిఁ దీర్థయాత్రల కంపుము అట్లయిన నాతనికిఁ బ్రియావాప్తి కలుగు-

ధౌమ్య—ధర్మాత్మజా! శ్రీకృష్ణుని యాజ్ఞాప్రకారము చేయుము. దాన నీకు శ్రేయంబగు

ధర్మ—మంచిది. మీరందఱట్లుఁ జెప్పుచుండ నే న్యతిరేకింతునా? అర్జునా! నీవు తీర్థయాత్రాభిగమనోన్ముఖుండవు గమ్ము. నే లోనికిం బోయి యీసంగతి మన జననియైన కుంతీదేవితోడను మన ధర్మపత్నియైన ద్రౌపదీదేవి తోడనుఁ జెప్పి వారల యనుమతినిఁ గూడఁ బొందివచ్చెదను.

అర్జు—చిత్తము న్నయ్యా. నే నీలోపున బ్రయాణమునకు సర్వసిద్ధుండ నగుచుండెదను

ధర్మ—మంచిది. శ్రీకృష్ణా!

ఉ. కోరితి నీవ దిక్కు జన ♦ కుండు గతించెను చిన్ననాడె గాం
ధారిసుతుండు మున్బలువి♦ధంబుల వేచిన బ్రోచినావు నీ
ప్కారణవైర మూని మము♦గాల్పఁదలంచినలక్కయింటనా
తీరున గాచినా వెటుల ♦ దేల్చెదొ యర్జును దీర్థ సేవలన్.

నే లోనికిఁ బోయి వచ్చెదను. (అని నిష్క్రమించుచున్నాఁడు)

శ్రీకృ—అర్జునా! ముందుగ నీ వేతీర్థమున కేగ సమకట్టితివి?

అర్జు—బావా? ముందుగఁ బరమపావనమైన గంగాతీరంబునకే బోవ దలంచితిని. ఈలోపున సేవింపఁదగిన తీర్థమింకెద్దియైనఁ గలదా?

కృష్ణ—లేదు నీ యభిప్రాయము బహుచక్కఁగానున్నది. అటులనే చేయుము. పటు బాహువిక్రమోన్నతుండవును ధర్మమార్గప్రచారుండవు నగు నీకు వేఱుగ నే నేమియుఁ జెప్ప నవసరములేదు. పోయివచ్చెదను. పురోహితవర్యా! నే పనివినిరెదను. (అని నిష్క్రమించుచున్నాఁడు)

అర్జు—పురోహితవర్యా! నేనుఁగూడఁ జని ధనుర్బాణంబులఁ గైకొని తీర్థయాత్రాభిగమనోన్ముఖుండనై వెంటనే తిరిగివచ్చెదను.

(అని నిష్క్రమించుచున్నాఁడు)

ధౌమ్య—(స్వగతము) ఏమి యీ యర్జునుని ధర్మమార్గప్రచారము! ఇట్టి స్వల్పమైన యుపచారంబునుగూడఁ ధర్మభంగముగఁ దలంచి సమయ ప్రకారముఁ దీర్థయాత్రలు సేయఁ బూనినాఁడు. ఆహా! వీని ధర్మమార్గ ప్రవర్తన యెంతయైనఁ గొనియాడదగు. అదిగో తీర్థయాత్రాప్రయాణంబునకు సర్వసిద్ధుండై యర్జునుండు మరల నిటులనే వచ్చుచున్నాఁడు.

[అంత యర్జునుండు మరల ప్రవేశించి]

అర్జు—పురోహితవర్యా ! పూజ్యులైన మాయన్నగారు తిరుగవచ్చిరా ?

ధౌమ్య—లేదు. (అని యిరుదెసలఁ గనుంగొని) అదిగో ! కుంతితోడను ద్రౌపదితోడను ధర్మరాజు వచ్చుచున్నాఁడు.

[అంత కుంతితోడను ద్రౌపదీతోడను ధర్మరాజు మరలఁ బ్రవేశించి]

ధర్మ—అర్జునా ! నిన్నెడఁబాయఁజాలక మన జననియైన కుంతీదేవియు, మన ధర్మపత్నియైన ద్రౌపదీదేవియు నిన్నుఁ జూచువేడుక వచ్చియున్నారు.

అర్జు—(కుంతి చెంతకేగి) జననీ ! తీర్థయాత్రాభిగమనోన్ముఖుండగు నర్జునుం డిదే నమస్కరించుచున్నాఁడు. (అని పాదాభివందనం బాచరించుచున్నాఁడు)

కుంతి—కుమారా ! ఇష్టకామ్యార్థసిద్ధి నొంది దీర్ఘాయుష్మంతుఁడవు గమ్ము. నాయనా నీవు పూనియున్న సత్కార్యంబున కంతరాయంబుఁగ నే నేమియు ననఁజాలను. కాని,

ఆ. వె. తండ్రి లేని మిమ్ము ♦ దయమాలి గాంధారి
యగ్రిసుతుఁడు పెట్టి ♦ పట్టిబాధ
లెల్లఁ దలఁప మరల ♦ నేమిసేయునో యొతం
డనెడు భయముదోచె ♦ నాత్మలోన.

మరియు, ప్రియకుమారరత్నమా ! నే నిన్నొకటిఁ గోరెదను.

చ. పలుకఁగ లేను నన్ను మిముఁ ♦ బాసి దివంబున కేగఁ బాండు భూ
తలపతి వానితోఁ జన నె ♦ దం గమకించియు దిక్కులేని ప
త్నులరయి యుందురంచు మిముఁ జూచియె నేబ్రతికుంటిఁ దీర్థసే
వల నొనరించి శీఘ్రముగ ♦ వచ్చెదనంచు వరంబొసంగుమీ.

అర్జు—అమ్మా ! చింతింపకుఁడు. తీర్థయాత్రల శుభం బొనగూడునటు లాశీర్వదించి నన్నుఁ బంపుఁడు నే శీఘ్రకాలములోనే తిరుగవచ్చి మీకు మనఃప్రియంబుఁ జేసెదను.

కుంతి—మంచిది నాయనా ! పోయిరమ్ము. నీకు శుభమయ్యెడు.

అర్జు—(ద్రౌపదితో) తీర్థయాత్రలకేఁగ ననుజ్ఞ యిమ్ము.

ద్రౌప—ప్రాణేశ్వరా ! ధర్మపాశబద్ధులమై యుండుటవలన నీ వియోగదుఃఖము కత్తు గలంటిరై యున్నను లోననే యడంచికొని యనుమతింపవలసివచ్చె. కాని,

చ. మఱి చెదరేమొ రాజులను • మత్సమునందున మత్స్యయంత్రముల్
బరువడిఁ గూలనేసి చెయిఁ • బట్టిన ద్రౌపది మీర లేవురుల్
ధరపయి నైదు ప్రాణములు • నాకిపుడంమున నొక్క ప్రాణముల్
దొరఁగఁగ నాల్గు ప్రాణములు • తో నిట నుండుదు మిమ్ము గోరుచున్

అర్జు—సత్కళత్రమా! నిరంతరము నా హృదయరంగంబున విహరించు నిన్ను నే మఱచుటెట్లు ? ప్రతిసమాప్తియైనచో నే నొక్క నిముషంబైన మిమ్మెడఁబాసి యుండనోర్తునా ! శీఘ్రముగా నే వచ్చెదను సందేహింపక యనుజ్ఞ నిమ్ము.

ద్రౌప—జీవితేశ్వరా ! మీకు శుభమగుఁగాక. పోయిరండు. కాని,

గీ. తీర్థయాత్రల నందందఁ • దిరుగుచుండి
వివిధ వేడ్కలచే మీరు • వెలయునపుడు
భావమున నొక్కమూల ద్రౌ • పదినిఁ గూడ
నిలుపుదురొ నిలుపరో యని • దలఁకుచుంటి

అర్జు—దేవీ ! నీవట్లెన్నటికిని సందేహింపకుము. నేఁ బోయివచ్చెదను. (అని ధర్మజ ధౌమ్యులతో) గురువర్యులారా ! అనుజ్ఞ నిచ్చితిరి కాదె ?

ధర్మ—సోదరా ! పోయిరమ్ము.

కుంతి—నాయనా ! నీవు శీఘ్రముగ వచ్చి నాకంటఁ బడవలయును సుమీ.

అర్జు—అమ్మా ! అలాగున నే వచ్చెదను. (అని నిష్క్రమించుచున్నాఁడు)

ధర్మ—పురోహితవర్యా ! మన మింక మరలుదము రండు. (అని యిటు నటు జూచి) అదిగో శ్రీకృష్ణుఁ డాతట్టునఁ బోవుచుండె నేమి చెపుమా !

ధౌమ్య—గంగాతీరంబున కేగుచుండెను కాంభోజు. (అని యందఱు నిష్క్రమిం
చుచున్నారు)

గద్య.

ఇది శ్రీమద్వేంకటరమణ కరుణాకటాక్ష వీక్షణాపార సమాపాదిత రస
బంధుర కవిత్వవైఖరీ ప్రవీణాపస్తంబసూత్ర శాండిల్యసగోత్ర పవి
త్ర పాలూరికుల కలశార్ణవ రాకా కైరవమిత్ర వేంకటరత్న
సుపుత్ర వేంకమాంబా గర్భశుక్తి ముక్తాఫల వివిధ
విద్వజ్జన విధేయ వేంకటకృష్ణనామధేయ ప్ర
ణీతంబయిన సుభద్రార్జునీయం బను
నాటక రాజంబున
ద్వితీయాంకము.

శ్రీరస్తు.

సుభద్రార్జునీయము.

తృతీయాంకము.

ప్రథమ రంగము : గంగాతీరము.

[శ్రీకృష్ణుఁడు ప్రవేశించుచున్నాఁడు]

శ్రీకృ—(స్వగతము) తస్కరరూపమును ధరియించి యాబ్రాహ్మణుని గోవును బలాత్కారముగఁ దోలుకొని వచ్చుటచేతనే కదా నే నాయర్జునుని దీర్ఘయాత్రలకు బయలుదేరఁ జేయఁగలిగితిని. అతం డీసరికే తదర్థంబు బయలుదేరి యుండును. నాగరాజైన కౌరవ్యుని కొమార్తె యులూచి జన్మాంతర వాసనా విశేషంబున వానిపై బద్ధానురాగయై యున్నయది. దాని మనోభీష్టంబు నెరవేరునటులఁ జేసితి నేని ముందు ధర్మరాజొనర్చు నశ్వమేధంబున నాతనికి దానిచే నొకయుపకారము గలుగఁగలదు. అంతియకాక వాని హృదయంబు దీక్షాభంగంబువలన ననురాగసదనంబై, వ్రతము చెడినను సుఖము దక్కుటయే శ్రేయమ’ను బుద్ధిపుట్టి నాకుమారుఁడైన మన్మథుని వశంబై యుండును. పిమ్మట వానిహృదయము నా చెల్లెలైన సుభద్రపైఁ దగులునటుల నొనఁగూర్చెదను. అనంతరకర్తవ్య మప్పుడాలోచింపవచ్చును. ఇప్పట్లో ముందుగా నే నాయర్జుని యాగమన ములూచి కెఱింగింపవలయును. (అని కొంచెము ముందరకు నడచి దవ్వుల నులూచిని గాంచి అదిగో! ఆనాగకన్నియ యిచ్చోట నే యున్నయది. కాని,

క. ఈగతి నైజాకృతి నే
నాగాంగన కంటఁబడిన • ననుగని భీతిం
దాగునొ పాతాళంబున
కేగునొ వికృతాకృతి న్వ • హించెద నిపుడున్.

(అని నిష్క్రమించుచున్నాఁడు)

[అంత నులూచి ప్రవేశించి]

ఉలూ—(స్వగతము) ఏమి చెప్పుదు! కామినీమనోధనసమూర్జకుండగు నా యర్జునుం డింక నువచ్చి నాకంటఁ బడఁడయ్యె. వాని తీర్థయాత్రాభిగమనంబునకే యంతరాయంబైనఁ దటస్థింప లేదుకదా? ధర్మవ్రతుండగు నామహాధీరుని సద్వ్యవసాయంబున కంతరాయం బేలకలుగు? ఆ మోహనాంగుం డెప్పుడు వచ్చి నా కంటఁబడునో! వాని నిరుపమాన సురుచిర రూప లావణ్యాతిశయంబులును వాని నిర్వక్రవిక్రమప్రభావంబులును వాని కమనీయ గుణగణంబుల విన్న నాటనుండియు నా సుందరాకారుఁ గన్నులార వీక్షించి వాని మహనీయ మంజుల మధురాలాపంబులఁ దనివితీర నా కర్ణాంజలిపుటంబునఁ గ్రోలుచు వాని దరహాసచంద్రికల నోలలాడుచు నా సరసుని నిండుకౌఁగిటఁ జేరి కోరిక లూర మన్మథాధిరాజ్యం బేలవలయు నను తలంపున నేకదా నే నాస్త్రీయ నివాసంబును బితృబంధువులను విడనాడి భూతలంబున మన్మథ సహాయనై సంచరింపుచుంటిని. ఓయర్జునా! ఇంకను రావేమి?

సీ॥ తలఁజుట్టివచ్చు నే • త్రములంచు శారదా, సదనమే దరహాస • వదన మనుచు
మెరుగుచామనచాయ • మేలిమై జిగియంచు, డంబుమీరెడు పేరు • రంబటంచు
దళుకునిద్దపు ముద్దు • గుల్కు చెక్కిళ్లంచుఁ, గావగోట దువ్వ్యాఘం • గురులటంచు
సిరిపట్టి మల్చి చే • సిన తొడలని యుక్కు, కోశేరు వెట్టిన • వాటమనుచు

గీ. వెడఁద నుదురంచు మిగుల నె • న్నదుము సన్న
మనుచు నూనూగు మీసాలు • దనరు ననుచుఁ
బలుకు చెవులకుఁ బండువుఁ • గొలువు ననుచుఁ
దెలుప విరివింటి దొరకు నేఁ • జాలికనైతి.

ఓహో!

చ. చక్కనివారిలో మిగులఁ • జక్కనవాఁడట చెప్పనేల యా
తక్కిన మాటలం దనకుఁ • దానట సాటి జగాన నన్నిటన్

జొక్కుచు వేడ్కలన్మరియు ♦ చుందనకై యిటవేచియున్న నా
మక్కువఁదీర్పకున్న నను ♦ మారుని కోలల పాలుసేయునే?

నే నిచ్చోట నెంతతడ విట్లువ్విళ్ళూరుచుండ వలయునో కదా? ఇంతకు నాయదృష్ట మెట్లున్నదో!

ఉ. అంతటి మోహనాంగుఁడెట ♦ నైన నను గల్గునే కల్గెఁబోఁ దమిం
గొంత యడంపఁ గౌఁగిటనుఁ ♦ గూర్చుటఁ గల్గునే కల్గెఁబోయతం
డింతనరాని నా వలపు ♦ నెంచి మ దిష్టవిహారలీల నేఁ
బంతముమీరఁ గోఁకినను ♦ పైకొని యేలు సుఖంబు కల్గునే

ఆ సుందరాంగుం డిందు వచ్చువరకు నాకు నిముస మొక్కయుగంబుగఁ దోచుచున్నయది. (అని గంగానదిని వీక్షించి) ఓహో? ఈగంగాస్రవంతి యెంతకన్నులపండువుగా నున్నయది!

క. కలహంసగతిని నవఫే
నలసిత హాసమున మీన ♦ నయనంబుల గం
గ లలితగతిఁజూచుచు సం
చలి తోర్మికవచనరచన ♦ సమ్మద మొనఁగుఁ

పావనంబైన తన గర్భంబున నవగాహనం బాచరింప రాఁ దలంచిన నా మనోహరుని శీఘ్రంబుగఁ గొనివచ్చుటకై నే నిప్పు డీ గంగామహాదేవిని బ్రార్థించెదను. (అని యంజలి ఘటియించి) ఓ త్రిలోకపావనీ! భాగీరథీ!

సీ॥ కమలనాభుని పాద ♦ కమలంబులనుబుట్టి, నింగిపై మందాకి ♦ నీయనంగఁ
బాతాళమున భోగ ♦ వతి యన భూమిపై, భాగీరథియనంగ ♦ బరగునీవు
శంకరుం డల యుమా ♦ శంకరుండనుచు నీ, వాసచే గాదకై ♦ లాసవాసు
గారికశత్రునిఁ ♦ గామించి చేరితి, వాటమా తజ్జటా ♦ జూటమిప్పు॥

గీ. డర్జునం డిటు వచ్చు న ♦ న్నాశనిఁగూర్ప
పన్నితు లొసర్తు నమ్మనే ♦ నంతసిల్లి

ఖండిత మహాఘవల్లి న • ద్గతుల వెల్లి
తేర్పు ననఁగన్నతల్లి న • దీ మఁతల్లి.

[అంతట బ్రాహ్మణరూప ధరుండయిన శ్రీకృష్ణుండు ప్రవేశించి]

శ్రీకృ—(ఉలూచిని సమీపించి) లలనామణీ ! ఏకతంబ నీ విచ్చోట నుండుటఁ జూడ నీ వెవనికొఱకో నిరీక్షించుచున్నట్లుఁ దోచుచున్నది. నిశ్చయమేనా !

ఉలూ—బ్రాహ్మణోత్తమా ! నమస్కారము

శ్రీకృ—కల్యాణమస్తు.

ఉలూ—పుణ్యపురుషా ! మీ రిపు డెచ్చోటనుండి వచ్చుచుంటిరి ?

శ్రీకృ—నే నింద్రప్రస్థపురమునుండి వచ్చుచున్నాఁడను.

ఉలూ—మీ రొక్కరే వచ్చుచుంటిరా !

శ్రీకృ—నీ వా ప్రశ్న యెందునిమిత్తమై వేసితివో తెలియకున్నది.

ఉలూ—విప్రవర్యా ! మఱేమియులేదు. మీ యాకృతినిఁ జూడ మీ రొక తీర్థయాత్రాభిపరులవలెఁ దోచుటచే నట్టివారు మరి యెవ్వరైన మీతో వచ్చుచుండిరేమో యని యడిగితిని.

శ్రీకృ—అటులనా ? నీవు కాంక్షించు పురుషుఁడు తీర్థయాత్రాపరుండే కాఁబోలు ? (అని చిఱునవ్వు నవ్వుచున్నాఁడు)

ఉలూ—(వెఱఁగు నభినయించుచుఁ దనలో) ఈ బ్రాహ్మణోత్తముఁడు నా నిజస్థితినిఁ దెలిసికొనియెనా యేమి ! అటులనే గావచ్చును. లేనిచో నే నొకరికై యిచ్చోట నిరీక్షించుచుంటి నని యెదట నీతని కెట్లు గోచరమాయె ? మఱియు నే గోరు పురుషుండు తీర్థయాత్రాపరుఁడని గూడ యెఱింగియున్నట్లు చెప్పుచున్నాఁడు. ఈతండు నా మనోహరుండైన యర్జును నెఱింగియే యుండవచ్చును. అట్లయిన యగుఁగాక. నా నిజస్థితి నీతం డెట్లుఁ గనఁగలిగె ! ఇప్పట్టున నా యభీప్సితం బీతనికి వెల్లడింపవచ్చునా ? తొందరపడి నే నట్లు చేసినచో నా కార్యమునకు భంగము కలుగునేమో. చెప్పక వీనిఁ దృణీకరించితి నేని యేమి యుపద్రవము లటస్థించునో.

శ్రీకృ—(తనలో) ఈతరుణీమణి నా యుద్దేశము గ్రహించె కాఁబోలు. ఏల గ్రహిం

వకుండును ? (ప్రకాశముగా) అంగనా ! నీ విప్పు డేమి యాలోచింపుచుంటివి ? నా యభిప్రాయము సరియైనదేయని నీ మౌనమే తెలుపుచున్నది. ఇంకను నీవేల రాకెదవు ? శీఘ్రముంబుగ నీ మనోగతం బెఱింగింపుము.

ఉలూ—(తనలో) ఏమిది ఈ మహీసురోత్తముండు సర్వజ్ఞమూర్తి వలె సర్వము నెఱింగి యున్నట్లు చెప్పుచున్నాఁడు ! నా యింగితం బెఱింగినవాఁడై యీతండు నాకుపకారముఁ జేయు తలంపుననే వచ్చియున్న పక్షమున నే నిప్పుడు నా మనోగతం బెఱింగించినను చేయువాఁడే యెఱింగింపకున్నను జేయువాఁడె. అట్టి సంగతిలో నే సంకోచింపనేల ? ఒకవేళ భగవంతుఁడే నాపై కరుణఁగలిగి నా కోర్కె నీడేర్చుటకై బ్రాహ్మణాకారంబున వచ్చియుండెనేమో. అయిన నీతనికి నావిషయం బెంతవరకుఁ దెలియునో తెలిసికొనినంగాని త్వరపడరాదు.

శ్రీకృ—నాగకన్యాతిలకమా ! నన్ను నీవు నమ్మలేక నీ మనోగతం బెఱింగింపకున్నను నీ యాశయంబు నే నెఱుంగనివాఁడను కాను.

ఉలూ—అట్లయినచో మరల మీ రేల నా మనోగతం బెఱుంగఁ గోరెదరు ?

శ్రీకృ—నీకు చెప్పుట కిష్టములేనిచో శ్రమఁబడకుము. నేను పోయెదనులే. (అని నిష్క్రమించుచుండ)

ఉలూ—విప్రోత్తమా ! ఏల కోపించెదవు ? శాంతింపుఁడు. వినుండు.

చ. నిను నెఱనమ్ముచుంటినను ♦ నీటను ముంచెదొ పాల ముంచెదో
ఘనుని వరించి యర్జునుని ♦ వేడుక నాతనిఁ జూడఁగోరి యీ
దినమునఁ దీర్థయాత్రిల స♦తి ప్రమదంబునఁ జేయజాహ్నవిఁ
గనుఁగొన వచ్చునంచతని♦కై యతికాంక్షను వేచియుండితిన్

శ్రీకృ—(తనలో) ఈలేమ కా యర్జునునిపై వలపు మిక్కుటముగానే యున్నయది. కాని యాతం డతిధీరుండగుటచే నీమెనుఁ దిరస్కరించినచో నిరుత్సాహురాలై ప్రయత్న మజ్జగించునేమో. అట్లేల జరుగు ? కాముకులకు నిరుత్సాహము కలిగినకొలది కమి హెచ్చుచుండును.

చ. తరుణికిఁ బాధపై వలపు ♦ తగ్గున హెచ్చగుఁగాక వాని సు
స్థిరహృదయంబు డాయియని ♦ దేహము లోహమటంచుఁ దెల్పనం
గరముల పోల్కి చుట్టలెనఁ ♦ గందగు లోహశలాక నొక్కినన్
గర మది పైకిఁదన్నుటకుఁ ♦ గాఁదమకింపదె యట్లఁ జేసెదర్.

(అని నివ్వెఱగందు నట్లభినయించుచు) ఏమేమీ ! కోమలీ ! నీ వర్జును వే వరించితివిగా ! అతని యింగితం బెఱుంగవు కాఁబోలు.

ఉ. స్త్రీజనదుర్లభుం డతఁడు ♦ చిక్కునె నీ కిటబేలవౌచు నం
భోజమృణాల తంతువున ♦ భూరిగజంబును గట్టఁ జూచె దీ
రోజన నాతఁ డీనదిసిఁ ♦ గుర్వింకఁగ వచ్చునా రాకయుండునో
నైజమెఱుంగ లేవయితి ♦ నాతిరో వాని వరింప వ్యర్థమా.

ఉలూ—భూసురోత్తమా ! ఆ మోహనాంగుం డెంతధీరుండైనం గానిండు. సకల గుణసంపన్నుండు దయామయుండు నగుటచే నా మనోవల్లభుండగు నర్జునుండు తనను మనోవాక్కాయకర్మములచే నాత్మభర్తఁగ వరించి వచ్చిన నాబోటి యబలల నుపేక్షించునా ? ఇంతయేల ?

చ. విమలమతి న్వరించితి వి ♦ వేకినొ బేలనొ భర్తఁగాఁగ ను
త్తముఁడగు నర్జునుం బరమ ♦ ధార్మికచిత్తుఁ దిశుద్ధి నిప్డు పె
రిమి ననుఁ దా గ్రహించిన స ♦ రే గ్రహింపని పక్షమందు దే
హము విడువంగఁబూనితిని ♦ నాతనికై వినుబ్రాహ్మణోత్తమా

శ్రీకృ—వెఱ్ఱిదానా ! ఇంగిత మెఱుంగక నీవు కఠినహృదయుఁడైన యర్జునునివరించి వానిం జూచుటకై యపేక్షించుచుంటివి. నిర్జలమేఘోదయమైనను చాతకంబున కేమిలాభము ? నీవు నీ చాతుర్యముచే వాని మనంబుఁ జలింపజేయ దలంచితివి గాని యది యెంతయు వ్యర్థము. వ్యర్థము.

చ. ఇసుమున నుండి తైలము గ్ర ♦ హింపఁగవచ్చు నులోహమంటు నక్క
రననుమునుదీయవచ్చు సంక ♦ రంబు రవిం గడుఁ జల్లఁ జేయ డా

యినయిత మగ్నిలోఁ గరఁగింపఁగ వచ్చునుఁగాని యేరికా
యసదృశ ధైర్యశాలి హృదయంబుఁ జలింపఁగఁ జేయ శక్యమే

ఉలూ—అవనీసురోత్తమా ! ఏల మీ రిట్లు నా యాశాపాశంబునుఁ ద్రెగఁగొట్టఁజూచెదరు? కరుణామయుండైన పార్థుండు తనను వలచివచ్చిన నన్ను పేక్షించునే?

చ. దినకరుఁ డుగ్రుఁడంచు దలని తీవ్రకరంబులు ముట్టినంతనే
తనువు దహించునంచు వెఱఁగి తమ్ములు కోరివరింపనాతఁ డుర్క
గనికర మొంది వానిని వికాసము జెందఁగ నేలు నట్లుఁ బా
వనుఁ డతిధీరుఁ డయ్యునఁగ్ర పామతి నమ్మినదానిఁ బ్రోవఁడే

భూబృందారకా ! మీరు నిశ్చయముగ నా కుపకారముఁ జేయ నెంచితిరేని నా మనోహరుండగు నర్జునుండు మీతో వచ్చియుండినచో వాని నొక్కమారి నాకుఁ జూపుఁడు. పిమ్మట నాయదృష్టమెట్లున్నదో యట్లు కాఁగలదు.

శ్రీకృ—కోమలీ ! నాకు నీయం దపకారబుద్ధే యున్నచో నీతో నే నింతతడవు ముచ్చటింతునా ? చిరకాలపరిచయముచే నా యర్జును డతిధీరుండనియు స్త్రీజనదుర్లభుండనియు నచించితి నేఁగాని నిష్కారణము నిన్ను నిరుత్సాహురాలినిగాఁ జేయు తలంపు నా కంతమాత్రము లేదు. ఇప్పుడాతండు తీర్థసేవాపరాయణుండై దీక్షలోనున్న వాఁడు. ఇట్టితఱిని వానిం జూచిన నీ కేమిలాభము?

ఉలూ—విప్రవర్యా ! నేనును దీక్షలోనే యున్నదాన నగుటచే మా యిరువురి దాంపత్యము ననుకూలమైనదే కాఁగలదు.

శ్రీకృ—కన్యాతిలకమా ! నీ వెట్టిదీక్షలో నుంటివి ?

ఉలూ—నే మదనయాత్రాపరాయణినై యుంటి నని యెఱుంగరె ? కాలయాపనచే నన్నుఁ గారింపక నామనోహరుని శీఘ్రంబుగఁ జూపుఁడు. మీకు నమస్కరించెద.

శ్రీకృ—సుందరీ ! నీకు వానిపై నిరూఢమైన ప్రేమ కలదేని నాతోడ రమ్ము. వానిం జూపెదను. కాని నీ చతురోక్తులచే వాని శిలాసదృశంబైన హృదయమును గరఁగింపలేకపోదువేమో యని సందేహించుచున్నాఁడను.

ఉలూ—(తనలో) వహ్వా! ఇంక నేధన్యురాల నయ్యెదను. ఈ బ్రాహ్మణోత్తముండు నిశ్చయముగ నా కుపకారము చేయు తలంపున నే వచ్చియున్నాఁడు. కాకున్న నన్నిప్పు డాతనియొద్దకుఁ గొనిపోవ నంగీకరించునా? ఓ భగవానుండవగు మన్మథా? నా మనోభీష్టం బెట్లు నెరవేర్చెదవో నీదే భారము. (ప్రకాశముగా) మహీసురాగ్రగణ్యా! ఇదిగో వచ్చుచుంటిని. దారి చూపుము.

శ్రీకృ—ఇటురమ్ము. (అని కొంచెముదూరము నడిచి దవ్వుల నర్జునుం గాంచి) నాగకన్యాతిలకమా! అదిగో నీ మనోహరుం డచ్చోట నున్నవాఁడు. నీవు పోయి వానిని వశపరచుకొమ్ము. నీకు శుభమయ్యెడు. నేఁ బోవుచుంటిని. (అని నిష్క్రమించుచున్నాఁడు)

ద్వితీయ రంగము.

మణికర్ణికాఘట్టము.

ఉలూ—ప్రవేశించి (ధ్యానపరాయణుండై నిమీలితనేత్రుండై మణికర్ణికాఘట్టమందు గూర్చునియున్న యర్జునుం గాంచి సహర్షంబుగ) ఆహా! ఇంతకాలంబునకు నా మనోహరుండైన వేగంటినోరపట్టి నిట గంటిని. ధన్యురాలనైతిని. (అని మరల వానిని వీక్షించి తనలో) ఏమి వీని సౌందర్యము!

సీ॥ వీని శిరోజముల్ • గానంగ మరు లొందు, కుసుమకోమలులకుఁ • గోర్కెలొదవు
వీని తేజం బెట • నైన విలోకింప, వలగొను చక్రిస్త • నుల నెలర్చు
వీని నేత్రద్వయి • వీక్షింపఁ దమిఁ జెందు, హంసయానల వాంఛ • లతిశయిల్లు
వీని మైజిగిఁ జూడ • విరహిణీ సారంగ, నయనలకెల్ల మా • నసము లలరు
గీ॥ నహహా! యీ మేని సొబ గేమి • యంద మేమి!
యీ భుజంబుల నిడు పేమి! • యీ వెడంద
యురము తీ వేమి! యాశ్చర్య • మొదవె నాదు
హృదయచోరునిఁ గంటి నే • నిచట నిపుడు.

నే నింక వీని చెంత కరిగి యేలాగువనైన నీతని మనంబు నాయెడలఁ దగులునట్లుఁ జేసికొనియెదను. (అని యర్జునుని సమీపించి) ఓహో మహాత్మా! తీర్థసేవాపరాయణులగు మీవంటి పుణ్యాత్ములను జూడఁగలిగినవారి భాగ్యమే

భాగ్యము. నేనింక చరితార్థురాల నయ్యెదను. (అని వినయముతో నిలుచున్నది)

అర్జు—(కన్నులు దెరచి యులూచినిం జూచి తనలో) ఈ లలనామణి యెవ్వరో కదా! ఈ యంగన యేకతంబ యిచ్చోటకు రాఁగతంబేమి ? నన్నుఁ జూచుటచే నీ వేమి చరితార్థురా లెట్లయ్యెదు ? (అని ప్రకాశముగా) నీ వెవ్వతెవు ?

క. అంగన యేకతముగ నీ
గంగాతీరంబునందు ♦ గత మేమి చరిం
పంగ ? వచియింప నైనన్
సంగతి నెఱిఁగింపు మీ భృ♦శంబుగ నాకున్

ఉలూ—పుణ్యపురుషా ! నేఁ బాతాళలోకంబున నుండు నాగకన్యకను. ఉలూచి యనం బరగుచుందు. నాగరాజైన యైరావతకులసంభవుం డగు కౌరవ్యుని కొమరితను. మీ సుస్వరూప గుణ కథనంబు విని చిరకాలమునుండి మీపై మరులుగొని నేడు మన్మథప్రేరితనై మిమ్మిచ్చోఁ గాంచవచ్చితిని. మఱియు,

చ. విదితగుణాలవాల ! భుజ ♦ విక్రమ! యర్జున! నిన్ను నే నెఱుం
గుదు సమయానువర్తివయి ♦ కోరిక వచ్చితి తీర్థసేవలన్
ముద మొదవంగఁ జేయుటకు ♦ ముందుగ రాగరసాఖ్యతీర్థ సే
వఁ దగు నొసర్పు

అర్జు—(అదిరిపడి లేచి తిరస్కారముగా)

ఏమి! యిటుఁ ♦ బల్కఁగఁ జెల్లునె తీర్థవాసులన్

మ. కనలేవో ? పొరకప్పెనో కనులకుం ? ♦ గాంతా! ననుం దీర్థవా
సుని దీక్షాపరతి నుంటినం చెఱుఁగవో ? ♦ చుల్కంగ నన్నెంచితో ?
పనిఁగా వచ్చితె సిగ్గులేక ననుఁ జే ♦ పట్టంగఁ ? బో పొమ్ము చా
లును నాగాంగన నీవు కోరఁదగునే ♦ లోకాంత రున్నన్నిటన్

ఉలూ—(భయకంపితచిత్తయై) ఓ దయామయా ! మీ యాగ్రహంబునకు నే నెట్లు పాత్రురాల నైతిని ? మనోవాక్కాయకర్మముల చేత మిమ్మే యాత్మభర్తఁగ

వరించి యున్న నన్నుఁ మన్నింపకున్న నే నీ మదనానలంబు సహింపఁజాల. మీ పాదపద్మంబులపైఁ బడి నా ప్రాణములను విడిచెదను. ప్రాణదానంబుకన్న పరమార్థం బొండెద్దియైనం గలదే? ఆర్తత్రాణపరాయణత్వమే కదా మీ సహజధర్మము. దాని నిపుడేల వీటిఁబుచ్చెదరు. అనుగ్రహించి నన్నుఁ జేకొనుఁడు. మఱియు,

చ. అలుఁగఁగనేల? నీదు విమ ♦ లాకృతి నే విని నిన్వరించితిన్
నిలుపఁగలేను పెన్వలపు ♦ నీదగు మోహనరూపదీపము
జ్వాలముగ రాగతైలమున ♦ వర్థిలఁజేసి మరుండు చిత్తమన్
శలభము భ్రాంతిఁజిక్కి యువ ♦ శత్వము జెందఁగ జేయఁ బ్రోపవే.
(అని పాదములపై వ్రాలుచున్నది)

అర్జు—(కొంచెము వెనుకకుఁ దొలంగి) మత్తకాశినీ! నన్ను ముట్టకుము. దూరముగఁ దొలంగియుండుము.

మత్తకోకిల

తీర్థవాసుల చెంత నీవు గ ♦ తిప్రసంగముఁ జేసినన్
వ్యర్థమంచు నెఱుంగవో? పరి ♦ హాసమో? మతిలేదొకో

ఉలూ—వ్యర్థమయ్యెనె మున్ను మేనక ♦ వచ్చి కౌశికుఁ గోర నా
ప్రార్థన న్విని నన్నమారుని ♦ బారిఁ ద్రోయక బ్రోవుమా.
(అని సమీపించుచున్నది)

అర్జు.(తొలంగి) చాలు చాలును బేలవై ననుఁ ♦ జోఁకగా వరియించి రో
బాల! నావ్రతభంగమున్ సలు ♦ పంగ నెంచెద వేలనే?

ఉలూ—తాళఁజాల విరాళి మన్మథ ♦ తాప మేర్చెడు నామదిన్
జాలి నొందెదు దీనురాలిని ♦ సాకినన్ వ్రతభంగమే?
(అని కదియబోవుచున్నది)

అర్జు—(తప్పించుకొని కోపముతో)

దుర్నీతిం బోదు నెట్టుంగవే? గమకించెదవే ననుఁ గూడఁగాఁ?

గందురే పతివ్రతల్ పర ♦ కాంతలం దురితాత్మలై!

ఉలూ—ఎంత యెందఱు నైష్ఠికోత్తము ♦ లింతులం దమిఁ గూడరో

సుందరాంగ! యెఱుంగవే? ననుఁ ♦ జుల్కఁ జేసెద వేలనే?

(అని కదియబోవుచున్నది)

అర్జు-(తొలంగి) పొమ్ము పొమ్ము కలంపఁ బోకుము ♦ పోఁడిగ నాదగు చిత్తమున్

ఉలూ—రమ్ము రమ్మిక నన్ను మన్మథ ♦ రాజ్యగామినిఁ జేయుమా

(అని కరంబుఁ బట్టఁ బోవుచున్నది)

అర్జు—(తప్పించుకొని) ఏమ్మెలాడిరొ యింత సాహస ♦ మేలనే? నను ముట్టకే

ఉలూ—కమ్మవిల్తుని బారి కోర్వను ♦ కౌఁగిటం గదియింపుమా

(అని కదియుచున్నది)

అర్జు (తొలంగి) పాపకార్యముఁ బల్కఁబోకుము

ఉలూ— ♦ బాల నేలిన పాపమే?

అర్జు—రాపు చేసెద వేలనే?

ఉలూ— వల ♦ రాజు పైఁ గినియం దగున్

అర్జు—నా వ్రతం జలపట్టితే?

ఉలూ— కరు ♦ ణామయుండవు గావొకో?

అర్జు—ఏపు మీరితి వేల?

ఉలూ— నాపతీ ♦ వీవ యాఁట మనోహరా!

(అని కౌఁగలింపఁ బోవుచున్నది)

అర్జు—(తొలఁగి చని తనలో) ఏమి యీ నాగాంగన సాహసము! దీని బారినుండి నే నెట్లు తప్పించుకోఁ గలుగుదును? ఈ జవ్వని నన్నే వరకే తనయాత్మభర్తఁగ వరించి యుండెనట. నే నిప్పు డేమి సేయుదును?

చ. జలభరితంపుఁగొండ నొక • చక్కని బెజ్జముఁ బడ్డ తోడనే
బలితపు జాఱఁదొడఁగొని • పల్లముకై బ్రవహించు నీరు ని
వ్వల మరలింప శక్యమగు • భామ నను౦ గనినంత లోని రా
గల హరి పాఱఁజొచ్చె నరి • గట్టుట యెట్లొకొ దాని నే నిర్క

నేనిపుడు నా మనోధైర్యమునుఁ జిక్కఁ బట్టవలయును. లేకున్నచో ధర్మవ్యతిరేకంబుగ నే నా యనురాగవాహిని మునుంగవలసివచ్చును (అని ప్రకాశముగా)

పంచచామరము

ఇదేమొఁ నిన్వరించి తెంచు • నిట్టి పెల్లవంబులన్
బదే పదే వచించె దీవు • వ్రాలుమాలి లేచి పోఁ
గదే మనుష్య నన్ను నాగ • కన్య నీవు కోరదే
మదించి పోవకున్న నిన్ను • మందలింతుఁ జూడుమీ.

ఉలూ—(తనలో) కటకటా! ఈ పురుషుని హృదయం బెంతవేడినను కరంగకుండె ఏమి చేయుదును. నా మాయచే వీని నాగలోకంబునకుం గొనిపోయెదను. పిమ్మట నామనోభీష్టంబు నెరవేర్చుకొనుటకుఁ బ్రయత్నించెదను. అదిగో నాతో మాటలాడిపోయిన బ్రాహ్మణోత్తముం డిటులనే వచ్చుచున్నాఁడు. నే నింక నిట జాలము సేయరాదు. (అని తనచేతనున్న యంగుళీయకంబుచే స్పృశియింప నర్జునుండు మై మరచుచున్నాఁడు) ఐహో! అంగుళీయప్రభావంబుచే నా మనోహరుం డింతవరకు సాధ్యుం డయినాఁడు కదా ఇఁక ననంతరకర్తవ్య మాచరించెదను (అని నిష్క్రమించి వెంటనే కమలికంబుతో ప్రవేశించి) నే నింక ధన్యురాల నయ్యెదను.

సుగంధివృత్తము.

ధన్య ధన్య ధన్య నైతి • దైవసత్కృపన్ జగ
న్మాన్య నామనోహరుం గొనంగఁగల్గె నింక సా
జన్యలీల వీనిఁ గూడి • సౌఖ్యమొందుచుందు నే
నన్య మేది నాగలోక • మందుఁ గాంతు తీరఁగన్.

(అని కుంచె నాడించుచు నర్జునునితో నిష్క్రమించుచున్నది)

[అంత బ్రాహ్మణరూపధరుండైన శ్రీకృష్ణుఁడు ప్రవేశించి]

శ్రీకృ—(స్వగతము) ఏమి! నాగాంగన యర్జును నాగలోకమునకుం గొనిపోయెఁ గాఁబోలు. ఆ మహావీరుం డతిధీరుండగుటచే నచ్చోనైన దానికి సాధ్యుండు కాఁడు మణిపూరపురాధీశ్వరుండగు చిత్రవాహనుండు తన కుమారీరత్నంబగు చిత్రాంగద నర్జునున కీయఁదలచి యిప్పుడతండు తీర్థయాత్రలు సేయుచుండె నని యెఱింగి వానికై యరయుచున్నవాఁడు. నే నిప్పుడు ముందుగ నాగలోకంబున కేగి యులూచి యభిమతం బీడేరునటులఁ జేసి పిమ్మట నయ్యర్జునుండు కావేరీసాగరసంగమంబున కేగునటు లొనరించెద. అటఁ బార్థుండు చిత్రాంగద వలలోఁజిక్కి దాని వలన నిరుపమానబాహుపరాక్రమోన్నతుండగు కొమరునిఁ బడయు ఆ బాలకుండు నం దర్జునుని భుజగర్వం బపనయింపఁ గలుగు నే నులూచికోర్కెఁ గొనసాగించుటకై యిప్పుడే నాగలోకంబున కేగెదను.

(అని నిష్క్రమించుచున్నాఁడు)

గద్య.

ఇది శ్రీమ ద్వేంకటరమణ కరుణాకటాక్ష వీక్షణాసార సమాసాదిత రస
బంధుర కవిత్వవైఖరీ ప్రవీణాపస్తంబసూత్ర శాండిల్యసగోత్ర పవి
త్ర హోతృకుల కలశార్ణవ రాకా కైరవమిత్ర వేంకటరత్న
సుపుత్ర వేంకమాంబా గర్భశుక్తి ముక్తాఫల వివిధ
విద్వజ్జన విధేయ వేంకటకృష్ణనామధేయ ప్రణీ
తంబయిన సుభద్రార్జునీయం బను
నాటకరాజంబున
తృతీయాంకము.

శ్రీరస్తు.

సుభద్రార్జునీయము.

చతుర్థాంకము.

ప్రథమ రంగము : కావేరీసాగరసంగమము.

[అర్జునుఁడు ప్రవేశించుచున్నాఁడు]

అర్జు.—(స్వగతము) అన్నా ! ఎంత మోసము వచ్చెను.-

చ. వ్రతమును వీటిబుచ్చి యనురాగమునన్ భుజగాంగనన్ మదో
ద్ధతి రతికేళిఁ గూడితి స్వధర్మ మటంచుఁ దలంప నైతి నా
మతిచెడ నేమి సేయుదును, మన్మథ శాతశరాగ్నికీల కా
హుతినిడి తీర్థసేవల ఫలోన్నతిఁ బాతకి నైతి నక్కటా

(అని యిటు నటు జూచి) ఏమిది ! నే గంగాతీరంబునఁగాక వేఱొండు చోటికిఁ గొనిరాఁబడితిని- ఇది ఏతీర్థమో కదా !

మ. అకళంకంబగు జాహ్నవీనదికి స్నానార్థంబు రా నాగక
న్యక దుష్టగ్రహమట్ల నావ్రతము భిన్నంబుండఁగా నన్ను మ
చ్చికఁ గొంపోయిన నాగలోకమునకుం జింతింప కేనెట్లు దా
నికి లోనైతినో బుద్ధిమాలి ననుమన్నింపంగ దే యీశ్వరా.

ఇది యొక నదీసాగరసంగమంబుఁ గాఁబోలు- ఓహో ! ఎంత మనోహరంబుగా నున్నది !

మ. చలితోత్తుంగతరంగహస్తముల నుత్సాహంబుచే వాహినీ
జలరాసుల్ పరివిభిన్నవారికణభాస్వన్మౌక్తికశ్రేణి సొం
పలరారన్ దలఁబ్రాలు వోయునన నానానేత్రపర్వంబుఁగా
విలసిల్లు న్నవఫేనహాసరుచులన్ విభ్రాంతిఁ గల్గింపుచున్

ఇది యేతీర్థంబైన ముందుగ దీనిలో నవగాహనం బాచరించి పిమ్మట మరి యొక తీర్థంబున కేగెదను- అచ్చోఁ గొందఱు తీర్థవాసు లవగాహనం బాచరించుచున్నారు- ఆహా !

సీ॥ కటిసీమ నున్న చ • క్కటి కేగి సూర్యున, కభిముఖులై తాన • మాడువారు
అంగవాసహితులై • కొంగు కొంగుబిగించి, సరిగంగ తానాలు • సలుపువారు
సంకల్పమునఁ జెప్పి • స్నానముల్ చేయించు, ధరణీసురులఁ బూజఁ • దనుపువారు
తీరంబునందున • భూరిదానంబుల, సద్వ్రతంబుల భక్తిఁ • జరుపువారు

గీ॥ కేలఁ ద్రిప్పుచు రుద్రాక్ష • మాల జలము
నందుఁ దీరంబునను రుద్రు • లన విభూతిఁ
బూసి మెయినిండ కనులను • మోడ్చి జపము
సలుపు బ్రాహ్మణసముదాయ • మలరునచట.

నేను ముందుగ నా తీరంబునకేఁ బోయెదను- ఆ తీర మెంత మనోహరము గానున్నది-

(అంత నేపథ్యమున)

అయ్యో ! అయ్యో ! రక్షింపుఁడు రక్షింపుఁడు.

అర్జు—(కోపవిస్మితుండై) ఏమిది ! ఈ యార్తనాదం బెచ్చోటనుండి వచ్చెనో !

(మరల తెరలో)

అయ్యో ! అబలనగు నన్నీ రాక్షసుఁడు చంపుచున్నాఁడు-

రక్షింపుఁడు రక్షింపుఁడు-

అర్జు—ఆఁ ! ఈయార్తాలాపం బొక యబలామణిదేనా ! ఈ లేమయెవ్వరో గదా- ఎవ్వరైన నేమి—

(మరల తెరలో)

ఓహో ! యార్తత్రాణపరాయణులారా ! తీర్థవాసు
లారా ! మా చెచ్చెలియగు చిత్రాంగద నొక
మాయావియెత్తుకొనిపోవుచున్నాడు- రక్షింపుఁడు రక్షింపుఁడు-

అర్జు—ఏమేమీ ! ఈ యెలనాగ మణిపూర పురాధీశ్వరుండగు చిత్రవాహనుని కొమరితయగు- చిత్రాంగదయేనా ? అట్లయినచో నియ్యది పరమపావనంబైన కా

వేరీసాగరసంగమము-ఆ లేమను రక్షించి మరల వచ్చి యా తీర్థంబునఁ గ్రుం
కోయెదను- కోమలీ ! భయపడకుము. ఓరోరిరజనీచరాధమ !

కం. కావరమున మదకరి రా
జీవముఁ గ్రహించు పగిదిఁ జిత్రాంగద మా
యావి ! గ్రహించితె నిను నేఁ
బో విడుతునె ప్రాణవాయు • వులు గొనకుండన్

ఇదిగో వచ్చుచుంటిని- కాచికొమ్ము- (అని నిష్క్రమించుచున్నాఁడు)

ద్వితీయ రంగము.

కావేరీసాగరసంగమము.

[అంత మునిరూపంబున శ్రీకృష్ణుండు ప్రవేశించి]

శ్రీకృ—(స్వగతము) మునిరూపంబున నున్న నన్నెవ్వరు కృష్ణుండని యెఱుంగఁ జాలరు- రాక్షసునిచేఁ జిత్రాంగద కొనిపోఁబడునట్లుఁ జేసి యామెను రక్షించు కైతవంబున నర్జునుండు చిత్రాంగద చెంత కేగునట్లుఁజేసితినిగదా- ఆ లేమ ధరించు నంగరమునఁకు గూడఁ నులూచి యంగుళీయప్రభావము నేఁ గలుఁగఁజేసితిని- అతండిం కాకన్నియ వలలోఁ జిక్కి- దాని యభీష్టంబుఁ దీర్చి మరలఁ దీర్థయాత్రల సలుప నీ దిక్కునకే చనుదెంచు- ఈనారీతీర్థంబున నొక యచ్చరయు దాని సఖీజనంబుశాపవశంబున మొసళ్లై యుండవగాహనంబాచరింపఁ దిగువారినెల్ల మ్రింగుచుండిరి- ఈ యర్జునునిచేతనే వారికి శాపమోక్షణంబుఁ గాఁ గలదు- కావున నే నాతండు వచ్చువరకు నిచ్చో వేచియుండి వచ్చిన పిదప వానిని సౌభద్రతీర్థంబునఁ గ్రుంగునటులఁ జేసెదను- (అని కూర్చుండి) ఇంక వీని మనంబు మా చెల్లెలైన సుభద్రపైఁ దగులునట్లుఁ జేయవలయును- కృతప్రతిజ్ఞాభరుండైన మాయన్నగారు సుభద్రను దుర్యోధనునకొసంగుటకై దగు ప్రయత్నంబులు చేయుచుందురా !

మ॥ జనకుం డుర్విఁ జననీ సహోదరులు మెచ్చంగ న్నిరీతి న్నృథ
ద్రిమఁ జేఁబట్టఁగ నర్హుఁడంచుఁ గినుకం, దర్పించుచున్ దానుబ,
ట్టిన కుందేటికిఁ గొమ్ములుండు నని న • ల్లేపట్టఁబట్టె న్సుయో
ధనుఁ డిం సోదరి పెండ్లి యాడఁగ బ్రియ • త్నం బేక్రియం జేయునో.

(అని యిటునటు నుపలక్షించి) అదిగో! ఎవరో యొక బ్రాహ్మణుండిటుల నే వచ్చుచున్నాఁడు- అతం డెక్కడ కేగుచుండెనో! నే నట నిలిచియుండెదను.

(అంత నొక బ్రాహ్మణుఁడు ప్రవేశించి)

బ్రాహ్మ—(స్వగతము) ఆహా! ఏమి నాయదృష్టము! చిరకాల మాశ్రయించుటచేత నేఁ గదా నేటికి నే నా హాలాయుధు ననుగ్రహంబుఁ గంటిని- నావంటి కటిక దరిద్రున కిట్టిభాగ్యము లభించు నెట్టిపుణ్యమో- ఆశ్రయ ప్రభావ మింత యొప్పునే! మహీతలంబున దరిద్రముకన్న పాపఫలం బిం కెద్దియైనం గలదె?

సీ॥ తన కులాచారంబుఁ • దలపంగ నియ్యదు, దారిద్ర్యమనెడు పె • ద్దమ్మ కాదె
మానాభిమానము • ల్మది నెంచ నియ్యదు, దారిద్ర్యమనెడు పె • ద్దమ్మ కాదె
కుటిల వృత్తులఁ బొట్ట • కూటికై నడిపించు, దారిద్ర్యమనెడు పె • ద్దమ్మ కాదె
పరుల హింసించిన • భరియింపఁ గాఁ జేయు, దారిద్ర్యమనెడు పె • ద్దమ్మ కాదె

గీ॥ కల్లలాడించుఁ బరధన • కాంక్షఁ గొలిపి
తస్కరునిఁ జేయు హేయ వ • ర్తనములందుఁ
జోరవఁ గలిగించు నిడుమలఁ • జొనపుచుండు
ధరణి దారిద్ర్య మనెడు పె • ద్దమ్మ కాదె

అట్టి దారిద్ర్యదోషంబు నాకుఁ లేకుండ జేయుటకై నాచే నిప్పుడు వారిసోదరీ రత్నంబగు సుభద్రాదేవినిఁ బరిణయంబగుటకై కౌరవరాజ్యరమాధురంధరుం డగు దుర్యోధనమహారాజగారికి బంధుమిత్రపరివారసమేతంబుగ గజఘోటక రథపదాతివర్గపరివృతుండై తరలి వచ్చునటులఁ జేయ నొక శుభలేక నంపుచుండిరి. ఇదేమిపాపమో పథిభ్రష్టుండనై నే నీ ప్రాంతమునకు వచ్చితిని. ఇచ్చోటనుండి యెంతశ్రమచేనైన నిభపురంబున కేగవలయును- (అని మొలనుండి శుభలేఖను దీసి చూచుకొని సహర్షంబుగ) ఓహో! ఏమి నాభాగ్యము! దీనిం జూచినతోడనే యా దుర్యోధన మహారాజగారు నా కమితమైన

ద్రవ్యంబును వివిధరత్న మాల్యాంబరాభరణంబులును జిలుగుచీనాంబరంబులు నొసంగుదురు. ఆ కానుకలన్నియు నేనుగులమీదను లొట్టియలమీదను వేయించుకొని కరిపురంబునుండి తిరుగ ద్వారకకు వచ్చినతోడనే చిరకాలము నుండి నన్నాశ్రయించియున్న పెద్దమ్మను వెడలఁగొట్టెదను- అహాహా! ఓహో హో (అని నవ్వుచుండ వృశ్చికదష్టుండై శుభలేక క్రిందఁబడ నొకగంతు వైచి) అహో్చ! అయ్యో! అమ్మో! చచ్చితిని- చచ్చితిని- నారాయణ! నారాయణ! హా! హా! నన్నుఁ దేలుకుట్టినది. హి-హి-హీ-హి (అని యేడ్చుచుఁ జదికిలంబడి తేలుకుట్టిన కాలు పైకెత్తి పట్టుకొని) అబ్బబ్బబ్బబ్బ! ఈ వేదన నే నెట్లు సహింతును! అయ్యో ఎక్కుచున్నది- ఎక్కుచున్నది- హా! హా! కాలుమీద పర్వతము పడినట్టులున్నది- అయ్యయో! గునపముఁలో బొడిచినట్లు పొడుచుచున్నది. అ-బ్బ-అయ్యో-దైవమా! మెంగము తిరుగుచున్నది ఆ హా! భరింపజాల- భరింపజాల! అయ్యయ్యయ్యయ్యో! ఏమిది కన్నులు పచ్చబడుచున్నవి- కటకటా! అన్నన్నా! నా కాలంతయు గానుగలోని చెఱుకుగెడఁవలె నలుగుచున్నది- ఏమిసేయుదును- అయ్యో నా ప్రాణములు నిలువవు- అయ్యో! అయ్యయ్యో! అయ్యయ్యయ్యో! అయ్యయ్యయ్యయ్యో అంతకంత కెక్కువగుచున్నది. హా! హా! (అని యెలుంగెత్తి యేడ్చుచున్నాఁడు.)

శ్రీకృ—(తనలో) అన్నా! పాప మీబ్రాహ్మణుండు వృశ్చికదష్టుండై బాధపడుచున్నాఁడు. నా మంత్రబలంబుచే వీని కీబాధమాన్పెదను- (అని బ్రాహ్మణుని చెంతకేగి ప్రకాశంబుగా) బ్రాహ్మణోత్తమా! నే మంత్రించి మీ కీబాధ మాన్పెదను- శాంతింపుఁడు- (అని మంత్రించుచున్నాఁడు)

బ్రాహ్మ—(సంతోషముతో లేచి) ఓహో మహానుభావా! నాపాలిటి భాగ్యస్వరూపులైన మీ యనుగ్రహంబుచే నా బాధ యాపత్తు నివారితమైనది- ఏమయా మీ మంత్రమహిమ! నేనింక కృతార్థుండ నయ్యెదను.

శ్రీకృ—భూసురోత్తమా! తేలుకుట్టిన కా లొకసారె ఝాడింపుఁడు

బ్రాహ్మ—మంచిది (అని రెండుమూడుసార్లు ఝాడించి యిటునటు నడుచుచున్నాఁడు)

శ్రీకృ—విప్రోత్తమా! మీ రిపు డెచ్చోటనుండి వచ్చుచుంటిరి?

బ్రాహ్మ—మునిచంద్రమా ! నే ద్వారకాపట్టణంబునుండియే వచ్చుచున్నాఁడను.

శ్రీకృ—మీ రెట్టికార్యార్థమై బయలుదేఱితో చెప్ప నగు నేని వక్కాణించెదరా ?

బ్రాహ్మ—ఇట్టి మంత్రమహిమఁగల మీవంటి మునిశ్రేష్ఠులకు నా పూనిక తెలియకుండునే ? నే నొక శుభకార్యార్థమై హస్తినాపట్టణంబుఁగూర్చి పోవుచుంటిని. మీరు కూడఁ జూడుఁడు. (అని శుభలేకకై మొలఁ దడివి కుదిలేమి రొఱింగి) అకటా ! నా యొద్దనుండు శుభలేక యేమయ్యెనో కదా ! తేలుబాధచే నొడలెఱుంగక దాని నెచ్చోట జారవిడిచితినో ! నే నిపు డేమి చేయుదును.

శ్రీకృ—(తనలో) నే ననుకొన్నటుల మా యన్నగారు దుర్యోధనుని రప్పించి వానికి సుభద్ర నిచ్చి వివాహముఁ జేయఁ బ్రయత్నించుచుండిరి కాఁబోలు. ఈ బ్రాహ్మణుఁడు జారవిడిచిన శుభలేఖ యదియే యై యుండవచ్చును. (ప్రకాశముగా) భూబృందారకా ! ఏల వగచెదరు ? ఆ శుభలేఖ యీప్రాంతంబున నెందైనఁ బడియుండును. చూడుడు.

బ్రాహ్మ—మంచిది. (అని యంతటను గలయఁజూచి యెచ్చోటను గానక) అయ్యో ! శుభలేక యెచ్చోటనుఁ గానరాదయ్యె. నే బూనివచ్చిన కార్యమంతయు విఫలమైపోయినది.

సీ॥ చిరకాల మాశ్రయిం • చిన కారణంబున, బలరామునకు దయ • కలిగె నింక
నిభపురంబున కేగి • శుభలేఖఁ జూపిన, నా మహారాజు న • న్నాదరించి
కాంచన మాణిక్య • కలిత, కల్యాంబరాభరణము లొక్కొక్క • గరిమనొసఁగు
నా దరిద్రత వాయు • మోదంబు ఘటియిల్లు, వదలు భిక్షాపాత్ర • భాగ్యమబ్బు

గీ॥ నా సతీపుత్రులకును మ • నంబు లలరు
ధర్మకార్యాంగణంబుల • వరలుచుందు
ననుచు నువ్విళు లూరితి • నకట ! యిప్పు
డేమి సేయుదు శుభలేక • యెగిరిపోయె॥

దురదృష్టవంతునకు సిరి యబ్బునెట్లు ? అయిన మరల నే ద్వారకకేగి బలరాముని బ్రార్థించి యింకొక శుభలేకనుగొని హస్తినాపురంబునకుఁ బోయెదగాక.

(అని నిష్క్రమించుచున్నాఁడు)

శ్రీకృ—(స్వగతము) పాప మా బ్రాహ్మణుఁడు వృశ్చికదష్టుండై యావేదనచే నొడ
లెఱుంగక తాను గొనివచ్చుచుండు శుభలేఖ నెచ్చటనో జారవిడిచినాఁడు.
దానిని మరలఁ గనుఁగొనలేక వగచుచు వచ్చి లోపనే పోయెఁగదా. అబ్బా!
తేలుబాధ యెంతయైన దుర్భరము. కాని,

మ. తనలాభంబును మాత్రమే కని పరార్థం బేదు స్వార్థాభిలా
షుని చెయ్వుల్తన మేలు నెంచని నికృష్టుల్సల్పు కార్యంబులె
వ్వనికి న్మంచిగనుండు లోపలి స్వయంపాకుల్ జేయుకృత్యంబులెం
దునుఁ దేల్గుట్టిన బాధకన్నఁగడు సాధుశ్రేణిఁ బాధించెడున్

ఏమి చెప్పవా యర్జునుం డింకను రాఁడయ్యె! ఆతండు చిత్రాంగద కడఁ
బాయ లేకుండెను కాఁబోలు. అదిగో తలంచినంతనే వచ్చుచున్నాఁడు నేను
ముందుకర్తవ్య మాచరించెదను (అని నిష్క్రమించును)

తృతీయ రంగము.

నర్మదా సాగరసంగమము.

[అంత అర్జునుండు ప్రవేశించి]

అర్జు—(తనలో) అన్నా! నా తీర్థసేవల కెట్టి యంతరాయములు కలుగుచున్నవి!
ఇంతసేపు నే నెచ్చోట నుంటినో గదా! స్నానార్థ మరుగుటకుఁ గాలాతీత
ము కాలేదు. అదిగో నర్మదా సాగరసంగమము ఇదియు నొక మేలె.

చ. మొల నొక యంగవస్త్రము విభూతియు జక్కని తామ్రపాత్రద
ర్భలు వివిధాసనంబులు గభీరంబుల మూపున నొప్ప నల్వలం
కుల రయ మొప్ప నానదిని గ్రుంకులిడంగడు వేడ్కఁ దీర్థవా
సులు చన దెంచుచుండిర దె సూర్యుఁడు ప్రాఙ్నగమందు దోచెడున్

(అని తనశరీరముఁ బరికించి నిర్వేదమందుచు) ఏమిది! ఆశ్చర్యముగనున్న

చ. వినయముఁ గాఁదీర్ఘ సేవలఁ బూరించుచుఁ గన్యకఁ గోరిఁగూడ మీ
రినగతి భస్మభూషిత శరీరము చందనచర్చ నొప్పె నిం
చెను రదనక్షతంబులను జెక్కులిపై నును వెచ్చ తావి చెం
దెను జిగి కెంపు కస్తురివి డెమ్మన మోవి యిదేమి చిత్రమో

నాగకన్యకరైన యులూచివలె నీ చిత్రాంగదయు నన్ను మోసముఁ జేసె గాఁబోలు. మించినదానికై యేగచుట గతజలసేతుబంధనము. నేనుగూడ ప్రాణార్థ మరిగెదను (అని నల్వంకలు గలయఁ జూచి యుత్కలికఁ దనలో) ఏమేమి! ద్వారకాపట్టణం బీ సమీపంబుననే కలదు? ఔహో! నే నిప్పుడే ద్వారకాపురవరంబున కేగి,

మ. కనుఁగొందుఁ బలరామకృష్ణులను నేఁ గన్నార నాపట్టణం
బున నత్యున్నత సౌధరాజమునఁ బెంపుం జెందు నాబంధులన్
దనివొందన్ గమలాక్షిఁ గన్యక సుభద్రం జూచెద న్మెమ్మన
మ్మున హర్షాంబుధి నోలలాడుదు బలేపుణ్యంబున న్నేఁడహా.

(అని కొంచెము ముందరకు నడిచి) ఇచ్చోట సిద్ధయోగి యొక్క యుత్తరము పడియున్నది. (అని శుభలేఖఁ దీసి) ఇదియొక శుభలేఖవలెనున్నది. అని విప్పి చూచి నివ్వెర గంది) ఏమేమి! బలరాముఁడే యిట్టి దారుణ కృత్యంబునకొడిగట్టెనుగా! వీని దుష్ప్రయత్నంబున కా కన్నియ సమ్మతించి యుండునా? అట్లైన్నటికిని గానేరదు. ఇప్పుడు నే నేమి చేయవలయును. భగవానుఁడైన శ్రీకృష్ణునిఁ బ్రార్థించుటయే కర్తవ్యము. (అని నిమీలిత నేత్రుండై యంజలి ఘటియించి)

దండకము.

శ్రీ రుక్మిణీమానసాంభోజమిత్రా కనత్పద్మనేత్రా మృదుస్మేర వక్త్రా లసద్దివ్యగాత్రా వతత్రాణవేత్రా సురానీక సేవోల్లసద్దివ్యపాత్రా శ్రీలోద్యానచైత్రా స్వభక్తాళిపాపోగ్రవల్లీలవిత్రా నిశాటాంగనా నిగళ శత్కంఠసూత్రా మహాచిత్రచారిత్ర శ్రీదేవకీదేవిపుత్రా సదా గోపగోపాంగనాలోల బృందావనాలీల గోపాలబాలా యశోదామనోల్లాసఖేలా విమోహప్రభాజాల సౌజన్యశీలా

కరాంగుష్ఠసంచాలనోద్భూతసద్వేణునాదానులోలా త్వదీయపవిత్రభావంబు బ్ర
హ్మాది బృందారకేంద్రుల్గనం జాలరే నెంతవారైన మహామోహ మగ్నుండ
దీనుండనై నే నినుం జూడఁగాఁ గోరి యీ తీర్థమందున్నవాఁడన్ దయం
జూడరావే ననుం బ్రోవ నీవే శరణ్యంబు కావే త్వదీయాగ్రజన్ముండు నీ సోదరీ
రత్నముం దుష్టదుర్యోధనుండే వివాహంబుగా యత్నముం జేయు మేనత్తకుం
బుత్రుఁడన్ నీకు నే భక్తుడన్ నన్ను నీరీతి దూరస్థునిం జేయఁగాఁ బాడియే
ద్వారకాపట్టణం జేరియుం జేరుదుం జేరి యేరీతిఁ గాంతు న్సుభద్రం దమి
న్గాంచినం గన్య చిత్తం బదెట్లుండునో నన్ను నేలాగు భావించునో చుట్టమం
చెంచి చేపట్టఁగాఁ జూచునో యన్నభావంబు మన్నించునో గోచరాదింక
నా భాగ్య మెట్లౌనొ కృష్ణా గతానంతతృష్ణా ననుం గావ దీనార్తి సంత్రాణ
కారుణ్యభావంబు నాయందు లేదా కరిం గావలేదా హరీ నీకు నేదాసుడ
న్నాలో వాదాకృపన్నా మొరాలింప రారాద నీవాఁడ నేగాద వేదానుమోదా
మునీంద్రాళిహృత్కంజపీఠస్థపాదా మహీందివ్యసుక్షేత్ర తీర్థప్రసాదా ముకుందా
మహేంద్రాది బృందారకానందసందోహ నిస్తంద్రసాంద్రాయుపేంద్రా నమస్తే
నమస్తే నమస్తే నమః.

[అంత శ్రీకృష్ణుండు నిజరూపమున బ్రవేశించి]

శ్రీకృ—(తనలో) ఈయర్జునునకు నా యప్పరోంగన వలన నా చెల్లెలైన సుభద్రపై
యనురాగము బలముగఁ గలిగినది- అతి ధీరుండగు నీతని నా యాలోచిని
జిత్రాంగదనుఁ గూడునట్లుఁ జేయుట కంతి శ్రమపడవలసివచ్చెను! ఇప్పుడీత
డు నా చెల్లెలను స్వబుద్ధినే వరించుచున్నాఁడు- కావున వీనికి సుభద్రను స
ఘటించెదను- (అని యర్జునుని సమీపించి) అర్జునా! ఖిన్నుఁడవై నీ విచ్చో
టఁ బరిభ్రమించుచుంటివేమి?

అ. వినుపింపందగు నీదు కోరి కిపుడు న్నేవేగ నీవా యులూ
చిని నేరీతివి బాసియుంటి ననుచున్ జింతించెదో యల్ల భా
మినిఁ జిత్రాంగదఁ గోరితో మరల పేర్మి న్సీనుత శ్రేణి య
ట నిలావంతుని బభ్రువాహనునిఁజూడం గాంతు జన్మించెనో

అర్జు—ఓహో బావా! మహానుభావా! వచ్చితివా! (అని నమస్కరించి లేచి) ఆ కాంతామణుల మయాకౌశలంబు లెట్టివియో గాని నన్నాయాయెడలఁ జైతన్యరహితునిఁగాఁ జేసి మోసముచేసిరి. అట్టి మాయలాండ్ర నే మరలఁ జూడఁ గోరుదునా! ఈ శుభలేఖఁ జూడుము. (అని శుభలేఖ చేతి కిచ్చుచున్నాఁడు)

శ్రీకృ—(శుభలేఖ నందుకొని చూచి చిఱునగవుతో) అర్జునా! ఈ లేఖయందేమి చిత్రమున్నది!

అర్జు—బావా! ఏ మట్లు పలికెదవు? అందు వైచిత్ర్యమే కానరాకుండెనా?

చ. గురుతర శిష్యవత్సలత • కుం దగు పాత్రికము స్వహించి మే
నరికము మాట నెంచక మ • నంబున నావయిఁగూర్మిఁ దక్కియా
వరుసను కౌరవేశ్వరుసు • భద్రకు భర్తఁగఁ జేయఁబూనె స్సో
దరుఁడు హలాయుధుండువిధి • తంబుగ ధర్మమె యట్లు జేయఁగన్

మఱియు

ఉ. "దిట్టతఁ గల్గెనింక వసు • దేవున కాత్మజపుట్టెఁ బార్థుఁ జే
పట్టును నాకుఁ గోడలగు • భాగ్యము పండె" నటంచుఁ దండ్రితోఁ
బుట్టువు పుట్టె డానఁగొని • మోదము నొందఁగ నీటు భాత్రిత హా
కట్టున కష్టచిత్తుఁడగు • కౌరవనాథు సుభద్ర కివ్వెడుకా.

ముకుందా! తండ్రిపోయిన నాటనుండియుఁ గన్నతండ్రికన్న నెక్కువగఁ గంటెని అప్పవలె నన్నుఁ గాచి రక్షించుచున్న నీకన్న నాకిప్పట్టున శరణంబు లేదుకదా. కావున నీ వనుగ్రహించి యేవిధంబుననైన సుభద్రఁ గైకొనెడు భాగ్యము నా కబ్బునటులఁ జేయుము.

శ్రీకృ—(చిరునగవుతో) అర్జునా! ఏమి! నీ విదివరలోఁ జేకొనిన భార్యలు చాల కుండిరా?

చ. మును నలదాత్రిపదిం గొనియు • మోదము నొందక దానితో నులూ
చిని మది గోరినావదియుఁ • జిక్కనఁజాలక వెండి చిత్రివా

హానిని తనూజుఁ గైకొనవె ♦ యంతటితో నరిపోక నా సుభ
ద్రను వరియింపుచుంటి వది ♦ దక్కనచో మరి దేనిఁ గోరెదో

అర్జు—బావా! నేను స్త్రీలోలుఁడ ననియే తలంచితివా? మాయావృతుండనై శరీర పారవశ్యంబున నేనొనర్చిన యపరాధంబుల నుగ్గడించి విరక్తుకంబుగ నన్నేల జాలి నొందించెదవు? నీవు నా కెవిధంబుననైన నా సుభద్రను భార్యఁగా సమకూర్చితివేని హృదయసమర్పణచే నే నా సతీతిలకంబును నిరంతరము నారాధించుచుండెదను.

శ్రీకృ—అర్జునా! నీ ధర్మపత్నియైన ద్రౌపది నేమి చేసెదవు?

అర్జు—బావా! ధర్మపత్నియైన ద్రౌపది యున్నను నా సోదరుండగు వృకోదరుండు వేఱొక భార్యను స్వీకరింపలేదా? అది క్షత్రియధర్మానుసారమే కాదా? అటులనే సుభద్రను సహధర్మపత్నిఁగాఁ గైకొనెదను.

శ్రీకృ—అర్జునా! మేనత్త మేనమామబిడ్డలగుటచే సుభద్రపై నీ కట్టి యనురాగము కలుగుట సహజమే. కాని పెద్దల యుద్యమమును నే నేలాగు వారింపఁ గలుగుదును? నీ వింక నా సహోదరిపై యాస వీడుము. అది మరియొక్కని యధీనంబుఁ గానై యున్నది.

అర్జు—అయ్యో బావా! అట్లనకుము.

చ. నరకముఁ జూడఁ బొమ్మనిన ♦ నాగమువాతఁ బడఁ గూలుమన్న న
ధ్ధుర పటుదావవహ్నిఁ బడి ♦ దొర్లుమటన్న సహింతుఁ గాని యి
ల్లరుతర పర్వతాగ్రమున ♦ నుండు మనుంబడఁ ద్రోయు "నా సహో
దరివయి యాశ వీడు మది ♦ దక్క మరొక్కని" కన్న నోర్తునే

శ్రీకృ—(తనలో) ఈతఁడు నా చెల్లెలిపై బద్ధానురాగుండై యున్నాఁడు. వీని కా కన్నియ నెటులైన సంఘటనముఁ జేయవలయును. ఎట్లొకొ దా? (అని కొం చె మాలోచించి) ఆ! నాకిపుడొక చక్కనియుపాయము తోఁచినది. యా వులకు యతీశ్వరులయెడ భక్తి మెండు. వీని యతీశ్వరవేషంబున రైవతకాద్రి కిం గొనిపోయెదను. పిమ్మటఁ జరుగవలసిన దక్కడనే యాలోచింపవచ్చును

(ప్రకాశముగా) అర్జునా! నీకు నిశ్చయముగ సుభద్రను గైకొనవలయు ననుతలంపు కలదేని నీవు నాతోడ రమ్ము. నేను చెప్పినట్లు నీవు నడుచుకొనవలయును సుమీ.

అర్జు—బావా! నీయాజ్ఞ నుల్లంఘింతునా? ఇదిగో వచ్చుచుంటిని.

(అని యిరువురు నిష్క్రమించుచున్నారు)

గద్య.

ఇది శ్రీమద్వేంకటరమణ కరుణాకటాక్ష వీక్షణాపార సమాసాదిత రస
బంధుర కవిత్వవైఖరీ ప్రవీణాపస్తంబసూత్ర శాండిల్యసగోత్ర పవి
త్ర మాతృకుల కలశార్ణవ రాకా కైరవమిత్ర వేంకటరత్న
సుపుత్ర వేంకమాంబా గర్భశుక్తి ముక్తాఫల వివిధ
విద్వజ్జన విధేయ వేంకటకృష్ణనామధేయ ప్ర
ణీతంబయిన సుభద్రార్జునీయం బను
నాటకరాజంబున
చతుర్థాంకము.

శ్రీరస్తు.

సుభద్రార్జునీయము.

పంచమాంకము.

ప్రథమ రంగము : ద్వారకాపట్టణపరిసరము.

[బలరాముఁడు ప్రవేశించుచున్నాఁడు]

బల—(స్వగతము) దుర్యోధనుండు మహారాజ్యపట్టభద్రుండై యపారవిభవంబుల నోలలాడుచుండ గుణవంతుండనియు ధర్మాత్ముండనియుఁ బౌరుషవంతుండనియు విశేషించి మేనత్తకొమరుండనియు మాతల్లిదండ్రులు బుడుతవాని మాటలనుబట్టి నా ముద్దుచెల్లెలైన సుభద్ర నర్జునునకే యీయ నెంచుచుండిరి- ఏమి వారియజ్ఞానము !

ఉ. కౌరవరాజ్యవల్లభునిఁ ♦ గైకొనఁ జేసిన చో సుభద్ర బం
గారపు తూఁగుటుయ్యెలలఁ ♦ గౌతుక మొప్పఁగ నూగుచుండఁ గ
న్నారఁగఁ జూడ వచ్చును గ ♦ దా మరి యర్జునుఁ జెట్టవట్టినన్
బేరిమి కల్గునే? మిగులఁ ♦ బేదరికంబున నుండకుండునే.

రారాజైన దుర్యోధనమహారాజు ప్రభావము తెలుంగకుండిరి- "ధనమూల మిదంజగత్" అనువాక్యము తెలుంగరో యెంచియు నాఁడబడుచు పుత్రుం డగుటచే బంధుమోహంబువనే యర్జును కెక్కువగ నెంచుచుండిరో తెలియకున్నది- దుర్యోధనుండు మాత్రము గుణవంతుఁడు కాఁడా ధర్మాత్ముండు కాఁడా! పౌరుషవంతుఁడు కాఁడా ! ఇంతియేల ! ఎంతైనను ధనములేని వాని బ్రతుకు నిరర్థకమే కదా- మరియు,

కౌంతేయులిప్పుడు మహావైభవోపేతులైయున్న నయ్యది నిల్చునే ? ఏమన

భుజంగప్రయాతము.

జయంబందలేదొక్క ♦ చక్రిన్మెలంగన్
నియంతంధుఁడిచ్చెన్న ♦ ణింపంగ నందున్
మయుండే సృజించెన్స ♦ భన్ సౌధసీమన్
దయాధర్మభీతుంబు ♦ దాసుంస్థిరంబే?

క. ధనవంతుఁడె గుణవంతుఁడు
ధనవంతుఁడె సత్కులుండు ♦ ధర్మాత్ముండున్
ధనవంతుఁడె ధీమంతుడు
ధనవంతుఁడె వ్యర్థతముఁడు ♦ ధనహీనుఁ డిలన్

కావున నెవ రెంత చెప్పినను నాముద్దుచెల్లెలను దుర్యోధనునకేగాని యొండొకని కియ్యనియ్యను. నేనింత యోజనసేయనేల ? నా చెల్లెలుమాత్రము రారాజును మాని యర్జునుని వరించునా ?

చ. అనుపమరాగశోభితము ♦ నై బహుశాఖలు నివ్వటిల్ల మే
దిని విలసిల్లు భూజము న ♦ తిప్రియమందంబునఁ జేరు భృంగి చే
రునె యొకశుష్కభూరుహముఁ? ♦ రాధిసు యోదనుఁ డేగ్రహించునిం
తిని నిక వెన్న చేత నిడి ♦ నేతికి నేటికి నంగలార్వఁగన్.

అని నల్వలంకులఁ గలయఁజూచి) ఏమిచెపుదు ! దుర్యోధనుండు బంధుమిత్ర పరివారసమేతుండై చతురంగబలంబులతో నింకను రాఁడాయెను ! నే పంపిన శుభలేఖ వాని కందలేదో- శుభలేఖఁ గొనిపోయిన బ్రాహ్మణుండునుఁ దిరుగ వచ్చిన జాడలేదు. (అని యిటు నటుఁ జూచి) అదిగో వచ్చుచున్నాడు !

[అంత బ్రాహ్మణుండు ప్రవేశించుచున్నాఁడు]

బ్రాహ్మ—(తనలో) బలరాముం డేకతంబ యిచ్చో వసియున్నవాడు. ఈతం డతి కోపశీలుఁడు. శుభలేఖపోయినదని చెప్పినచో కోకలిపోటు చే నన్ను యమపురంబునకేఁ బంపునో దయామయుండై యా లేఖపోయిన విధంబును విమర్శించి

నాపై జాలిఁ బూని నేఁటికి శుభలేఖ నిచ్చి యిభపురంబునకుఁ బంపునో నా యదృష్ట మెట్లున్నదో తెలియరాదు.

(అని సమీపించుచున్నాఁడు)

బల—(బ్రాహ్మణునిఁ జూచి) విప్రవర్యా! నమస్కారము.

బ్రాహ్మ—స్వేష్టదేవతాప్రసాద సిద్ధిరస్తు.

బల—పురోహితవర్యా! కృతార్థులై వచ్చితిరా?

బ్రాహ్మ—హాలధరా! కరుణోదారుండవై యీ పేదబాపని ననుగ్రహింప వేఁడెదను. మార్గమధ్యంబున శుభలేఖ పోయినది.

బల—(కోపముతో) ఏమేమి! నీవు హస్తిపురంబున కేఁగనే లేదా?

బ్రాహ్మ—రేవతీమనోహరా! నా యభాగ్యదేవత దారిఁ గాచి నా పూన్కి విఫలంబు చేయ శుభలేఖ నపహరించినది. నే నెట్లు కరిపురంబున కేఁగుదును?

బల—ఏమేమీ!

బ్రాహ్మ—హాలధరా! శుభలేఖఁ గైకొని కరిపురంబున కేఁగుచుండ నదేమి దురదృష్టమో వింధ్యపర్వతప్రాంతంబునఁ బథిభ్రష్టుండనై దక్షిణాభిముఖంబుగఁ జనుచుంచి కావేరీ సాగరసంగమంబు చెంతకుఁ జేరితిని.

హాల—మూర్ఖుఁడా? నీవు నిశ్చయముగ దక్షిణాభిముఖంబుగఁ జనవలసినవాఁడవే. పిమ్మట నేమి జరిగినది?

బ్రాహ్మ—అచ్యుతాగ్రజా! ఏమని చెప్పుదును? తలంచినంతనే మరల బాధ కలుగుచున్నది. (అని బాధనభినయించుచు) అచ్చో నుండ వృశ్చికదష్టుండనై యా వేదనచే నొడలెఱుంగక చేతిలోని శుభలేఖ నచ్చోటనో జారవిడిచితిని. అప్పు డా తీరంబున నున్న మునిశ్రేష్ఠుండనుగ్రహించి మంత్రింపకున్న నీవన్నటుల నేనిశ్చయముగ దక్షిణాభిముఖుండనే యగుదును. దయామయుండవై నేఁటికి శుభలేఖ నొసంగుము. ఈసారి బోయి కృతార్థుండనై వచ్చెదను

బల—మందబుద్ధీ! నే తలంచిన కార్యంబున కిట్టి యపశకునంబును ఘటించితివి! నిన్నేమి చేసినను పాపము లేదు.

ఉ. హెచ్చిన వేడ్క మైమరచి • యింతఁగ నీసిలి చాలుచాలు నీ
వచ్చిన త్రోవనే చనుము • పాణిమూపై నికయాశగల్గినఁ

వచ్చెను నీదు కాలము • నమ్మగవచ్చునె నిన్ను వెండియున్
బుచ్చెదఁ బోవకున్న హల • ముం గొని నిన్నిఁకఁ గాలుపోరిలికిన్

(అని ముసలం బెత్తుచున్నాఁడు)

బ్రాహ్మ—అయ్యో! అయ్యో! ఇదే పోవుచుంటిని- రక్షింపుము- రక్షింపుము.

(అని పరువిడి పోవుచున్నాఁడు)

బల—(తనలో) ఈబ్రాహ్మణుండు పౌరోహిత్యంబునకుఁ బనికిరాఁడు- వేఱొక బ్రాహ్మణు నేరినైనఁ జూచి మరియొక శుభలేఖ నంపి దుర్యోధను నిచ్చోటకు రప్పింపవలయును- ఆ విప్రోత్తముండు కృతార్థుండై తిరుగవచ్చినచో వానికి పౌరోహిత్యం బొసంగరాదను (అని కొంచెము సుందరకు నడచి) అదిగో యాదవోత్తముండగు హార్దిక్యుం డిటులనే వచ్చుచున్నాఁడు.

[అంత హార్దిక్యుండు ప్రవేశించి]

హార్ది—దేవా! మన పట్టణంబు చెంగట రైవతకాద్రిపై యెవరో యొక యతీశ్వరుండు దయచేసి యున్నాఁడు.

బల—ఏమేమి! మన పురవరంబు చెంతకుఁ బూజ్యులైన యతీంద్రులు దయచేసి యుండిరా? నే వినలైతిని.

హార్ది—అవును! వాని సుస్వరూప మేమని చెప్పుదును

మ. హరియో సూర్యుఁడో చంద్రుఁడో యనలుఁడో • యాదేవ దేవుండో వి
స్మర దాకారముచేఁ ద్రిదండి యగుచున్ • భూతి స్మోయిం బూసి త
చ్ఛిరమందుం జటలొప్ప గాటి ధరియిం • చె శ్మేనిపై నా యతీ
శ్వరుఁ డేలాటి మహానుభావుఁడో కలం • ప న్వచ్చి యుండె న్గిరిన్.

నే వానిని కన్నులారఁ జూచివచ్చితిని.

బల—ఓహో! ఏమి మహాభాగ్యము! ఆ మహనీయుని సందర్శనము ముఖ్యముగ వందనముఁ జేయవలసినదే- హార్దిక్యుఁడా! ఈసంగతి మనవారందరికి తెలింగించి వారినిఁ దోడ్కొని రమ్ము- నే ముందు బోవుచుండెదను.

హార్ది—మంచిది. (అని యిరువురు వేర్వేర నిష్క్రమించుచున్నారు)

ద్వితీయ రంగము.

రైవతకాద్రి.

[శ్రీకృష్ణుఁడు నర్జునుఁడు ప్రవేశించుచున్నారు]

అర్జు—బావా! నీ యనుగ్రహంబుచే యతివేషంబును ధరించి నే ద్వారకాపట్టణ పరిసరంబునకు వచ్చితిని. కాని నాకొక్క భయంబు తోఁచుచున్న యది. ఏమన,

గీ. కమ్మతావి నొసంగు పుష్పమ్ముఁ గోసఁగఁ
కంటకము లుండవే? యట్లు గాక వినవె
కలుగు శ్రేయంబులకును విఘ్నము లనంగ
హాలధరుని యత్న మెంచ భయంబు తోఁచె.

మ. యతివేషంబున నేక్రియం బురికిఁ బోనౌనో! చనం లేనిచోఁ
గుతుకం బార సుభద్ర నేవిధిని నాకుం జూడఁగా నౌనో! కో
రిక నాకన్యక నెట్లు సాధ్యయగునో! పేర్మిన్ గౌరవత్న్యాభిభుం
డతిమోదంబునఁ గైకొనం గలుగునో యుబ్జాతి నెట్లోఁ గదా.

శ్రీకృ—అర్జునా! ఈ రైవతకాద్రిపైఁ గొంతతడవు విహరింతమురమ్ము. ఇందు,

చ. వెలయు ననేక దివ్యతరు బృందములుం గమలాకరంబులుఁ
జెలఁగెడు ముద్దుపల్కులను జిల్కలు సొంపులు మ్లెసంగుచుఁ
గలవు లతానికుంజములుఁ గాంచన కైతక పుష్పరాజముల్
చలువలొసంగు గాలి సుమసౌరభముల్వెదఁజల్లు చుండుఁ.

అర్జు—బావా! విరహాజనులనుఁ బీడించు నవన్నియుం నాకెట్లు మనోల్లాసకరంబులగు?

మ. పొలుపొందం దిలకంబు నాకురువకంబుం జూచినం గన్యక
దిలకించున్మదిఁ గౌఁగలించు నని యుద్దీపింపవే కోకిల్?
చిలుకల్ పల్కెడు ముద్దుపల్కులు మదిం జేకాకుఁ గావింపవే!
యలరుం దావులుఁ జల్వతెమ్మెరలు నత్యంతంబు నొందింపవే

శ్రీకృ—(తనలో) నే ననుకొన్నటుల నిప్పు డీతండు నా సుకుమారకుమారుండగు మా
రుని యధీనుండయి యున్నవాఁడు. వీని యుద్రేకంబు వారింప కున్నచో కా
ర్యము చెడును. ఎట్లోగదా! (ప్రకాశముగా) అర్జునా! నీవిట్లు చెట్లచేమలఁ
జూచినంతనే భ్రమఁజెందెద ననుచుంటివి. నా చెల్లెలనే జూచినచో నీ వే
మయ్యెదవో గదా!

అర్జు—మన్మథునికి గింకరుండ నయ్యెదను. బావా! నిశ్చయముగ నే నాకోమలాంగి
నిఁ జూడఁ గలుగుదునా?

చ. వినుము చకోరకంబు తమి • వెన్నెలఁ గోరువిధంబు స్వాతికా
ర్తినిఁ బడు వర్షబిందువు ప • తిప్రమదంబునఁ గోరు శుక్తిలా
గున నవలాహకోదయముఁ • గోరుమయూరము భాతి నేసుభ
ద్రి నగవు మంజువాగ్రసము • రాజిలు వేణిఁ గనంగఁ గోరెదన్.

శ్రీకృ—అర్జునా! తొందరపడిన లాభములేదు. ఈ ప్రదేశరామణీయకంబును విలో
కింపుము కొంతతడ విచ్చోట విహరింతము రమ్ము. (అని యిరువురుఁ బరిభ్ర
మించుచు) ఈవైపు చూడుము.

చ. పలువిధలీల నిమ్నగలఁ • బాఱెడు నా సెలయేళ్లు ఱాళ్లపై
గళగళమంచు చప్పుడలి • కౌతుక మొప్పఁగఁ జేయుచున్నహో
జ్వలముగ పల్వలంబులను • సస్యసమృద్ధములౌచు నల్ల భూ
ములు విలసిల్లు గోగణము • మూతుల నెత్తక మేయఁ బచ్చికన్.

అర్జు—అహా! బావా! ఎంత మనోహరంబుగా నున్నది! ఆ తట్టునఁ జూడుము.

చ. అనుపమ లీలలన్ గిసల • యంబులు ముక్కునఁ దెచ్చియా పికాం
గన చెలికాని నోట నిడఁ • గైకొని ముద్దిడుచుండె పోత మిం
పున శుకశారికామణులు • ముచ్చటలం బ్రియులం గరంతుర్ మ
న్ననలు సతంబు నాయికలు • నాయకులన్ ముదమందఁ జేయరే?

శ్రీకృ—(తనలో) ఈతం డింకను రాగలోలుండయే యున్నవాఁడు. వీని మనంబెట్లు
మరలింప నగునో కదా! (ప్రకాశముగా) అర్జునా! నీ వేల భ్రాంతి

మునింగెదవు ?

అర్జు—బావా ! ఇచ్చోట నెంత హాయిగా నున్నదో చూడుము.

చ. కొలకుల తావమాడి మల • యుం జను దెంచి ప్రసూనభూరుహం
బులపయి జేరియాడలనుఁ • బూనుచునుయ్యెల లూఁగియూఁగియా
కులవిహరించియుంతట ని • కుంజములందు న నాడిదోఁబుచుల్
వలపుల దొంగిలించి మన • పై మెలమెల్లఁగ వీచుఁ దెమ్మెరల్.

ముకుందా ! ఈ చెంత కమలాకరం బెంత మనోహరంబుగా నున్నదో చూడుము. ఆహా !

చ. మల లలరంగ నద్దెసల • మధ్యను దర్పణ మట్ల వృక్షప
ఙ్క్తులు పయిఁ గొమ్మలన్ లతల • తో రమణీయములైన పుష్పము
ల్వేలయు రవిప్రభన్ బ్రతిఫ • లింపుచు రాజిలు ;
(అని విషాదముతో) అఁ! ఏమిది! బావా! చూడుము—గానరా వహా!
కలగుట నీటిపుల్గు మును • గన్ గ్రసియింపఁగఁ జేపనిప్పుడున్

శ్రీకృ—(తనలో) వీనిమనంబు మిక్కిలి గలఁత వారి యున్నది. (ప్రకాశముగా) అర్జునా ! ప్రకృతిబద్ధులైన మనుజుల మోహభ్రాంతు లిట్టివియే సుమా! ప్రాజ్ఞుండవైన నీకుఁ దోఁచకుండెనే ? చూడుము.

చ. జలముల బింబితంబులగు • సానువులు వృక్షములుం లతాంతముల్
జలదము లాకసంబు రవి • సర్వ చరాచరవస్తుజాలముల్
నిలిచెన సుస్థిరంబులయి • నీటను భ్రాంతి మునుంగఁ బోకుమీ
తలఁప నసత్యముల్ ప్రకృతి • దర్పణ దృశ్యములై హికార్థముల్.

అర్జు—బావా! నీవు చెప్పునది యథార్థమే. అయినను మదవాయత్తచిత్తుండనగు నేనే మిచేయగలను ? ఈ వంక జూడుము. ఆహా ! ఏమి చిత్రము !

చ. అనువుగమల్లె మొగ్గఁ బ్రసు • దాళి తమింరొవసేయు నంచునన్
వనజశరోత్తముండు పొరఁ • బాటున దాడి నెసంగి శంఖమున్

గోని తలక్రిందుగా నిడి యు ♦ కుంఠితుఁడై ధ్వనిఁ జేయు భీతినో
యనఁ దరులన్ని కుంజములఁ ♦ వ్రాలెను మంజులతావితానముల్.

శ్రీకృ—(తనలో) ఈతండు చిత్తచాంచల్యంబుచేఁ బరిభ్రమించుచున్నాఁడు. వీని యలజడి మాన్పకున్నఁ గార్యభంగము గాఁగలదు. (ప్రకాశముగా) అర్జునా! ఇంతలోనే నామాట నుల్లంఘించి మనోవికారంబులకు లోనగుచుంటివి. ఇట్లుంటివేని నీ యభీష్ట మెట్లు నెరవేరు? (అని చిరునగవుతో) ధ్యానపరాయణులైన యతివర్యుల కిట్టి భ్రాంతులు తగునా?

అర్జు—బావా! నేనేమి సేయుదును?

చ. ననవిలుకాఁడు మత్సరము ♦ న న్విరితావి యనంగ మత్తమం
దును పయిఁజల్లి షట్పదమ్ము ♦ ద్ధుధ్వని మోహనమంత్రపాత్రమై
తనరఁగ నూఁది తెమ్మెరలఁ ♦ దాలిమి తూలఁగ నేయఁ బుష్పమా
ర్గణముల మానసం బదరఁ ♦ గా వివశత్వముఁ జెందితిన్ జుమీ.

మఱియు,

క వి రా జ వి రా జి త ము.

కరముల నిక్షుశరాసనముం గొని ♦ కంతుఁడు పాంథజనాంతకుఁడై
వరసుమశాతశరంబులఁ జేకొని ♦ బంభరకాహళనాదముల
త్వరపడిఁ బర్వఁ బికంబుల మత్తమ ♦ యూరరుతంబుల నొప్పిచమూ
త్కరయుతుఁడై శుకవాహనుఁడై శశి ♦ గంధవహాంచితుఁడై యొసఁగెన్

బావా! నే నాయోధపరునితో నీ చెల్లెలప్రాపు లేకుండఁ బ్రతిఘటింప జాలను. నన్నెట్లు కృతార్థునిఁ జేసెదవో నీదే భారము.

శ్రీకృ—అర్జునా! నీవిట్లు మోహమగ్నుండవై విరాళిఁ జెందుచుంటివేని యెవ్వరైనఁ జూడకుందురా? వారిచే నీ కపటోపాయమును మాయన్నగా రెఱింగిరేని నీ యభీష్టంబు నిష్ఫలంబుఁ గాకుండునే? పిమ్మట విచారించిన నేమిలాభము?

అర్జు—బావా! నా యపరాధంబులను క్షమింపుము. అంతకును నాకు నీవే శరణ్యంబని నమ్మియుంటిని.

మ. సదయా! మున్ను సుభద్రఁ గైకొనెదు నాశాబీజమున్నాఁటి నా
వది మొల్చెన్ హృదయాలవాలమునఁ దీవై వర్ధిలెన్ దాని స
మ్మద మేపారఁగ నీదు చెల్లెలను బింబోష్ఠిం గొనం జేసి ప్రో
చెదవో త్రుంచెదొ వేఱుగాఁ దలచి నీచిత్తం బదెట్లున్నదో.

శ్రీకృ—అర్జునా! నేను నీ యభీష్టమును నెఱవేర్పుటకే తగుప్రయత్నములు చేయుచుంటిని- మతిలేనివానివలె నీవిట్లు పలవించుచుంటివేని నా ప్రయత్నం బెట్లుఁ గొనసాగు? అవివేకివై సంభ్రమింపక యతివేషమునఁ బ్రవర్తింపుము.

అర్జు—బావా! నామనంబున నిపుడొక శంక వొడమి వేధించుచున్నయది. ఏమన,

మ. అనురాగంబను దారపుం గొనయు నాయబ్జాక్షి చేనుండ నా
తనువన్నాలిపటంబు చిక్కువడె నీధాత్రీధరంబందు నే
ర్పున నా చిక్కు విడంగఁ జేసి మదికింపుం బెంపఁ బ్రేమ న్సుభ
ద్రి నను౦ దగ్గరఁ దీయఁ దారమును జేకొందీయునో త్రెంచునో.

శ్రీకృ—అర్జునా! భయపడకుము- (అని యిటునటుఁ జూచి) అదిగో! పూజ్యులైన మాయన్నగారిటులనే వచ్చుచున్నారు- ఆయన మిగుల కోపధారి- వానియెదుట నీ వెట్లు నటించెదవో సుమా.

అర్జు—బావా! నే ధ్యానపరాయణుండనై యీశిలావేదికపై కూర్చుండెదను- (అని కొంచెము ముందరకు నడిచి యట్లు చేయుచున్నాఁడు)

[అంత బలరాముఁడు ప్రవేశించి]

బల—(కృష్ణునిఁ జూచి) తమ్ముఁడా! నీ విచ్చోట నేమి చేయుచుంటివి?

శ్రీకృ—అన్నయ్యా! నమస్కారము- (అని పాదాభివందన మాచరించి లేచి) ఇచ్చోట మహానుభావులైన యతివర్యులు వచ్చియున్న సంగతి మీ రెఱుంగరా యేమి? వారినిఁ జూచువేడుక నే నిచ్చోటకు వచ్చితిని.

బల—యతివర్యు లెప్పుడును సర్వలోకపూజ్యులు- అట్టి మహనీయుల సందర్శనంబు గనువారి భాగ్యమే భాగ్యము- తమ్ముఁడా! వారిపు డెచ్చోటనున్నవారు?

శ్రీకృ—అన్నయ్యా! అదిగో దవ్వుల వలయంబగు శిలావేదికపై వారు సమాధినిష్ఠఁ గూర్చుండియున్నారు- చూడుఁడు.

బల—(చూచి ప్రహృష్టమానసుండై) ఓహో ! ఏమి యీ మహనీయుని సుస్వరూపము ! వీరి మహిమ యెంతయై యుండునో !

చ. అనుపమ రూపదివ్యమహి • మాన్వితులై నిజభక్తకోటిఁ బా
వనులుఁగఁ జేయఁగోరి యిట • వచ్చిరి యీయతివర్యు లామహే
శుని యపరావతారమొ వ • సుంధరమూర్తి ధరించినట్టి భూ
జనుల పురాకృతంబయిన • సంచితపుణ్య ఫలంబొకో యనన్.

నేను వారి సన్నిధానమునకేగి వారు సమాధిఁ జాలించువరకు నచ్చో వేచి యుండెదను. (అని యర్జునుని చెంతకేగుచున్నాఁడు)

శ్రీకృ—(తనలో) నా పన్నాగ మెంతవరకు పనిచేయునో యిప్పుడే తెలియఁగలదు. కోపధారియైన యీ మాయన్నగారియెదుట పార్థుండెట్లు ప్రవర్తించునో కదా! అయినను మనుజులకుఁ గోపమెంత యధికముగానుండునో భక్తియు నంత యధికముగానే యుండును. ఎట్లన,

చ. కళపెళఁగ్రాగుచుండు నుద • కంబునుఁ జల్లఁగసోను చల్లనౌ
జలకముఁ గూడి యట్ల సహ • జంబగు క్రోధదవానలంబుచే
సలసలఁగ్రాగు మానసము • శాంతరసంబును గూడి శాంతమై
యలరుచునుండు భక్తి విష • యంబున నెంతటి క్రోధమూర్తికిన్.

అదిగో యతీశ్వరుండు సమాధి జాలించినట్లున్నది. మా యన్నగారు దేమిరో పలుకుచున్నారు. విన వలయును.

బల—స్వామీ ! యతివర్యా ! హాలధరుండిదె నమస్కరించుచున్నాఁడు.
(అని సాష్టాంగనమస్కారము చేయుచున్నాఁడు)

యతి—(కన్నులు తెరచి) నారాయణ- నారాయణ.

బల—పుణ్యాత్మా ! మహానుభావులైన మీవంటి యతీశ్వరుల దివ్యపాదారవిందంబుల సందర్శించు భాగ్యంబు లభించె. నేఁ డెట్టి సుదినమో కదా ! స్వామీ ! (అని యంజలి ఘటియించి)

క. మా పూర్వపుణ్యవశమున
మీ పాదార్చన లభించె • మేదినిపై మా

పాపంబు లెల్లఁ బాసెను
దీపంబున వడఁగునట్టి • తిమిరము భంగిన్.

(అని మరల నమస్కరించుచున్నాఁడు)

యతి—నారాయణ- నారాయణ.

బల—మహాత్మా!

ఉ. పావనులైన మీ విమల • పాదరజంబు శిరంబు సోకినన్
బోవె సమస్త పాపములు • పూర్వభవంబునఁ జేసినట్టి పు
ణ్యావళి రూపమొందెనొ య • నంగఁ గృపం దయచేసినార లీ
రైవతకాద్రికిం మముఁ గ • రమ్ముఁ బవిత్రులఁ జేయువేడుకన్.

యతి—నారాయణ- నారాయణ- హలధరా! మా ధ్యానమునకు భంగము కలుగుచున్నది- (అని యాలకించి) ఏమిది! దవ్వుల జనసంకులంబు వినవచ్చుచున్నయది! ఇంక మే మిచ్చోటనుండము- (అని లేవఁ బోవుచున్నాఁడు)

బల—స్వామీ! తేవరవారి సందర్శనార్థమై ద్వారకలోని వారందఱు వచ్చుచుండిరి కాఁబోలు.

శ్రీకృ—(బలరాముని సమీపించి అన్నయ్యా! చూచితిరే!

మ. లలితస్ఫారమృదంగకాహళమహో • ల్లాసధ్వను ల్వేద్యముల్
గోచరంజేయఁగ వచ్చుచుండిరిటకుం • గోడండ్రతో దేవకీ
వసుదేవుల్పురిలోని యాదవులు సం • భల్లీల విందోత్సవం
బనమానంబుగఁ జేయ రైవతకమం • దా బాల గోపాలమున్.

యతి—(తనలో) సుభద్ర వచ్చుచుండెనో లేదో.

బల—(తేఱిపాఱఁజూచి) తమ్ముఁడా! అవచ్చెడు యాదవానీకంబున సుభద్ర కానరాకున్నయది- ఆ కన్నియ వచ్చుచుండెనా?

శ్రీకృ—అన్నయ్యా? ఆదిక్కునఁ బరికించు చూడుఁడు.

చ. తనసరి యీడువచ్చిన ల • తాంగులు భర్తలఁ గూడిరాఁగఁ బ్రే
మను చెయిఁ జేయిబట్టుకొని • మన్ననఁ దోడ్కొని రాఁ బ్రియోత్తమున్

గనుఁగొనలేమియీనరికిఁ గన్యసుభద్రియు వర్షమగ్నమా
వనజముభాతి నెమ్మొగము వాల్చి యదే యిటువచ్చెదీనయై.

[అంత దేవకీవసుదేవులును రుక్మిణీసుభద్రలును కొందఱు యాదవులును ప్రవేశించుచున్నారు]

జంఝూటిరాగము—ఆదితాళము.

శ్రీ-యతీ-శ్వరా-నమో నమో. (పల్లవి)

కరుణా-భరణా-శరణంబవగుచు- చేకొని-దయఁజూచి బ్రోవుమా॥శ్రీయ॥

కోరితి మే తిరునమ-స్మాదరించెకో

పరమో-గరమా-కరవారణ భవ-తారణమనుచు- జేరదీయుమా॥శ్రీయ॥

పాపహరా-దీపితసం-చారధీవరా

నెపమా-కృప చే-భవతాపనులను బాపుగురుకృ-పాపరాత్పరా॥శ్రీయ॥

పావనదీ-నావనరో-దేవకావుమా

వరపూ-జితమీ-చరణంబులఁబడు-దీనులమను-సాకు వేగ మే॥శ్రీయ॥

(అని యాదవులందఱుఁ బాడుచు ప్రవేశింతురు)

యాద—యతివర్యా నమస్కారము- (అని సాష్టాంగదండప్రణామం బాచరించుచున్నారు)

యతి—నారాయణ- నారాయణ.

బల—యాదవానీకంబులారా? మీరందఱు యతివర్యులసందర్శించితిరి- కావున మీరిక కొండచుట్టుఁ దిరిగి కరతాళములచేతను కోలాటములచేతను జొమ్ము తప్పెటలచేతను నింద్రోత్సవము సాగింపుఁడు.

యాద—చిత్తము- చిత్తము- (అని యాడుచుఁ బాడుచు నిష్క్రమించుచున్నారు.)

శ్రీకృ—(బలరామునితో) అన్నయ్యా! ఇదంతయు నింద్రోత్సవము కాదా?

బల—అవును- అయిన మన పూర్వాచారము వ్యతిరేకింపనగునా? (అని జనాంతికముగా) తమ్ముఁడా! ఈయతివర్యుని మహిమ నీ వేమైనఁ గనిపెట్టఁ గలిగితివా?

శ్రీకృ—(రహస్యముగా) అన్నయ్యా! ఈమహానీయుని ప్రభావ మనన్య సామాన్యం బనియే తలంచెద- నిరుపమాన తేజశ్శాలురగు నీ మహాత్ముని జూచినంతనే యెట్టివారలును భక్తి పరవశు లగుచుండరే?

బల—(జనాంతికముగా) నిశ్చయమే. తమ్ముఁడా! నీవు చక్కఁగా కనిపెట్టితివి. ఈ యతిప్రవరుఁడు కారణస్వరూపుఁడైన పరమేశ్వరుఁడే యని తలంచెద. (అని దేవకీ వసుదేవులతో) జననీ జనకులారా! యతివర్యునకు వందనము లర్పింపుఁడు.

వసు—మంచిది. యతివర్యా! నమస్కారము. (అని సాష్టాంగనమస్కారము చేయుచున్నాఁడు)

యతి—నారాయణ. నారాయణ.

దేవకి—స్వామీ! వందనము.

యతి—నారాయణ. నారాయణ.

వసు—స్వామీ!

ఆ. వె. తలఁప పాపపంక ♦ కలితమై విషయేచ్ఛ
లను తరంగములను ♦ నతిశయిల్లు
పారహీనమైన ♦ సంసారవారాశిఁ
దరలి గట్టుఁ జేరి ♦ తిరిమహాత్మ.

యతి—నారాయణ. నారాయణ.

శ్రీకృ—(రుక్మిణిచెంతకరిగి) ప్రియురాలా! నీ వీ యతీశ్వరుని సందర్శించితివా?

రుక్మి—ప్రాణేశ్వరా! చూచితిని (అనిరహస్యముగా) నాథా! నా కొక యనుమానము కలదు.

శ్రీకృ—(జనాంతికముగా) హృదయేశ్వరీ! ఈ పురుషునివృత్తాంతముఁ బదంపడి నీకు తెలిపెదను. వివేకవంతురాలవగు నీతో నే నతివిస్తరము చెప్ప నవసరము లేదు. నీవు సుభద్రను వెంటఁ గొనిపోయి యా యతీంద్రు నర్చింపుము.

రుక్మి—మీ యాజ్ఞాప్రకారమే చేసెదను. (అని యట్లు యతిచెంత కరిగి) యతివర్యా! నమస్కారము.

యతి—(సహర్షముగ) నారాయణ. నారాయణ.

సుభ—స్వామీ! మహానుభావులైన యతిచంద్రులకిదే నమస్కరించుచున్నదాన.

యతి—నారాయణ-నారాయణ-నారాయణ. (అనిసహర్షముగఁ జూచుచున్నాఁడు)

శ్రీకృ—(కనుసైగచే యతిని వారించుచున్నాఁడు)

(అంత దేవకీవసుదేవులు రుక్మిణీసుభద్రలతో నిష్క్రమించుచున్నారు)

బల—(యతి చెంతకు వచ్చి నమస్కరించి) స్వామీ ! దేవర పాదరజస్సుచే మాగృహ
ము పరమపావనంబుగ నొనర్చి చరితార్థులఁ జేయ దాసుండగు నీ హలధరుం
డిదే ప్రార్థించుచున్నాఁడు (అని ప్రణమిల్లుచున్నాఁడు)

యతి—(సోత్కంఠముగా) నారాయణ-నారాయణ- హలధరా! మేము నాగరికులం
డు పట్టణంబులలోనికి రాము- రేపటినుండి చాతుర్మాస్యదీక్ష నవలంబింపవలయు
ను- కావున మే మీ రోజుననే మరియొకచోటి కేగెదము.

బల—స్వామీ ! అపరాధంబుల క్షమించి నావిన్నపం బాలింపుఁడు.

మ. కరుణాత్మా! యతివర్య! మావిపుల యజ్ఞానాంధకారంబుఁబో
విరియం జేయఁగఁ గోటిసూర్యులగతిం బిచ్చేసి మా పట్టణాం
తరమందున్నలువంగ వేఁడెదఁ గురాత్త్వంసా కటాక్షించి బం
ధుర దీక్షారతి మా గృహంబునను జాతుర్మాస్యలం సల్పుఁడీ.
(అని నమస్కరించుచున్నాఁడు)

శ్రీకృ—(యతీశ్వరునితో) స్వామీ ! దేవరవారు ద్వారకాపట్టణంబులోనికి విచ్చేసి
మా గృహంబునఁ జాతుర్మాస్యలు జరుప ననుగ్రహించుటకై పూజ్యులైన మా
తల్లిదండ్రులుఁ దక్కుంగల యాదవులు నేకముఖంబుగ మిమ్ము బ్రార్థించుచున్నా
రు- పిమ్మట మీచిత్తము.

యతి—(తనలో) ఇంక వెట్టుసరి జేసితి నేని కార్యము చెడునేమో- (ప్రకాశముగా)
కృష్ణా ! మీయందఱకు నట్టి కోరిక కలదేని యటులనే చేసెదము-

బల—స్వామీ ! మే మింక ధన్యులమయ్యెదము- (అని కృష్ణునితో) తమ్ముఁడా ! ఈ
మహనీయుని కుపచార మొనరింప మన సుభద్రను నియోగించెదను.

యతి—నారాయణ- నారాయణ- (అని యనన్యవేద్యంబుగఁ గుతూహల మభినయిం
చు చున్నాఁడు)

శ్రీకృ—(జనాంతికముగా) అన్నయ్యా ! నే మీ యభిప్రాయంబునకుఁ బ్రతికూలుని
గావలసివచ్చినందుకు క్షమింపవలయును- మీయేర్పాటునకు నామనం బియ్యకొన
కున్నది- మీరు భక్తిపరవశులై యట్లనుచుంటిరి- కాని,

మ. కమనీయాకృతినున్నవాఁడు యతి చోత్కంఠైన ప్రాయుండు నీ
మమునం దుంచుట నీతిభావము దలంపం లేము గాకెప్పుడుం

గొమరుం బ్రియపు కన్య నూడిగము చేఁకూరన్నమర్పింప నే
క్రమమౌనో చెయిదాటిపోఁ బిదప భంగంబౌ సమీపోదరా.

బల—(జనాంతికముగా) కృష్ణా! మహానుభావులైన యతీశ్వరు లింద్రియ నిగ్రహుల
ని యెఱుంగవే? వారియెడ నీ వేల యపచారవాక్యంబులను బల్కెదవు? ఇట్టి
పాపపుమాటలు నా చెవినిఁ బడనివ్వక మిన్నకుండుము.

ఉ. సత్తుఁ దలంపవైతి విఁక చాలు యతీశ్వరు లెందు నింద్రియా
యత్తమనస్కులౌచు జవరాండ్రఁ దమింగను లెత్తి చూతురే?
క్రొత్తలు పుట్టునే పలుకఁ గూడునె భాగవతాపచారముల్
మొత్తన నెత్తి, యీ మునులముంగొని వేలొకొ సెల్లపల్కెదర్

శ్రీకృ—అన్నయ్యా! కినియకుఁడు. నాకుం దోచిన సందియంబును విన్నవించితిని. కానున్నది కాకమానదు. మీచిత్తమువచ్చినట్లు చేయుఁడు.

బల—(యతీశ్వరునితో) యతిసార్వభౌమా! పట్టణంబులోనికి దయచేయ ననుగ్రహించెదరా?

యతి—నారాయణ, నారాయణ.

(అని ముందునడువ నందఱు నిష్క్రమించుచున్నారు.)

గద్య.

ఇది శ్రీమద్వేంకటరమణ కరుణాకటాక్ష వీక్షణాపార సమాపాదిత రస
బంధుర కవిత్వవైఖరీ ప్రవీణాపస్తంబసూత్ర శాండిల్యసగోత్ర పవి
త్ర వాల్తృకుల కలశార్ణవ రాకా కైరవమిత్ర వేంకటరత్న
సుపుత్ర వేంకమాంబా గర్భశుక్తి ముక్తాఫల వివిధ
విద్వజ్జన విధేయ వేంకటకృష్ణనామధేయ ప్ర
ణీతంబయిన సుభద్రార్జునీయంబను
నాటకరాజంబున
పంచమాంకము.

శ్రీ ర స్తు.

సుభద్రార్జునీయము.

షష్ఠాంకము.

ప్రథమరంగము : యదుదేవునిమందిరము.

[సుభద్ర యేకతంబ ప్రవేశించుచున్నది]

సుభ—(స్వగతము) మహానుభావులైన యతీశ్వరుల కుపచారముఁ జేయు భాగ్యంబు నాకు లభించినది కదా- వారి యనుగ్రహముసుగూడ సంపాదింపఁ గలిగితి నేని నా మనోభీష్టంబు సిద్ధించు- (అని సాశంకముగా) కాని నేఁ నా యతివర్యుని జూచినప్పటినుండియు నా మనంబున నొక విధమైన యలజడి పొడముచున్నది కారణ మేమైయుండునో తెలియరాదు- మరియు వారిచర్యలుఁ జూడ నొక విధమైన యనుమానముఁ గలిగించుచున్నవి- ఏమన,

చ. ఎలమిని నాదు సోయగము ◆ నెంచుఁ బదేపదే పల్కరింపఁగాఁ
దలఁచుచు పువ్వులందివఁగ ◆ దగ్గరరమ్మను "మీకు నేమి కా
వలయు?" నటన్న "నీకుఁ శ్రమ ◆ వద్దుకొ యంతయు నీవుచెంగటన్
గల వది చాలదే" యని ప ◆ కాలున నవ్వున దేమిచిత్రమో.

యతీశ్వరులు స్త్రీల సోయగ మెంతురా! పువ్వు లందివ్వఁ దనమధ్యలదగ్గఱ రమ్మందురా? నేను తమ చెంగటన్ గలుగుటయే చాలుననుటకు హేతువేమై యుండునో! ఒకవేళ నాయందు తమకుంగల కరుణాతిరేకంబునఁగాఁబోలు అట్లనుచుండ మన్న నాపూజ్యులు తమలోతాము పనిలేకయే నా పేరు పలుమా రుచ్చరింప నేల? మరియు వాని శరీరలక్షణంబుగూడ నా కనుమానముఁ గలిగించుచున్నది- ఏమన,

ఉ. రాగిలు నెమ్మొగంబు రుచి ◆ రంబగు చామనచాయ మేను నా
హా! గరువంపు లేనగవు ◆ నాయతవక్షము తేనెపల్కు లా

భోగ సరోజనేత్రియుగ • మ్ముల్ భుజపై ఘటఁ జూవహాళంబు నా
పోఁగఁ గనుండు నాసికయుఁ • జూడఁగ నర్జునునే స్మరించెడున్.

మనుజునిఁ బోలిన మనుజుఁ డుండఁగలఁడు నా? (అని విచారముతో) అయ్యో!
ఇంకను నాకట్టి కాంక్షయా? నిర్భాగ్యురాలనగు నాకట్టి యదృష్టమబ్బునా?
(అని నిట్టూర్పు విడుచుచు)

శా. అపర్వీడుఁడు! విజ్ఞానీగకుము భా • గ్యం బా! "యర్జునుం గొందునా
లో సాటి జగమందు లేర"ని మదిన్ • దుర్వ్యథనుం గైకొనన్
గాసింజెందెదు పొమ్ము దూరముగ • ద్రుక్కుల్ జేయకే హా హహా!
ఔరా సంకల్పము! వ్యర్థమేమొ విడు నీ • యుత్సాహమిప్పట్టునన్

ఓ యర్జునా! నిన్నుఁ జేపట్టు భాగ్యము నాకీజన్మమున లభించునా? అయ్యో! నేనీ మదనానలం బెట్లు సహింతును! విషమాస్త్రా! నీ వేడుక వేఁటకై నన్నొక మృగంబుఁగ గుఱిఁ జేసితివా? ఓ మదనపరివారములారా! ఏల మీరు నన్నిట్లు వేధించెదరు? భాగ్యహీనురాలనగు నాపైనా మీ యాటోపము? మీమనంబున నబలనగు నాపై రవంతయైనఁ జాలి గలుగదే?

చ. పరభృత చంచరీకగణములు • వాయువు ఋత్విజులై చెలంగ భా
స్వరకుసుమంబుల న్సమిధ • సంతతిఁ జేర్చి స్మరుండె యాజియై
యురువిరహాగ్ని కుండమున • హోమము సేయఁగఁ బాంథమేధమం
దరసి రెహోమపుం బశువ • నంగ ననుం దయమాలి యక్కటా

(అని కొంతతడవు నిట్టూర్పు విడిచి) అర్జునా! అర్జునా!

సీ॥ మఱచితే నీ మేన • మామకూఁతు సుభద్రఁ జనువున వచ్చి • గైకొనవదేమి?
చిన్నటనుండి నీ • చెల్మిఁ గోరిన నన్ను మాయన్న కురుపతి • కీయఁదలఁచె
కోరిక లూరని • న్గోరి పరించితిఁ గలనైన నీ గతిఁ • దలఁచనైతి
నలసడ దేమొ కే • నత్త కుంతీదేవి పదములొత్తెడు భాగ్య • పదవి నాకు
గీ॥ అక్కటా! నిన్ను రానివ్వ • ననుచు నిటకుఁ
దీవ్రముగఁ బట్టె ఘోరవ్ర • తిజ్ఞ నాలియు

నీవు రాకున్న ప్రాణము ♦ ల్నిలువఁజాలఁ
గేలుమోడ్చెద నన్ను ర ♦ క్షింపరావె.

[అంత రుక్మిణిప్రవేశించి]

రుక్మి—(స్వగతము) యతిరూపంబున వచ్చియున్న పురుషుం డర్జునుండే యని నా ప్రాణవల్లభునిచే నెఱింగితిని. నా మనోహరుని ప్రయత్న మిం కేవిధంబుగఁ గొనసాగునో తెలియరాకున్నది. (అని యిటు నటు చూచి సుభద్రను వీక్షించి) ఏమిచెప్పుదు ! నేఁడు సుభద్ర యతిసపర్యలు మాని యేకతంబ యుద్యానవనంబున విహరింపుచున్నది ! ఏకాంతంబుగఁ దన మేనత్తకొమరునిపైఁ గల మోహంబున విరాళిఁ జెందుచుండెను కాఁబోలు.

సుభ—హా ! అర్జునా ! నీవింక నా కంటఁ బడవా ?

రుక్మి—(తనలో) ఇంక సందేహింపనేల ? సుభద్ర కాయర్జునునిపై మోహము మిక్కుటంబుగ నున్నయది. అన్నా ! పాపపువిధి నిర్మలమైన యనురాగవాహిని నిరర్థకముగఁ బ్రవహింపనివ్వదు కదా !

చ. అకుటిలవృత్తిఁ గోర వ్యాద♦యంబున బాల్యమునందె లేమయు
త్సుకతఁ గిరీటి భర్త♦యనుచుం గురునాథున కీఁదలంచె నే
రక్తో మరి నేర్చియో క్రొ బల♦రాముఁడు కన్యక నింతిమానసం
బొకయెడనుండ దేహము మ♦రొక్కయెడన్ ఘటియింపఁ జెల్లునే?

నా ప్రాణేశ్వరుం డీ యెలనాగ పట్టయి యీమె యభీష్టమును నెరవేర్చుటకై సర్వవిధముల చేతనుఁ బ్రయత్నించుచుండె. అకృషి వ్యర్థమైనంగదా సందేహింపవలసినది. నే నిప్పట్టున నీ కోమలాంగి మనంబును రంజింపఁ బ్రయత్నించెదను (అని సుభద్ర చెంతకరిగి ప్రకాశముగా) వదినా ! నీ విపు డేల యతీశ్వరుని సపర్యలు మాని యేకతంబ యీ యుద్యానవనంబున విహరింపుచుంటివి ? నీ మనోహరుండగు నర్జునుండు వచ్చియుండె నేమోయని భ్రాంతిఁ జెందితివా యేమి ?

సుభ—(సంతోషముతో) ఏమేమీ ! వదినా ! నిశ్చయముగ నా ప్రాణనాథుండగు నర్జునుండు వచ్చియుండెనా ? ఎచ్చోట నుండెనో చెప్పుము.

రుక్మి—వదినా సంభ్రమింపకుము. వాని జాడ నిరంతర మారాధించు నీకన్న నాకెక్కువ తెలియునా ?

చ. కమలదళాయతాక్షులగు • కన్యలకుం బ్రియురాక చక్రవా
కములకు భాస్కరోదయము • కాలము కుక్కుటరాజికిన్ లతాం
తములకు నావసంతునిఁ గ•నం దగు నంతియ కాని నాకు నీ
రమణుని జాడఁ దెల్ప సుక•రంబగు టెట్టు లతాంగి! చెప్పుమా.

సుభ—(తనలో) ఈ నా వదిన యభిప్రాయ మేమో తెలియకున్నది. నిరంతర మారాధించుచుండుటచే నా ప్రియునిజాడ నే నెఱుంగఁ గలుగుదు ననుటకు హేతు వేమి ? నా ప్రాణేశ్వరుఁడైన యర్జును నెల్లపుడు నా స్వాంతపద్మంబున నెలకొల్పి పూజించుచున్న దాన నగుటచే నట్టనియెఁ గాఁబోలు (ప్రకాశముగా) వదినా !

మ. యతికిం బూజయొనర్ప బుష్పములఁ గో•యన్నే నిటన్వచ్చినా
పతి మేనత్తకుమారు నర్జునుని సం•భావింపుచుంటిన్మది౯
గుతుకం బార యతండు నన్గొనినచోఁ•గోర్కుల్ఫలింపంగ నం
తత సౌఖ్యాంబుధి నోలలాడనొకొ చిం•తిల్తున్ సముత్కంఠనై.

రుక్మి—వదినా ! యతిసపర్యలుఁ గూడ పతిభావనతోనే చేయుచుంటివి కాఁబోలు! (అని చిఱునగవుతో) అవును. నా కట్టిసందియ మేల కలుగవలయును ? అమ్మాయీ ! మనోగతవిరాళిచే నలమటఁ జెందు నీవా యతిసపర్య లెట్లు నెరవేర్పుచుంటివో తెలియరాకున్నది

సుభ—వదినా ! ఆ మహాత్మునిచెంత కేగి యూడిగంబు సలుప నాకేమో భయము కలుగుచున్నది. నీవైన యనుగ్రహించి నేఁడా యతివర్యున కీపువ్వులనొసంగదవా!

రుక్మి—ఏమి ! పూజ్యులైన యతీశ్వరుల కుపచారము చేయుటకే భయము కలుగుచుండెనా ? ఎంతవెఱ్ఱిదానవు ! ఆ మహానీయులు—

మ. కనఁ జెప్పల్పయి కెత్తి చూడరు కదా • కన్యా వినుమ్నీవు ప
ల్కిన మాటాఁడ రకారణంబుగను చె • క్కిళ్ళం జేర రానివ్వరి

ట్లనుమానించెదవేల? సంతతము బ్ర • హ్మానంద సంధానచిం
తనులై మౌనముఁదాల్చియుండుయతి చెం • తన్నిల్వఁగా భీతియే?

చాలు- చాలు- నీ విట్టి భయం బుడిగి పూజ్యులగు నా యతివర్యుల మనస్సు కకు నటులఁ బ్రవర్తింపుము- నీకు మేలయ్యెడు- (అని చిఱునగవుతో మేలంబుగఁ ద్రోయుచున్నది)

సుభ—(తనలో) ఈమె యీ యతివర్యునిచర్య లేమియు నెఱుంగదు- ఎఱింగియున్నచో నిట్లేలపలుకు ? అయిన నీనిసంగతి యీకించుకఁ దెల్పినచో నే మనునో చూచెద గాక- (ప్రకాశముగా) వదినా ! ఆ మహనీయులు,

సీ॥ ఆహార మిడఁబోవ • నాహారమా యని, మురియుచు నతివేడ్క • శిరమువంచు
కరములా పంకజో • త్కరములా యివి యని, పలుకుచు నా కేలు • పట్టఁజూచు
పదములా పల్లవా • స్పదములా యివి యట్టి, వారెను నడక చే • పాప మింక
యఱసితి నెందుఁ బో • వలదు సర్వమునాకుఁ, గలుగవే నీవు చెం • గటవసింప
గీ॥ ననుచు కుసుమసి నగవుల • మనము దోపఁ
జేరి పువ్వుల నందివ్వఁ • జేయిఁ దాకఁ
గనుబొమల నెగరవైచు బ • ల్కంగదివురు
నట్టి యతిచెంత నిలువ భ • యంబు కాదె.

రుక్మి—(తనలో) ఏమిది ! ధీరుండయ్యు నర్జునుం డిట్ల్యెడ వివేక హీనుండయి తమకంబున సంభ్రమించి నా వల్లభుని ప్రయత్నమును భంగపరచెడుకదా ! అట్లేలప్రవర్తించును ? (ప్రకాశముగా) అమ్మాయీ ! యతీశ్వరులయెడ నీవిట్టి యుపచారవాక్యంబులు పలుకవచ్చునా ? వారు నీయెడలఁ బ్రసన్నులై యుండిరి కాఁబోలు- వారి మహిమ నీవు కనిపెట్టలేకపోతివి- కానీ నీ వింకనైన వారి మనోభావమునుఁ గని పెట్టిప్రవర్తించితివేని తప్పక కృతార్థురాలవయ్యెదవు

ఉ. గాసిల నేల సౌఖ్యమును • గాంచెదు నీ దగు మేనయత్త దు
ర్వాసున కూడిగంబు నలు • పన్ ఋషి సంతస మందియే కదా
యీ సతికి వ్వరంబొసఁగి • యాత్మజులం బడయంగ నత్కృపం
జేసె నితండు నావిధముఁ • జేయఁడె నీకు నభీష్టసిద్ధియున్.

సుభ—(దరహాసితముఖియై) వదినా ! నాకట్టిభాగ్యము లభించునా ?

రుక్మి—లభింపకేమి ? యతీశ్వరునకుఁ బూజవేళయైనది. శీఘ్రముంబుగ నీవీ పుష్పంబులఁ గొని వానిచెంత కరుగుము. ఈసారి పోయితివేని నీ భయంబు తొలంగుటయే కాక మరల నీ వాయతిపర్యాని విడిచిరమ్మన్నను రావు పొమ్ము. నే నంతిపురంబున కేగెదను. (అని నిష్క్రమించుచున్నది)

ద్వితీయ రంగము.

వసుదేవుని మందిరము.

సుభ—(తనలో) రుక్మిణిమాటలు సందిగ్ధములై నా సందేహమును మరింత బలపరుచుచున్నవి. అయిన నే నేమని నిశ్చయింపఁ గలుగుదును ? ఆ పురుషుని చెంత కేగుటకు మనంబు త్వర పెట్టుచున్నను కాలాడకున్నయది. ఏమిచేయుదును ? ఎట్లైనఁ బోరవచేసి యీసారి మరల వానిచెంత కరిగి యీ పుష్పముల నొసంగి వాని నిక్కువం బెఱుంగ ధీరనై యొక్కించుక ప్రసంగించెదను. (అని కొంచెము దూరము నడచి) ఇదిగో వారిని సమీపించితిని. వారింకను ధ్యానమగ్నులయే యున్నవారు. (అని చెంత నిలుచున్నది)

యతి—(కన్నులు తెరిచి చిఱునగవుతో) నారాయణ. నారాయణ. (అని సుభద్రను పార్శ్వముతో తిరేకదృష్టిఁ జూచుచున్నాఁడు)

సుభ—సార్వభౌమా ! పూజాద్రవ్యంబుఁ గైకొనుఁడు. (అని పూలపళ్ళెరంబు చెంత నిడుచున్నది)

యతి—నారాయణ. నారాయణ.(అని చిఱునగవుతో క్రీగంటిచూపులు పారించుచు) కన్యాశిరోమణి ! ఈ పుష్పంబులు నీవు గొనితెచ్చుటచే నెంతయు మనోహరంబులు గానే యున్నయవి. కాని బింబోష్ఠీ! మా మానసికపూజకుం దగు నిధానంబైన ద్రవ్యం బొసంగఁ జాలయు నే కాని యీపుష్పంబులతో నిమిత్త మేమి ?

సుభ—స్వామీ ! ఈ ప్రసూనసంచయము నిర్మాల్యము క్రింద నే భావించితిరా ?

యతి—మోహనాంగీ ! అయ్యవి యిప్పు డవసరము లేదంటిమే గాని వాని గ్రహించితిమా ? చూడుము.

తే. గీ. ముడుగలేదు పుష్ప • ములదళంబులు వాని
తొడిమలందు నుండు • తోయకణము
లారలేదు సురుచి • రామోదకలితప్రసూనచయము జూడఁ • జోద్యమయ్యె

ఇట్టిపుష్పంబులు నిర్మాల్యము లెట్లగును? (అని పుష్పంబులను జూచి) ఆహా!

చ. విమల మనోహరాకృతులఁ • వేడ్కలునింపెడు నీప్రసూనముల్
సుందరి! చూడుము;
కమలముపైకిఁ దుమ్మెదలు • క్రమ్ముచు వచ్చి తొలంగ నేమిచి
త్రమొ యిట చంపకంబుఁ గని • దగ్గఱఁ జేరఁదలంక కాదె యో
కమలముఖీ! మదాళికచ • గంధఫలీసమనాస! కన్యరో.

సుభ—స్వామీ! మీకు పూజార్హ మైన దెద్దియో దాని సెలవింపుఁడు.

యతి—లలనామణీ!

ఉ. పుత్త్రుఁడి బాలమ్మ! మానసిక • పూజయొనర్చుచుఁ గోరుద్రవ్యసం
పత్తు ఘటింపరాదె మధు • వ్రతయోగ్యములయ్యుఁ బాంధును
వ్యక్తమనంబులుం గలఁచు • నవ్యసుమోత్కరమేల? యిమ్ము నీ
చిత్తము దేని నిచ్చిన భ • జించెద నా కది పూజనీయమా.
(అని యిటునటుఁ జూచి) నారాయణ- నారాయణ

సుభ—(తనలో) అన్నా! నే నిపు డేమి చేయుటకును దోచకున్నయది. వీని మాటలు వ్యంగములై నా మనంబును గలతపరుచుచున్నవి. ఈ యతివర్యుండు కపటాకృతియన్న నా మనోహరుండైన యర్జునుండే యైనయెడల వీని మానసికపూజానిధానంబైన ద్రవ్యం బేమైయుండునో. వీని యభిప్రాయము తెల్లడియగుటకై యిట్లనియెదను) (ప్రకాశముగా) స్వామీ! మీరలు కోరు మానసిక పూజాద్రవ్యం బేమో తెలియంగ వేడెదను.

యతి—(సహర్షంబుగ) నారాయణ- నారాయణ- (అని కంఠమునసవరించుచు నవలారత్నమా!

మ. అనయంబున్ స్మరియింపుచుంటిమి సు • భద్రావాప్తికై మేము నె
మ్మనమం దీ వుపచారముల్సలుపుచుం • మా భావముల్ వేడఁగాఁ
జనునే "మీరలు కోరుమాన సికపు • జాద్రివ్యమే" యంచు వేఁ
దనుపంగా రాదటె కాంతి కార్థమిడి క • న్యారత్నమా మమ్మికన్.

(అని యిటునటుఁ జూచి) నారాయణ- నారాయణ.

సుభ—(సగోపముగా తనలో) ఏమి వీని సాహసము! వీని చోరవంతిక ంత కధికమగుచున్నది. వీని ధైర్య మేమో కదా- ఈ పురుషుని నిష్కళంకతలుంగకుండ నాగ్రహించితి నేని యేమి యుపద్రవము ఘటిల్లించునో- కౌంతేయుల సంగతి వీనికెంతవరకు తెలియునో ముందు తెలిసికొనియెదను- (ప్రకాశముగా) స్వామీ! యతివర్యా! భూలోక సంచారులైన మీవంటి మహాత్ముల పదఘట్టనంబుచే నే యే ప్రదేశంబులు పావనంబులయ్యెనో వినవేడెదను.

యతి—మోహినీ!

మత్తకోకిల.

చంచలాక్షిరో! తీర్థసేవలు • సల్పఁగోరి చరించి మే
మిూచుమించుఁగఁ జూచి దేశము • లెల్ల వచ్చితి మిప్పుడిం
గాంచి సంతస మంది రైవత • కంబుపై గడు వేడ్కఁ న
భ్యంచితంబగు దీక్షచే దప • మాచరింప దసింపమే.

(అని చిఱునగవుతోఁగనుబొమ లెగరేయుచు) నారాయణ నారాయణ.

సుభ—(అంజలి ఘటియించి) స్వామీ!

శా. ఇంద్రప్రస్థపురంబుఁ జూచితిరె? మీ • రెందైనఁ గౌంతేయులన్
సాంద్రానంతసుకీర్తులం జితరిపు • క్ష్మాపాలురన్ రాజ్యభో
గీంద్రోత్సాహుల ధర్మమార్గపరుల • న్వీక్షించియున్నారె? యో
గీంద్రా! ధర్మజభీమపార్థముఖు లెం • తే సౌఖ్యమున్ గందురే?

యతి—కోమలాంగీ! మా యాశ్రమ మింద్రప్రస్థపురమే సుమా- కౌంతేయులందఱు సుఖులై యున్నవారు- మేమెప్పుడును వారిని సోదరప్రేమచే జూచుచుందుము- ఆ కౌంతేయులకు నీకు దగ్గర చుట్టరికమే కాఁబోలు?

సుభ—(తనలో) ఏమీ ! ఈ యతిరూపధరుండు నిశ్చయముగ నా కౌంతేయులకు సోదరుండే కాఁడుకదా ? బలరాముని ప్రతిజ్ఞవిని నా మనోహరుండగు నయ్యర్జునుండే యతివేషంబున వచ్చియుండఁడు కదా. ఇంక నేనే నేమియు నిశ్చయింపఁజాలను. (ప్రకాశముగా) స్వామీ ! కౌంతేయులు నా మేనత్త కొమరులే కారా ! అట్లయిన మాత్రిను—

యతి.—ఏమిలాభమనియా ? అట్టి చుట్టరికముపై యాసపొడముట సహజము. ఏల నీ విపుడు నిరుత్సాహురాల వయ్యెదవు ?

చ. ఎఱుఁగవె నీ మనోహరుని • నింద్రతనూజుని నర్జునుం బినుం
దరముగ నంతరంగమున • నిల్పి యహర్నిశముం దలంచుచుం
మఱియుచు వేడ్క నిన్నపుఁడు • పొందుదునో యని పెన్వెరాలినా
పురుషుఁడు తీర్థసేవలను • బూని చరించుచునుండు మావలెన్.

సుభ—(తనలో) ఏమి యీ చిత్రము ! అతి సాహసుండైన యీ యతి కైతవుండెవరై యుండునో కదా ! ఈతం డర్జునుండే యైనచో నాతండు తమవలె జరించు చుండె ననేల ? కౌంతేయుల వృత్తాంతకాంతాజనంబుఁ గూర్చి వీని కేమైనఁ దెలియు నేమో యడిగి చూచెదఁగాక. (ప్రకాశముగా) స్వామీ !

క. మా యత్త కుంతి సుఖయై
పాయక తత్సుతులవైభ • వము జూచుచు ధ
ర్మాయత్తమతినిఁ జెలఁగునె ?
శ్రేయము ద్రౌపదికిఁ బురిస • శేష జనులకున్.

యతి—నారాయణ. నారాయణ. వారందఱును సుఖముగానే వర్ధిల్లుచున్నారు. వారందఱును నే నెఱుంగని వారనుకొంటివా ? వినుము,

చ. జననియనంగఁ గొంతి యని • శంబు దయన్మము నాదరింప మా
సిని యల ద్రౌపదీసతియు • నేర్పున మమ్ముపచార లీలలన్
దనుపఁగఁ బౌరులందఱును • దంబునఁ గొల్చుచునుండఁ బాండునం
దనులును నేమ మభేదగతిఁ • దద్దయు నొప్పను నుందుమప్పురిన్.

కావున నిన్నొకటి నడుగఁ దలంచితిమి. ఏమన,

గీ. నీకుఁ బార్థునిపై ప్రేమ • నిక్కువముగఁ
కలిగి యుండెనె తెలుపుమా • కమలనయన
యట్లుఁ గాదేని నీరూప • మహరహంబుఁ
గొలుచు నాతనికోర్కె ని • ష్ఫలము కాదె.

సుభ—(తనలో) ఈపురుషుండు యతికైతవంబున నున్న నా మనోహరుండే కావలయు. హృదయమా ! సంభ్రమింపకుము. నీ యదృష్ట మెట్లున్నదో యిప్పుడే తెలియఁ గలదు. (ప్రకాశముగా) పుణ్యపురుషా ! మదీయ భాగ్యదేవతా స్వరూపులగు మీవంటి మహాత్ములయెదుట దాఁపనేల ? నా హృదయమునంగల తెఱంగు విన్నవించెద నవధరింపుఁడు. మేనత్త మేనమామబిడ్డల మగుటచే,

ఉ. పాడుచు నాడుచు న్వివిధ • భావములన్వెలసిల్లఁ జైశవ
క్రీడలఁ బళ్యతో హరుని • రీతి హరింప మదీయచిత్త మా
క్రీడి యతండె భర్తయని • కేవలభక్తి వరించియుండఁగా
నేడు హలాయుధుండు కరుణింపఁడు వేఱు దలంచునక్కటా.

యతి—(వెఱగు నభినయించుచు) నీవు నీ యన్నగారి యభిప్రాయంబున కొడంబడితివి కాఁబోలు? అన్నా! పాపమా యర్జునుఁడు నీకై యెంత పరితపించుచుండెనో నీ వెఱుంగవైతివి.

చ. వెలఁతరో జీవచిత్తరువు • నే యెదుటఁ గనఁ జేసి యెల్కన
న్విలుగొనయంబుఁ గూర్చి గొన • బుంబొమవింటను ముష్టి నాసికాం
చలమునఁ బట్టి చూడ్కులను • సాయకముల్పరుపంగ మన్మథుం
డలయుచు నర్జునుండు విర • హార్తిఁ గృశించుచునుండెనక్కటా.

సుభ—(తనలో) ఏమిది ! నాకై పరితపించుచుండు నర్జునుని యెదుటం గలఁజేసి చిత్తరువు నేన గాక మరి యెవ్వరుందురు ? ఓ కాంక్షలారా ! మరల నాపై మూఁగుచుంటిరా ?

యతి—మోహనాంగీ! నిన్నుఁ గూర్చి యాతండు పొందెడు మోహపరితాపమేమని చెప్పనగు!

చ. హరి హరి కృష్ణయంచు మలయానిల తాపము సైపలేనిచోఁ
గరము కలధ్వనుల్ శుకపికంబులు చేయఁగ రామ! రామ! యం
చురుగతి నాట మన్మథ శరోత్కరమున్నిటులాహా! యంచు నీ
వరుసను తీర్థసేవలను బవిత్రులు నర్జునుఁ డేమిచెప్పుదున్.

సుభ—(తనలో) బహువచనప్రయోగమును మానివేయుటచే నీపురుషుండు కపటయతి యని స్పష్టమగుచున్నది. అయిన నీతం డర్జునుం డవునో కాఁడో. (ప్రకాశముగా) మహాత్మా!

చ. త్రికరణశుద్ధి నిశ్చితగతి న్వరియించితిఁ బార్థు నాతఁడే
సకలము నాకు నింక రవిచంద్రులు నీ జగతు ల్గలంగఁ దా
రక లిల ముల్ల సర్వ జలరాసులు నింకఁగఁ జేయఁగాక మా
నక నమకూర్ప లేరు కురునాథుని భార్యఁగ నేరు నన్నిలన్.

ఏజన్మంబునకైనఁ బూజ్యుండగు నర్జునుండే నాకు భర్త గావలయునని నిగూఢంబుగ నమ్మియుంటిని. కావున గ్రుక్కెడు ప్రాణమైన విడిచెదను గాని నే మాయన్నగారి దారుణప్రయత్నంబున కొడంబడుదునా?

యతి—ఏమి! నీవు బాగుగ యోజింపవైతివి. నీపై మరులుగొని విరాళికొందు చుండెను కదా యని వానిపై నీకింత విశేషమైన కరుణ కలిగెగాబోలు. అజ్ఞానురాలా! వానిపై నీకుంగల నెయ్యి యెంతవరకుండునో చూడఁ గోరి యిట్లంటినే గాని నిర్భాగ్యుండగు నర్జునుండు నీ కరంబుఁ బట్టుట కర్హుండు కాఁడు సుమీ.

క. పొట్టకుఁ బట్టెం డన్నముఁ
గట్టుట కొక మూర గుడ్డ గనలే కకటా
నెట్టన విధిఁ దిట్టుచు నెటు
మొట్టిరొ గహనములఁ దలపు మీ కౌంతేయుల్.

ఇంతయేల?

క. కౌరవరాజ్యగమావరుఁ
డై రంజిలు వానిఁ గోరు • మర్జును నేలా ?
శ్రీరా మాకా లొద్దుదు
రే రాజీవాక్షి యింత • యెఱుఁగ వెనీవుర్.

సుభ—హరిహరీ! (అని చెవులు మూసికొని) స్వామీ! సర్వజ్ఞులగు మీవంటి వారట్లు పలుకు టుచితమేనా? యతివర్యా!

పంచచామరము.

గురుస్ఫురాగ్నికీలలందు • గూలుమన్నఁ గూలెదన్
బిరానఁ దీవ్రవిషంబు • మ్రింగుమన్న మ్రింగెదన్
బొరిన్నగంబు నుండి వార్ధి • మున్గుమన్న మున్గెదన్.
వరింపనొల్ల భర్తఁగాఁగఁ • బార్థుఁ దక్క నే నొరున్.

మహాత్మా! ఇట్టిమాటలు నే వినవొల్లను- దాసురాలనగు నాపై మీకనుగ్రహంబు కలదేని నా మనోహరుండగు నర్జునుం డిపు డెచ్చోటనుండెనో తెలిపి నన్నాతండే పరిణయం బగునటుల వరం బొసంగుఁడు.

యతి—(తనలో) ఓహో! సుభద్ర నాపై మిక్కుటమైన యనురాగపూరితురాలై యున్నయది- ఏమి నా యదృష్టము! (ప్రకాశముగా) లలనామణీ! నీమనోహరుం డిపు డెచ్చోట నున్నవాఁడని యడుగుచుంటివా? వినుము.

చ. అనుపమగాత్రి! నిన్ బ్రణ • యం బగుపొందె కురుక్షితీశు ర
మ్యుని శుభ లేఖ వ్రాసిన హలాయుధుఁడయ్యది చూచి నిన్నుఁ గై
కొన మదిఁ గోరి వచ్చె నిట • సుస్థిరయుం డటనున్న వాఁ డటం
చనఁ బనియేమి నీవుఁ గన • వైతివొ చూచియు మెఱుంగ వైతివో.

ఇంతయేల,

చ. కలఁయుగఁ బర్వ వెన్నెలల • కాకల నేఁ దపియించి తీర్థయా
త్రల ననురాగవాహిని ముదంబున దాన ములాఁడియాఁడిపా

టిలు విరహజ్వరంబున వడిన్బరతెంచుచు ద్వారకాపురిన్
నిలిచెను క్రీడి నీ యెదుట • నేర్పునఁ బ్రోవుమి నీచికిత్సలన్.

సుభ—(సహర్షంబుగఁ దనలో) ఏమి ! నా యెదుట యతిరూపంబున విరాజిల్లు నీ మహాపురుషుం డర్జునుండే నా ? ఓహో ! ఏమి నా భాగ్యము ! డెందమా ! త్వరపడకుము- త్వరపడకుము ఆశలారా! తాళుఁడు- అర్జునుం డీతండుఁ గాక యుండెండైన దాగియుండె నేమో.

యతి—కోమలీ ! ఇంకను సందేహింపుచుంటివా ? నీ యెదుటనున్న వానినే గుర్తింపలేకుంటివా ?

చ. సొగసగు నీదు నెమ్మొగముఁ • జూడ సుభద్రా! సుభద్రయంచు నీ
తగు వెలివల్లులం దనియ • నాతిరో దీన చకోరకంబనై
నెగడెద ద్వారకాపురిని • నీకయి చల్లకువచ్చి యుంతుఁ దా
పఁగ నిక నేల నేనసంమి • పార్థుఁడ నో వికచాంబుజాననా.

(అని కౌఁగలింపఁబోవ సుభద్ర నిష్క్రమించుచున్నది)

అయ్యో ! ఏమిది ! హస్తగతంబైన పెన్నిధానం బింతలోనే యదృశ్యమాయెను- ఏమిచేయుదును- ఆ కోమలాంగి కపటాకృతిని దన చెంతకు వచ్చితినని నాపై యలిగి పోయెఁ గాఁబోలు. (అని యాలకించి) ఎవరో వచ్చుచున్నట్లున్నది- నేను ధ్యానపరాయణుండనై యుండెద- నారాయణ- నారాయణ
(అని నిమీలితనేత్రుండై కూర్చుండును)

తృతీయ రంగము.

పురోపకంఠము.

[అంత రుక్మిణి ప్రవేశించి]

రుక్మి—(తనలో) ఆహా ! ఏమి నా ప్రాణేశ్వరుని నైపుణ్యము ! యతివేషంబున నతిథియై వచ్చిన పురుషుం డర్జునుండనియు నాతనికి సుభద్రకుఁ బరస్పరానురాగము బలముగఁ గలిగియున్న దనియుఁ బూజ్యులైన తమ జననీజనకుల కెఱుంగఁ జేసి యావధూవరులకు రహస్యోచితంబుగఁ బరిణయ మొనర్ప వారి యనుమతి

ఏడసి నేఁడుదయమున నే దేవతామహోత్సవవ్యాజంబున బలరామప్రముఖ యాదవానీకంబును రైవతకాద్రికిం బోవునటులఁ జేసె. నేఁడు సుభద్ర యర్జునుం గూడి రథారోహణయై యింద్రప్రస్థపురంబున కేఁగునపుడు నే నున్న నా మనోహరుని చెట్టఁబట్టి రథారూఢనై యీ ద్వారకాపురి వచ్చునపుడు నామనం బెట్లు సంతసించెనో యా తన్వంగిమనంబు నటులనే సంతసించునుగదా! (అని యాలకించి) ఎవరది!

[అంతఁ బటాక్షేపంబుగ సుభద్ర ప్రవేశించుచున్నది]

(సుభద్రను వీక్షించి) ఏమి చెప్పవూ! సుభద్ర, నే గాయత్రియొద్దనుండి యింత సంభ్రమంబుగఁ బరుగువారి వచ్చుచున్నయది! అర్జునుని సిక్కవంశాలింగఁ గాఁబోలు- అటులనే తోచుచున్నయది- (అని సుభద్రను జెంతకరగి) ఏమమ్మా! వదినా!

ఉ. వారిరుహాక్షిరో యుదిత ♦ పర్యలుమాని భయంబుఁ జెంది యీ
తీరున లేడివై చకితదృష్టుల ♦ జూచుచు వెన్కవెన్కకున్
మీరిన సిగ్గుచే నహహా! ♦ మేను గగుర్పొడువంగ స్వేదమున్
వారక జాలువార నిట ♦ వచ్చితి చూచితె నీ మనోహరున్.

సుభ—వదినా! (అని మరల వెనుకఁ దిరిగిచూచి) ఏమోనమ్మా! నా కేమియు తెలియదు- నన్నంతిపురంబున కేగనిమ్ము- (అని పోఁబోవుచున్నది)

రుక్మి—(సుభద్రకరంబుఁ బట్టుకొని) వదినా! నీవు చెప్పకున్న నీ చేష్ట లెఱింగింప వనుకొంటివా?

ఉ. ఇంతిరో! దాచెదేల? మెరు ♦ పెక్కిన నీ లెలినిగ్గు చెక్కుల
త్యంతము నిద్రిమోష్ఠరుచి ♦ హీనముఁబర్వఁగ నా ప్పెచూడ్కి-ది
గ్భ్రాంతినిఁ జెందెగుండె యదరంగఁ దొడంగె నటుంగదక్క దే
వింతలు పుట్టెనో తెలుప ♦ వే భయ మేలనె ముద్దరాలవే.

సుభ—వదినా! ఏమని చెప్పుదును- (అని ముసిముసినగవులతో శిరంబు వంచి సిగ్గు నభినయించుచున్నది)

రుక్మి—(మందస్మితసుందరవదనారవిందయై) వదినా! ఆ యతివర్యుండు తానర్జునుండగు టెఱింగించి మీరిన తమకంబున నిన్ను గాంధర్వవిధిఁ బరిణయంబగుటకై సంభ్రమింప సిగ్గుఁజెంది పరువిడివచ్చితివి కాఁబోలు. ఎంతపనిచేసితివి!

ఉ. తోయజగంధి! కర్షకుఁడు దున్ని పొలంబున నాటి బీజముల్
బాయక చేయు దోహదము వర్షములే కది యెండ నేమియుం
జేయఁగలేదు నా విభుఁడు చేసిన నీకొరకైన యత్నమిం
తాయెనె? వెఱ్ఱిదాన వకటా! చెయిదాటదె నీయుపేక్షతన్.

సుభ—(భయముచే దీనవదనయై) వదినా! నే నిపు డేమిచేయుదును?

రుక్మి—నీవు చేయవలసిన దానినిఁ జేసితివి. ఇంక నేమిచేసెదవు?

క. చెడఁగొట్టుకొంటి వర్జునుఁ
బుడమిన్ రారాజు కురువిభుండు సుమీ నీ
రొడయం డిక సౌఖ్యములను
బడయు మతనిఁ గూడి నీవు పరమప్రీతిన్.

సుభ—దుఃఖములను బడయు మనుము. వదినా! వదినా! ఏల నీ విట్లు కఠినోక్తుల నన్నుఁ జంపెదవు? శరీరపారవశ్యంబున మై మఱచి యజ్ఞానురాలనై నేనొనర్చిన యీ తప్పిదంబును క్షమించి నాకిప్పట్టున దగునుపాయంబుఁ దెల్పి రక్షింపుము. (అని పాదములపై వ్రాలుచున్నది)

రుక్మి—(తనలో) నే నన్నట్టుల నే జరిగినచో నీ మిఱివింపఁగలుగునా? అహా! అనురాగమున నిట్లుండవలదా! (ప్రకాశముగా) వదినా! లెమ్ము. నీ కోర్కె సఫలంబు కానైయున్నది.

సుభ—వదినా! నాయభీష్టము నిశ్చయముగా నెరవేరునా? నీవు పరిహాసించుచుంటివా? నీవు నాజీవితేశ్వరుండగు నర్జునుండు చెయిఁదాటి పోవునని చెప్పిన తోడనే నా ప్రాణంబులు మేనువిడిచి పోయినవి. మరల నీయనుగ్రహంబుచేఁ గూటఁ జేరుచున్నవి. నే నెట్లు కృతార్థురాల నయ్యెదనో తెల్పుము.

రుక్మి—వదినా! నేఁడు నిన్నర్జునునకిచ్చి రహస్యోచితంబుగ వివాహముచేసి మిమ్మిద్దఱ నింద్రప్రస్థపురంబున కనుపుటకు నీ చిన్నన్నగారు తగు ప్రయత్నములు చేయుచున్నారు.

సుభ— (హర్షపరవశయై) ఆహా! ఏమి నా భాగ్యము! వదినా! ఈసంగతి మా పెద్దన్నగారెఱుంగకుందురా?

రుక్మి— వారెట్లెఱుంగఁగలుగుదురు? ఆతుజయాదవులంగూడి దేవతామహోత్సవంబు సలుప రైవతకాద్రి కేగియున్నారు. వారీసాయంకాలమునకుంగాని యింటికి రారు. భయపడకుము. (అని యిటునటు చూచి) అదిగో! దవ్వుల నీ చిన్నన్నగారును బూజ్యులైన నీ జననీ జనకులును బురోహితునితోఁగూడ నిటులనే వచ్చుచున్నారు. నీవంతిపురంబున కేగి పూర్ణాలంకృతురాలవై రమ్ము.

సుభ— మంచిది. (అని నిష్క్రమించుచున్నది)

చతుర్థ రంగము

పురోపకంఠము.

[అంత శ్రీకృష్ణుఁడు దేవకీ వసుదేవులు పురోహితునితోఁ బ్రవేశించుచున్నారు]

శ్రీకృ— జననీజనకులారా! సుభద్రాయత్తంబైన యీ యతికైతవుని చిత్తం బలరింప సుభద్రాదానంబేకదా ముఖ్యసాధనము. ఏతచ్ఛుభకార్యంబు నెరవేర్ప కాలవిళంబనం బేలఁ జేసెదరు? శీఘ్రంబుగఁ గర్తవ్యం బాచరింపుఁడు.

వసు— మంచిది. పురోహితవర్యా! అవశిష్ట మేమి?

పురో— రాజచంద్రములారా! సుభద్ర దేయావశిష్టము.

దేవ— కృష్ణపక్షయుతుండగు నీ యతికైతవునకు మన రాజావనయగు సుభద్రవల్లనే శుక్లపక్షసిద్ధియగును. అదిగో! రుక్మిణి యచ్చోటనే యున్నది. (అని రుక్మిణితోఁ) కోడలా! నీవు శీఘ్రంబుగ జని సుభద్రను దోడ్కొనిరమ్ము.

రుక్మి— మంచిది. (అని నిష్క్రమించి వెంటనే సుభద్రతోఁ దిరుగఁబ్రవేశించుచున్నది)

సుభ— (గురువుల కభివందనం బాచరించి వ్రీడావతియై శిరము వంచుకొనుచున్నది)

యతి— గురువర్యులారా! కపటవటునాపరాధుండగు నర్జునుం డిదే నమస్కరించుచున్నాఁడు. (అని సాష్టాంగదండప్రణామం బాచరించి లేచి)

మ. ఘోసగన్ జిన్నటనుండియుండొరులకూర్మిల్ తీర్థయాత్రాప్తిఁగృ
ష్ణసహాయంబుననే యతిందుర్వినయి కన్యం బెండ్లియాడంగ నం
తనముం జెంద యొనర్చినట్టి యపరాధంబుల్ కృపన్ దేవకీ
వసుదేవోత్తములార వత్సలత నన్మానించి సైరింపరే.

(అని కృతాంజలి యగుచున్నాఁడు)

[అంత పటాక్షేపంబుగ సాత్యకి ప్రవేశించి]

సాత్య—జననీ జనకులారా! ఈ యతిరూపధరుం డర్జునుండనియు వీనికి సుభద్ర నిచ్చి రహస్యోచితంబుగ వివాహము చేయుటకే యీ యుత్సవ వ్యాజంబు కల్పింపఁబడినదనియు నారదమునీంద్రునిచే విని పెద్దన్నగారు మహాకుపితులై యాదవానీకంబులోడ ససంభ్రమంబుగ మరలివచ్చుచున్నారు. ఈసంగతిఁ దెలుప నే ముందు వచ్చితిని. కర్తవ్య మాచరింపఁ ద్వరపడవలయు.

శ్రీకృ—అర్జునా! నీ వీ రామామణిని రాక్షస వివాహంబుగా నరదంబుపై నెక్కించుకొని శీఘ్రంబుగ నింద్రప్రస్థపురంబునకుఁ జనుము.

అర్జు—మంచిది (అని యట్లు చేయుచున్నాఁడు)

శ్రీకృ—జననీజనకులారా! మన కోరికలన్నియు నెరవేరినవి కదా. ఇంక నేమి కావలయును?

భరతవాక్యము.

వసు—చ. భువనవదాన్యులై ఘనులు భూమిపతుల్సకలార్థ సిద్ధి జెం
ది విమలనీతివర్తిలి స్వదేశరతి న్విలసిల్లుగాత స
త్కవు లనిశంబు సత్కృతుల ధారుణి వర్ధిలుగాత క్షామర
గ్వివిధ మహోగ్రబాధలను వీడి జనుల్సుఖులై వెలంగుత

శ్రీకృ—తథాస్తు. (అని యందఱు నిష్క్రమించుచున్నారు)

గద్య.

ఇది శ్రీమద్వేంకటరమణ కరుణాకటాక్ష వీక్షణాపార సమాపాదిత రస
బంధుర కవిత్వవైఖరీ ప్రవీణ ఆపస్తంబసూత్ర శాండిల్యసగోత్ర పవి
త్ర హోతృకుల కలశార్ణవ రాకా కైరవమిత్ర వేంకటరత్న
సుపుత్ర వేంకమాంబా గర్భశుక్తి ముక్తాఫల వివిధ
విద్వజ్జన విధేయ వేంకటకృష్ణనామధేయ ప్ర
ణీతంబయిన సుభద్రార్జునీయం బను
నాటకరాజంబున
సర్వంబును
షష్ఠాంకము.

PRINTED AT T... COCANADA.